# మాటల మధ్యలో రాలిన ముత్యాలు

3-87

Acc. No. 20742

కర్త :

డా॥ మోపిదేవి కృష్ణస్వామి
ఎం. ఏ., పిహెచ్. డి.

కూర్పు :

సిహెచ్. మధుమోహన్ రావు

3273
Rop

ది యూనివర్సల్
హ్యూమానిటేరియన్ ఎడ్యుకేషన్
ట్రస్ట్ ప్రచురణ

ప్రథమ ముద్రణ

[illegible] - 1987

ప్రతులు - మూడు వేలు

ACC No 2074...

అన్ని హక్కులు గ్రంథకర్తవి

వెల : రూ. 8/-

ప్రచురణ :

ది యూనివర్సల్ హ్యూమానిటేరియన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్

ముప్పాళ్లవారిపాలెం,

విశాఖపట్నం - 17.

ముద్రణ

"వికాస్ ప్రింటర్స్"

గాంధీనగరం, విజయవాడ - 3. ఫోన్ : 63972.

# అంకితం

మానవధర్మాన్ని శిక్షణ పొందదలచినవారందరికీ

# కృతజ్ఞతలు

సోదరుడు మధుమోహన్ దీక్షతో చేసిన కృషికి ఫలితంగా ఈ గ్రంథం వెలువడుతోంది అతనికి మా శుభాకాంక్షలు ఇలాంటి ప్రయత్నం అతడింకా కొనసాగించాలని, ఈ ముత్యాల హారాలను ఇలాగే అందిస్తూ ఉండాలని కోరుతున్నాము మరికొందరు యువకులుకూడా తాము మాష్టరు గారినుండి పొందుతున్న శిక్షణ ఆధారంగా ఇలాంటి ప్రయోజనాత్మకమైన గ్రంథాలను రూపొందిస్తూ ఉండాలన్నది మా ఆకాంక్ష.

సోదరుడు చేసిన ఈ ప్రయత్నానికి చక్కని రూపమీయడంలో తాముగా కృషిచేసిన శ్రీ ఎల్. ఎన్. శర్మగారికి, వారి బృందమునకు మా కృతజ్ఞతలు. శుద్ధప్రతిని రూపొందించి ఇచ్చినటువంటి శ్రీమతి ధారా భవానీదేవిగారికి మా కృతజ్ఞతలు. ముఖచిత్రానికి రూపకల్పన చేసిన సోదరుడు దాసు. అతనికి మా శుభాకాంక్షలు.

మన సంస్థపేరు మానవధర్మ శిక్షణ సంస్థ. మానవధర్మాన మన సంస్థనుండి ఈయబడుతున్న శిక్షణ సరసమైన పద్ధతిలో ఈ సంపుటాలుగా అందించబడుతున్నది. ఆబాలగోపాలం ఈ మా ప్రయత్నాన్ని హృదయంతో స్వీకరిస్తారని విశ్వసిస్తున్నాము.

ప్రచురణ విభాగము,

మానవధర్మ శిక్షణ సంస్థ.

# ఇందులో....


పుట

ఆ విశ్వాసం నాకున్నది

ముత్యాల సరం

దివ్యమైన ఆహారం

మాటల మధ్యలో రాలిన ముత్యాలు

1. క్షీర సందేశం - 1
2. నిద్ర - ఉపవాసం - యోగసాధన - 4
3 గోవు కొరకు - 11
4 ఆ తల్లీ బిడ్డల్ని చూడు ! - 13
5 ఉద్యమానికి తెలుసు - 17
6 రూపాయలు - రూపాలు - 20
7. తలుపును కొట్టినా ! - 22
8. పీనుసుబట్టి - 29
9. జీవిత చక్రం - 30
10. అలా ఆవలించకు - 32
11. లోటుల నుండి లోతులకు - 33
12. ఇంక వాటికి శ్రమెందుకు ? - 38
13. పెద్ద దిక్కు - 41
14. కస్తూరి నుండి కర్తవ్యం వరకూ - 46
15. డబ్బు - జబ్బు - 52
16. అందరూ వినవలసినదే - 56

17. పెద్దఃకేం నష్టంలేదు — 60
18. లోకం గొడ్డుపోలేదు — 63
19 బ్రహ్మకుకూడా అప్పులు ఉన్నాయి — 65
20. పూజమొక్క — 68
21. పెద్దల కోరిక — 69
22. మది విప్పాడు — 75
23. నిజమంటే — 77
24. నా పైసా నా కివ్వండి — 78
25. నేలవిడిచి సాముచేయుట — 81
26. నవ్వు దర్శమవుతోంది — 84
27. పట్టాలెక్కిస్తూనే ఉంటారు — 87
28. అగ్గిపుల్లకి గిపేముంది — 91

# ఆ విశ్వాసం నాకున్నది

మహనీయులతో కలిసి జీవిత ప్రయాణాన్ని నడిపే అవకాశం లభించడం ఒక గొప్ప అదృష్టం - ఒక మంచి అవకాశం. అందుకే మన పెద్దలు మహాపురుషుల ఆశ్రయం లభించడం అనేది ఒక అరుదైన అదృష్టంగా భావించారు. అటువంటి అదృష్టం నా జీవితానికి లభించడం, పరమగురువుల అనుగ్రహానికి నేను పాత్రుడ్నికావడం నా పూర్వపుణ్య విశేషంవల్ల జరిగింది అనడంకన్న పరమ భేదాలు ఎరుగని పెద్దల కరుణాకటాక్ష వీక్షణాలవల్ల జరిగినది అని నా కనిపిస్తున్నది.

విద్యార్థిదశలో ఉన్న నేను మాస్టర్ ఇ. కె. గారి రచనలకు దగ్గరై ప్రబోధింపబడ్డాను. నాకు వారిని చూడాలనిపించింది. వారితో కొంతకాలం గడపాలనిపించింది. కాని అంతలోనే వారు దేహత్యాగం చేశారన్న వార్త నా చెవులకు సోకింది. నన్ను కలవరపరిచింది.

ఇంతలో నేను సోదరులు రామనాథంగారికి దగ్గరయ్యాను. ఆయన మాస్టర్ ఇ. కె. గారి స్పర్శను బాగా పొందినవారు. మీరు కృష్ణస్వామి గారిని కలిస్తే మీకు కావలసింది మీకు దొరుకుతుంది అని ఆయన చెప్పారు. ఆ తరువాత గుంటూరులో జరిగిన ఇ. కె. మాస్టరుగారి జ్ఞానయజ్ఞంలో నేను కృష్ణస్వామిగారిని కలుసుకోగలిగాను. రామనాథంగారు చెప్పినమాట నిజమేననిపించింది. ఆపైన వరంగల్‌లో ఉంటూనే పరమ కృష్ణస్వామి గారికి లేఖలు వ్రాస్తూండేవాడిని. ఆయన శ్రమ అనుకోకుండా ప్రేమతో కావలసిన జవాబులు ఇస్తూఉండేవారు. వారు నాకు రాసిన లేఖలలో కొన్ని "స్వామి లేఖలు - కాంతిరేఖలు" లో కూడా చోటుచేసుకున్నాయి. ఆ

గ్రంథంలో "మనకథ దారిన పడుతుంది" అని ఒక లేఖ ఉంది. అది నాకు వ్రాయబడినదే అంతచిన్నలేఖలో మనిషికి కావలసినదంతా చెప్పారాయన. ఆ లేఖ నాకు ఇప్పుడూ గుర్తొస్తూ ఉంటుంది ఇలాంటి స్వామి లేఖలు నన్ను మానసికంగా కృష్ణస్వామిగారికి మరింత దగ్గరిచేశాయి. ఆయనదగ్గర నీకు కావలసింది దొరుకుతుంది అన్న రామనాథంగారి మాటలు నిజమవుతున్నట్లుగా నాకు అనిపించసాగింది.

నా గ్రాడ్యుయేషన్ పూర్తి అయిపోయింది. అక్కడ విశాఖలో World Teacher Trust అనే వేదికపైన కృష్ణస్వామిగారి పాత్రపోషణ కూడా పూర్తయినట్లు నాకు తెలిసింది. "మానవధర్మ శిక్షణ సంస్థ" విజయవాడ శాఖ ప్రారంభోత్సవానికి రమ్మని నాకు ఆహ్వానం అందింది. ఆహ్వానం అందినరోజే ప్రారంభోత్సవం. వెంటనే బయలుదేరాను. ఉత్సవానికి అందుకున్నాను. కార్యక్రమం పూర్తయినతరువాత ఏంచేస్తున్నావు అని అడిగారు కృష్ణస్వామిగారు. ప్రెస్ పని నేర్చుకుంటానని ఉంది అని చెప్పాను. అదేదో ఇక్కడే చేయవచ్చుగదా! అన్నీ కలిసివస్తాయి అన్నారాయన. అంతే! నేనిక వారి అంతేవాసి నయిపోయాను

ఇక శిక్షణ ప్రారంభమయింది. శాఖ ప్రారంభమయిన తొలినాళ్ళు గదా! ఎక్కువమందిమి లేము. ఇక ఆయన తమ దృష్టినంతా మాపైనే లగ్నం చేశారు ఆయన విజయవాడలో ఉన్నన్నిరోజులు మాకోసమే ఉన్నట్లనిపించేది. మాకువచ్చే ప్రతి ఆలోచననీ, మేం మాట్లాడే ప్రతి మాటనీ, మేంచేసే ప్రతిపనినీ ఆయన శ్రద్ధగా గమనిస్తూ కావలసిన సర్దుబాట్లు చెప్పేవారు. చేయవలసిన దిద్దుబాట్లు చేసేవారు. ఆ సర్దుబాట్లు, దిద్దుబాట్లు మరచిపోలేనివిగా ఉండేవి. వాటిని ఒక గ్రంథంగా కూర్పుచేస్తే చాలా బావుంటుంది అనిపించింది. కృష్ణస్వామిగారికి నా సంకల్పం చెప్పాను. "మాటల మధ్యలో రాలిన ముత్యాలు" గా కూర్పుచేయదలచాను

అని చెప్పాను. నవ్వుతూ ఆయన ఒకవిధంగా చూస్తే భగవద్గీత కూడా మాటల మధ్యలో రాలిన ముత్యాలేనోయ్ అన్నారు. రూపుదిద్దుకుంటే ఇది మాత్రం భగవద్గీత కాదా। అన్నాన్నేను ఆయన చిత్రంగా నవ్వారు. ఆ నవ్వురూపంలోనే తన ఆమోదాన్ని తెలియజేశారు. యువతరం అనే అర్జునుడికి ఉపదేశింపబడిన భగవద్గీతగా ఈ గ్రంథం రూపు ధరించింది. వారికి వినిపించాను మొత్తంమీద సాధించావు అన్నారాయన మీరు సాధించేటట్లుగా చేశారు అన్నాను నేను. మళ్ళీ ఆయన చిత్రంగా నవ్వారు. ఆయనలా నవ్వినప్పుడల్లా ఇలాంటి చిత్రాలు జరుగుతూనే ఉంటాయి.

గ్రంథాన్ని అందరిచేతా అన్నగారుగా పిలువబడే శ్రీ యస్. ఎన్. శర్మగారు చూశారు నిత్యజీవితానికి అవసరమయ్యే ఇలాంటి గ్రంథాలు ఎంతైనా అవసరమన్నారు. ఈ గ్రంథం శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ చూశారు. చాలా బాగున్నదని ముందుమాట వ్రాసియిచ్చారు. ఇప్పుడు మీకు అందిస్తున్నాను. మీరు చాలా బాగున్నదని, తప్పక చదివి తీరుతారు - మీ ప్రక్కవారిచేతి కందిస్తారు. ఆ విశ్వాసం నాకుంది.

మీ

సి. హెచ్. మధుమోహన్‌రావు

27 — 5 — 87.

# ముత్యాలసరం

ఇవి మాటల మధ్యలో రాలిన ముత్యాలు కావు - సత్యాలు. మనం ఒక్కొక్కటిగా ఒక్కొక్కరుగా ఏరుకోవలసిన శ్రమ తప్పించి సోదరుడు చక్కని దండ గుచ్చాడు. ఇక దానిని మనం కంఠస్థం చేసుకోవడమే మిగిలింది.

ఈ పుస్తకం ముత్యాలసరం ఎలా అవుతుంది? ముత్యాలున్నాయి. వాటికి ఏకసూత్రత ఏదీ? అనే ప్రశ్న ఏర్పడవచ్చు. ఈ ముత్యాలను దండగావిలిపి వాటిల్లో దాక్కున్న సూత్రం యువతరమే. ఆ సూత్రానికి ఔన్నత్యం తెవడానికే ముత్యాలు తమ గుండెలను బిడ్డలు చేసుకున్నాయి. తమలో దానికి చోటిచ్చాయి. తమ గుండెల్లో దాచుకొన్నాయి.

నిద్రాపరాయణమైన యువతకు ఇది పారాయణగ్రంథం కావాలి. క్రమశిక్షణ, కార్యనిర్వహణ దక్షత, సన్నివేశాల అంతర్యాలను ఆవిష్కరించగలిగే ఆలోచనా విధానం, జీవనపథంలో పవిత్ర సౌందర్య దర్శనం - ఈ ముత్యాలదండను కంఠస్థం చేయడంవలన కలిగే సుగుణాలు.

ముక్తాహారులై ముక్కుమూసుకొని మూల కూర్చోవడంకాదు తపస్సంటే. పదిమందిలో సమన్వయపూర్వకంగా పదిమందికీ పనికివచ్చే విధంగా జీవించటం చేతకావాలి. అదెలాగో ఈ ముక్తాహారం చెబుతుంది. ఇటువంటి ముత్యాల మూటలు, రతనాల రాసులు మనందరం యథాశక్తి కూడబెట్టుకుంటే జీవనానికి లోటు ఉండదనీ, లోతు తెలుస్తుందనీ మనవి చేస్తున్నాను.

విజయవాడ,

19-5-88. -పాలపర్తి శ్యామలానందప్రసాద్.

# దివ్యమైన ఆహారం

ఈ మాటలసముద్రంలో దాగిన ముత్యాలు ఒక హారంగా గ్రుచ్చి అందరికీ అందిస్తున్న చిరంజీవి మధుమోహన్ క్రమశిక్షణ కలిగిన యువకుడు. చిన్నప్పటినుండీ ఒక పద్ధతిలో జీవించడానికి అలవాటుపడినవాడు. మహనీయులన్నా, వారి రచనలన్నా అమితమైన గౌరవం, శ్రద్ధాసక్తులు కలిగినవాడు. జరుగవలసిన కథ ననుసరించి చిత్రంగా నాకు దగ్గరయినాడు. దగ్గరయినప్పటినుండి తన కప్పచెప్పబడిన పనిని తాను చేస్తూనే నాక్కావలసిన నిత్య అవసరాలను చూడటం ఒక వ్రతంగా పెట్టుకున్నాడు. అంతేకాక అవకాశమున్నప్పుడల్లా నాకు దగ్గరగా ఉంటూ నే నెవరితో దేనిని గూర్చి మాట్లాడుతున్నా శ్రద్ధగా వింటూ ఉండటం అలవాటు చేసుకొన్నాడు. ఊరికే వినటంవల్ల ప్రయోజనమేమున్నదని ఆయా అంశాలను చక్కటి పద్ధతిలో వ్రాసిఉంచటం మొదలుపెట్టాడు. ఈ వ్రాసిఉంచినవి వ్రాతప్రతిగా ఉంటే నాఒక్కడికే పనికివస్తాయి - గ్రంథరూపం ధరించి బయటకువెడితే ఎంతోమందికి ఎల్లకాలం పనికివస్తాయి అన్న ఆలోచన అతనికి కలిగింది. నాతో చెప్పాడు. ఆలోచన బాగున్నదీ అన్నాను. సందేశం వెలువడటానికి ఈ నా దేహం ఎలా వినియోగపడుతున్నదో - ఆ సందేశాన్ని క్రోడీకరించి అందించడానికి అతనిదేహం అలాగే వినియోగపడుతున్నదని గ్రహించాను. మానవధర్మ శిక్షణ సంస్థ వెలిసింది. ఆ ధర్మశిక్షణ ప్రారంభమైంది. ఆ శిక్షణకు సంబంధించిన అంశాలు ముద్రింపబడి అందరికీ అందితే ఆ శిక్షణ కావలసినవారందరికీ అందుబాటులోనికి వెడుతుంది. అందుకే అతనికీ సంకల్పం కలిగింది అనిపించింది. కథనుబట్టి పాత్రలు ప్రవేశిస్తాయి. ప్రవేశిస్తున్న పాత్రల ఊతంతో కథ ముందుకు సాగిపోతూ ఉంటుంది. ప్రారంభమైన ఈ క్రొత్తకథకు కావలసిన పాత్రధారులు ఒక్కొక్కరే ప్రవేశిస్తూ కథను ముందుకు తీసుకొని వెడుతున్నట్లుగా గోచరిస్తున్నది

ఈ "మాటల మధ్యలో రాలిన ముత్యాలు" అనే గ్రంథం ఒక శిక్షణ గ్రంథం. నిత్యమూ మన మలవరచుకోవలసినవీ, మనం అనుష్ఠించవలసినవీ ఎన్నో అంశాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. అలాగని ఈ గ్రంథం చదువరికి ఇబ్బంది పెట్టదు. ఔషధం మంచిదని తెలిసినా సేవించడానికి రోగి ఇబ్బందిగా ముఖం పెడతాడు కదా! కనుక నీ వందించబోయే గ్రంథం మంచిదైనంత మాత్రంచేత సరిపోదు. అది ఔషధంలా కాకుండా ఆహారంగా రూపుదిద్దుకోవాలి. ఆహారం ఏం చేస్తున్నది? బాగున్నదని మనం తింటున్నాం. ఆ తింటున్నప్పుడు మనకు కావలసిన రుచిని అందిస్తూనే మనకు కావలసిన శక్తినికూడా అనుగ్రహిస్తోంది కదా! అలాంటి దివ్యమయిన ఆహారంగా రూపొందాలి నీ రచన" అని చెప్పాను. శ్రద్ధతో అలాంటి ప్రయత్నమే చేశాడు. చదివి వినిపించాడు. చెప్పబడిన అంశాలను చక్కగా ఆకళించుకున్నాడనిపించింది. యువకులకు కావలసిన గ్రంథాన్ని ఒక యువకుడే పూనుకొని అందించినందుకు ఎంతో సంతోషం కలిగింది.

రోజురోజుకూ మనం కొంతయినా ఎదగాలి. కొంతయినా వికసించాలి అని అభిలషించే మనస్తత్త్వం మధుమోహన్‌ది. తనతో పాటు తనతో ఉన్నవాళ్ళలోకూడా అలాంటి ఎదుగుదలను, వికాసాన్ని గమనించి మురిసిపోతూ ఉంటాడతను. తనతో ఉన్నవారిలో ఎవరిలోనైనా ఆ ఎదుగుదల, వికాసం అంతగా గోచరించనప్పుడు బాధపడిపోతాడు. స్నేహపూర్వకమైన ఆర్తితో ఎదిగిరమ్మని వారిని హెచ్చరిస్తూ ఉంటాడు. ఈ మాటలమధ్యలో రాలుతున్న ముత్యాలను మరిన్ని భాగాలుగా కూర్చిచేసి లోకానికి అందించాలని అతని సంకల్పం. శుభం. అతని సంకల్పం తప్పక రూపుదిద్దుకుంటుంది. అతని ఆశయం తప్పక సిద్ధిస్తుంది. ఇలాగే జాతికి కావలసిన అనేక రంగాలలో ఇతనినుండి కృషి వ్యక్తం కావాలని శుభాశంసనం చేస్తున్నాను.

విజయవాడ,

26-5-1987.

మోపిదేవి కృష్ణస్వామి.

# క్షీర సందేశం

ప్రేయరు చివరకువస్తోంది. తలుపు దబదబా మ్రోగింది. యువకుడొకడు అయిష్టంగానే లేచి తలుపుతీసి పాలప్యాకెట్ తీసుకొని లోపలపెట్టాడు.

ప్రేయరు పూర్తి అయింది. కృష్ణస్వామి మంచంమీద కూర్చునిఉన్నారు. యువకుణ్ణి పిలిచి కూర్చోబెట్టుకున్నారు.

"రోజూ పాలమనిషి తలుపుబాదడం వినబడటంలేదే!" అన్నారు.

"ఈ కిటికీతలుపు తీసి అట్టిపెడతాం, కిటికీలో నుండి పాలప్యాకెట్ లోపలకు పెట్టి వెళ్ళిపోతుంది" అన్నాడతను.

"మరి ఈరోజు ?" అన్నారు కృష్ణస్వామి.

"కిటికీ తలుపు తీసిపెట్టడం మరచి పోయాం." అన్నాడతను బాధగా.

“పరవశమూ ఎంత పనిచేసిందో,”

నిజమేనన్నట్లు చూడకూడదని పశ్చాత్తాపపడుతూ,

మాష్టరుగారిలా అన్నారు. “పరవశిస్తోంది మనసు కదా! పొంచిచూసినది తప్పన్నట్లు చూడవద్దు! ఏం? ప్రేమలు అయ్యేదాకా ఆగితే ఆమె సొమ్మేంపోయింది అని నీ కనిపించింది కదూ? అవునా?

నీ ప్రేయసి ఎప్పటికి వస్తుందో ఆమెకేం తెలుసు. అదీగాక నీకు నీప్రేయసి ఎంత ముఖ్యమో ఆమెకు ఆమె పనంత ముఖ్యంకదా ఏమంటావ్? ఒకవేళ, ఆమె పాదన్యాసం గలిగి ఆగిందనుకుందాం, మనలాగా ఆమెకోసం ఎంతమంది ఎదురు చూస్తూ ఉంటారు! ఆ ఎదురుచూసేవాళ్ళల్లో పసిపిల్లల కళ్ళు కూడా ఉండవచ్చుగదా!

ఆధ్యాత్మిక సాధన పైలోకాల సౌందర్యంలో మునిగిపోవడానికి కాదు. ఆ పైలోకాలనుండి వెలుగును స్వీకరించి క్రిందిలోకాలను వెలిగించుకోవడానికి, దినచర్యను వెలిగించుకొని దివ్యంగా, సవ్యంగా నడుపుకోవడానికే దైవప్రార్థన. నీ దినచర్య క్రమబద్ధం కావడమే నీవుచేసే ప్రార్థనకు గమ్యం. నీ ప్రార్థన, నీ ధ్యానం, ఏస్థితిలో ఉన్నాయో నీ దినచర్యే స్పష్టంగా తెలియచెబుతుంది. జాగ్రత్త!” అంటూ మందలింపుగా చూశాడు కృష్ణస్వామి.

కాస్సేపాగి — క్రొత్తగా నవ్వుతూ ఇలా అన్నారు, చూశావా! పాలు ఎంతపని చేసాయో! మనలో అనురాగపు తొందరలో పడ్డ మా పాలు, జాగ్రత్తపడమని సందేశమిచ్చాయి. దీనినేమంటారో తెలుసా! 'క్షీరసందేశం' అంటారు. ఎలావుంది క్షీరసందేశం!"

"బాగుంది తప్పకుండా జాగ్రత్తపడతాను" అన్నాడా యువకుడు తనను తాను కూడదీసుకుంటూ. కొద్దిసేపాగి మళ్ళీ అతనిలా అన్నాడు. "చూస్తుంటే ప్రతిసన్నివేశమూ సందేశమిచ్చేటట్లే ఉన్నదే."

కృష్ణస్వామి ప్రసన్నంగా చూస్తూ ఇలా అన్నారు. ఇచ్చేటట్లున్నది అనికాదు, ఇచ్చేందుకే ఉన్నది అని మనం గ్రహించాలి. వేరుశనగకాయలో పప్పున్నట్లు సన్నివేశంలో సందేశం ఉంటుంది. వేరుశనగకాయను వలిచి పప్పు తీసుకున్నట్లు, సన్నివేశాన్ని చూడవలసినతీరులో చూడగలిగితే సందేశం ఇస్తూ ఉంటుంది. ఇప్పుడీ చిన్న సన్నివేశమే చూశావుగదా! పాలుకూడా మన లోపాలు ఎత్తిచూపించవా!

"అయితే ప్రతి సన్నివేశాన్ని ఇలాగే చూస్తూ పోవాలి" అన్నాడా యువకుడు తనకేదో బోధపడుతున్నట్లుగా చూస్తూ!

చూడు! చూడు! అలా చూడటానికే మనిషికి మనస్సు ఉపయోగపడింది. ఇదేమీ చూడకుండా పాలు కాఫీ కలుపుకొని త్రాగేస్తుంటే మనమున్నా మనమే. మనస్సుంటే విప్పుకొని

కుక్క మొదలైనజంతువులకు లేదాఏముంది ? వాటికన్నా విశిష్టమైన, సౌకర్యవంతమైన, పరిపూర్ణమైన మానవదేహం మనకీయబడినందుగాను మనం ప్రత్యేకించి చేస్తున్నదేమున్నది ? ఏమంటావ్ ! దేశానికి న్యాయంకాదు, ముందు నీ దేహానికి న్యాయం చేకూర్చు. అది నీ కీయబడినందుకు సద్వినియోగం చేయి. అప్పుడు దేశశ్రేయస్సు దానికదిగా సిద్ధిస్తుంది.” అంటూ ఆ యువకుణ్ణి వెన్నుతట్టారు కృష్ణస్వామి ●

## నిద్ర - ఉపవాసం - యోగసాధన

“ఇవాళ భోజనం కొంచెం ఎక్కువైనట్లుందండీ! ఏమిటోగా మత్తుగా ఉందంటూ” ఆవలించాడు మాలోని ఒక యువకుడు. ఇంచుమించుగా మిగిలినవాళ్ళంకూడా అదేస్థితిలో ఉన్నాం. మిత్రులఇంటిలో అందరికీ ఆతిథ్యం. కొంచెం వేళ తప్పింది ఎంతవద్దనుకున్నా దోసుకొంచెం ఎక్కువగానే పడింది.

మావాడు మరొక ఆవలింత తీస్తూ, “భోజనం ఎక్కువ కావడానికీ, కునిద్ర ముంచుకు రావడానికీ సంబంధం ఏమిటి మాస్టారూ ?” అంటూ అరమోడ్పు కన్నులతో ఆయనవైపు చూశాడు.

మాస్టరుగారు చిన్నగా నవ్వుతూ "ఆ వస్తువ్యాదానిపని చూడు. సమాధానం తరువాత సావధానంగా చెప్పుకుందాంలే. ఒకవేళ నేనిప్పుడు చెప్పటం మొదలుపెట్టినా, నిద్రాదేవి ఇప్పుడు నిన్ను విననివ్వదు. నీ రెప్పలపైన కూర్చుంటుంది. దానితో నీ రెప్పలు బరువెక్కుతాయి. నీ చెవులు మూసేస్తుంది. దానితో నీ చెవులకు ఘడియలు పడతాయి. నీ శరీరాన్ని నెట్టేస్తుంది. దానితో నువ్వు వేసుకొని ఉంటే పక్కపైన లేకపోతే ప్రక్కనున్నవాళ్ళపైన పడిపోక తప్పదు. అదిగో చూశావా అప్పుడే అవన్నీ జరుగుతున్నాయి. ఆ ప్రక్కనున్నవాళ్ళ రక్షణార్థం. ఆ కొంచెం తెలివుండగానే, నీ పక్కపైన నీవు వాలిపో. నేనూ ఒక కునుకుతీస్తాను. లేచినతరువాత కాఫీ త్రాగుతూ సాఫీగా మాట్లాడుకొందాం" అంటూ మాస్టరుగారు ప్రక్కకుతిరిగి పడుకున్నారు. పడుకున్నదే తరువాయి నిద్రలోనికి వెళ్ళిపోయారు. మేమూ నిద్రలోనికి వెళ్ళిపోయాం. నిద్రాదేవి ఒడి ఎంతపెద్దదో! ఆ ఒడిలో ఎంతమందికైనా ఇట్టే చోటు దొరుకుతుంది.

కాఫీలు త్రాగుతూ ఉండగా మావాడు మళ్ళీ కదిపాడు "మాస్టరుగారు చెప్పండి" అంటూ.

"ఏమిటి ?" అన్నారు ఆయన.

"నిద్రకథండీ" అంటూ సాగదీశాడు మావాడు.

“ఏదీ, మోహనా! ఒక్కటే పద్యమన్న పత్రికనేనా? చెబుతాను విను! మీ ఇంట్లో గ్రైండరు ఉందికదా. ఒక గంట పాటు ఆ గ్రైండరుతో కొంచెం ఎక్కువసేపుగా దురో పప్పు రుబ్బవలసి వచ్చిందనుకో; ఏంచేస్తారు? మిగతాగదుల్లో ఉన్న లైట్లు, ఫ్యానుల్లో ఎక్కువభాగం తీసేస్తారు. ఎందుకో తెలుసా? అన్నీ అలా వెలుగుతూ, తిరుగుతూఉండగా మనం గ్రైండ్ చేయడం మొదలుపెడితే ఓల్టేజి డౌనై ఫ్యూజ్ ఎగిరిపోవచ్చు. అందుకనే ముందుగానే జాగ్రత్తపడతారు. కావలసిన ఓల్టేజిలో కరెంటు గ్రైండరుకు అందడంకోసం మిగిలినవాటిని ఆర్పేస్తూ తగ్గిస్తారు అప్పుడు పని సాఫీగానడచిపోతుంది. గ్రైండరుతో పని పూర్తికాగానే మనం మళ్ళీ అన్నింటిని యథాతథంగా వాడుకుంటూ ఉంటాం అవునా ?” అడిగారు కృష్ణస్వామి.

అవునంటూ తల ఊపాడు మోహను. అతనితో పాటు మేమూ ఊపాము.

శ్రద్ధగా వినండిమరి, అన్నారు కృష్ణస్వామిగారు ఇంకా ఇలా కొనసాగించారు. “మన శరీరంలోని ప్రాణశక్తి కూడా ఆ కరెంటులాంటిదే లాంటిదే ఏమిటి! ఏది మనం కరెంటని పిలుస్తున్నామో అదే ఇక్కడ మనశరీరంలో ప్రాణశక్తిగా పనిచేస్తున్నది. ఇప్పుడు భోజనం చేసావ్, ఇంట్లో మీ అమ్మగారు గ్రైండరుకు పనిపెట్టినట్లు, నీ జీర్ణాశయానికి పెద్దమోతాదులో పని అంటగట్టావ్. అప్పుడేం

చేయాలి? జీర్ణాశయం తనకప్పజెప్పిన పనిని సక్రమంగా పూర్తి చేయాలి. అంటే కరెంట్ కూడా ఎక్కువ మోతాదులో రావాలి. తనకు సిక్రై పనిచేస్తున్న కరెంటు - అంటే ప్రాణశక్తి అటువైపు మొగ్గుతుంది. దానితో మనస్సు బాగా పనిచేయ టానికి, కళ్ళు, చెవులు మొదలైనటువంటి ఇంద్రియాలద్వారా ఆ యా వ్యాపారాలను నిర్వహించడానికీ కావలసిన కరెంటు ఆ కాసేపు అందదు దానినే మనం నిద్ర అంటున్నాం. జీర్ణా శయం తనపని తగుమాత్రం పూర్తిచేసుకోగానే మళ్ళీ వీటికి కరెంట్ సప్లయ్ అందుతోంది. దానినే మనం మెలకువ అంటున్నాం. అయితే మీ ఇంట్లో లైట్లు, ఫ్యానులు మీరు స్వయంగా తగ్గించి జాగ్రత్తపడాలి మన శరీరంలో ఈ ఏర్పాటు ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. అది ఎన్నో, సకాలంతో పాటుగా ప్రకృతిమాత మన కందించిన మరోవరం"

మేం వింటున్నాం. ఆ చెబుతున్నది ఎంతగా అర్థం అవు తోందో అంతగా ఆశ్చర్యాన్నికూడా కలిగిస్తోంది. సైన్సును కామన్‌సెన్సుతో జోడించి అనుభవానికి అందిస్తున్నారాయన. ఇది ఒకకళ, ఒక నైపుణ్య విశేషం.

శ్రద్ధగా వింటున్న మమ్మల్ని చూస్తూ ఆయన ఇంకా ఇలా అన్నారు. "అందుకే ఉపవాసాది వ్రతాల్లో లఘువుగా ఆహారం తీసుకోమన్నారు పెద్దలు. ఉపవాసం అంటే ఏమిటి? సమీపాన వసించటం. అంటే దైవానికి దగ్గరగా జీవించటం

గడం, అంటే మనస్సు ఆయన స్మరణలో నిలబడగలగడం. ఇప్పుడు పని మనస్సుకు పడింది. ఇప్పుడిక కరణం ఇటు కావాలి. కనుక అటు తగ్గించమన్నారు. జీర్ణకోశానికి భోజనంపేరిట ఎక్కువ పనిపెడితే ఇందాక నేను చెప్పిన కథంతా మళ్ళీ జరుగుతుంది. కనుక మనస్సు చురుకుగా పని చేయటం కోసం ఆహారాన్ని తగ్గించమన్నారు. తగ్గించడం అంటే మానడం అని అర్థంకాదు మరి. చేస్తే ఇటు చేస్తారు, లేకపోతే అటుచేస్తారు. శుభ్రంగా లాగించి నిద్ర అయినా పోతాడు. లేదా ఉపవాసంపేరిట కడుపును మలమలా మాడ్చిఅయినా వేస్తాడు.

ఉపవాసవ్రతంలో శరీరాన్ని మాడ్చకూడదు. ఆహారాన్ని తగుమాత్రం అందించాలి. మనస్సు భగవంతుణ్ణి స్మరించుకోవడానికి అడ్డురాకుండా అందించగలగాలి. ఘనాహారం తక్కువగాను, ద్రవాహారం ఎక్కువగాను అందించడం మంచిది. బరువైన పదార్థాన్ని అందించడం మాని లఘువైన, శక్తిమంతమైన పదార్థాన్ని అందించాలి. అంటే క్వాంటిటీ తగ్గి క్వాలిటీ పెరగాలి. అంటే జీర్ణకోశానికి పని పెరగకూడదు. శరీరానికి అందేశక్తిలో తరుగుదల ఉండకూడదు. అప్పుడు మనస్సు చురుకుగా ఉత్సాహంగా పని చేస్తుంది. దైవస్మరణలో అప్రయత్నంగా నిలబడుతుంది. అంటే దైవానికి సమీపాన వసిస్తున్నది. అవగా ఉపవాసం

చేస్తున్నది. మాకారా! నిజానికి ఉపవాసంచేస్తున్నది, మనస్సు. దానికి సహకరిస్తున్నది మన జీర్ణకోశం. కాని మన మేమను కొంటున్నాం. ఉపవాసంచేస్తున్నది మనజీర్ణకోశమని భ్రమ పడి దానిని మాడ్చిపారేస్తూన్నాం. ఉపవాసం అంటే అసలర్థం మనకు తెలియక పోవడంవల్ల ఈ అనర్థం అంతా జరుగుతోంది. బాబోయ్! అంటూ విలవిలలాడిపోతుందా జీర్ణకోశం. విలవిలలాడి పోతూ కొందరిని దారిలోనికి తెచ్చేసుకుంటోంది. అన్నాన్ని భిన్నంచేసి తిను ఫరవాలేదు అని నచ్చచెబుతోంది కొందరికి - రకరకాల ఫలాలను తిన్పిస్తోంది - ఇంకొందరిచేత వండింది తినకుండాఉండాలి అని నచ్చచెప్పుకొనేటటుచేస్తుంది వారిని. ఇంకొందరిని అన్నంరూపంలో కాకుండా, అదికూడా వరి అన్నం రూపంలో కాకుండా ఇంకా ఏరూపంలో ఎంత తీసుకున్నా అది ఉపవాసమేనని అనుకునేటట్లు చేస్తుంది.

దానితో పళ్ళకొట్లకూ, బేకరీలకూ, మిఠాయి దుకాణాలకూ, హోటళ్ళకూ, రద్దీ పెరుగుతుంది. ఉపవాసం చేసిన వారి సిద్ధిమాట ఎలాఉన్నా, అందువల్ల పెరిగినరద్దీతో ఆయా వ్యాపారాలవాళ్ళకు ఎక్కువమోతాదులో లాభంమాత్రం సిద్ధిస్తూ ఉంటుంది. ఇలా రకరకాల వికారాలపాలైన ఉపవాసవ్రత నిర్వహణలో జరగవలసిన ధర్మసంస్థాపన చాలా ఉంది."

ఉపవాసవ్రతం, దాని ఫలం మాకు సిద్ధించినట్లయింది. ఆయన మాటల ఊతంతో మా మనస్సు ఆయనకు మరింత దగ్గరౌతోంది.

మాలోని ఆసక్తిని గమనిస్తూ ఆయనింకా ఇలా అన్నారు: ఉపవాస వ్రతంలోనే కాదు. మనస్సుతో పనిచేయవలసిన వాళ్ళందరూ జీర్ణకోశానికి బరువైన పని చెప్పకుండా మెలకువ గలిగి ఉండాలి. మనం చూస్తూఉంటాం: కాయకష్టం చేసేవారు తీసుకున్నంత ఆహారం మానసికంగాపనిచేస్తున్నవారు తీసుకోలేరు. శరీరంతో పనిచేయవలసినవాళ్ళకు జీర్ణకోశానికి పని చెప్పకతప్పదు. చెప్పడం అవసరం వాళ్ళకు మనస్సుతో పెద్దగా పనిఉండదు. వాళ్ళమనస్సు పెద్దగాపనిచేయదుకూడా మానసికమైన కృషి చేయవలసినవాళ్ళకూ జీర్ణకోశానికి తగుమాత్రంగా, వాళ్ళ కృషికి తగినమాత్రంగా పనిచెప్పవలసిఉంటుంది. వీళ్ళకు మనస్సు పనిచేసినంత శక్తిమంతగా శరీరం పనిచేయకపోవడం మనకు కన్పిస్తూనే ఉంటుంది.

ఒక్క యోగసాధనలో ఒడుపు చిక్కినవారికిమాత్రం వారు పాటించే క్రమశిక్షణనుబట్టి శరీరం మనస్సు సందర్భాన్ని బట్టి శక్తియుక్తులను వ్యక్తం చేయగలిగిన స్థితిలో ఉంటాయి. కనుకనే వారు కర్తవ్యనిర్వహణానికి అనుగుణమైన ఆహారాన్ని ఎప్పటికప్పుడు ఎన్నుకొని స్వీకరిస్తూ ఉంటారు.

ఆయన చూపులు వివరణ సరిపోయింది కదా! అని అడుగుతున్నట్లున్నాయి. ఇప్పటికేకాదు. ఎప్పటికీ కావలసినది కనిపెట్టి అందించే ప్రేమస్వరూపం ఆయనది. అడిగినదే తడవుగా ఆయాలోకాంలోనికి అడుగులు వేయించేస్తారాయన.

# గోళ్ళు కొరకడం

ఒకరోజు రాత్రి పనిని పూర్తిచేసి పడుకోబోయే ముందు మాస్టరుగారితో ఇష్టాగోష్ఠి నడుపుతున్నాం. రోజూ అలా కాసేపు ముచ్చటలాడుకొని ఆ అనుభూతిలో నిద్రలోనికి వెళ్ళిపోవడం మాస్టరుగారితో ఉన్న మా యువకులందరికీ అలవాటు. నడుస్తున్న సంభాషణలో పాల్గొంటూనే ఒక కుర్రవాడు తనకు మరీ ఇష్టమైన పనిని కొనసాగిస్తున్నాడు. అంటే గోళ్ళుకొరుక్కుంటూ కథను వింటున్నాడు. మాస్టరుగారి కళ్ళు అతనిపైన బడ్డాయి. అది గమనించిన ఆ కుర్రవాడి ముఖంలో కొంచెం జంకు గోచరించింది. కాని చేయకుండా ఉండలేక పోతున్నాడతను.

కృష్ణస్వామి అతని కళ్ళలోనికి సూటిగా చూస్తూ ఇలా అన్నారు: ఒరేయ్! గోళ్ళు కొరక్కు! అది ఏవిధంగాను మంచి అలవాటుకాదు పెద్దవాళ్ళలో ఉన్నప్పుడు అలాచేస్తే అసహ్యంగా ఉండి అపహాస్యాన్ని కలిగిస్తుంది. పెద్దవాళ్ళముందు కొరకడం మానాలిఅంటే విడిగా. ఒంటరిగా ఉన్నప్పుడుకూడా నీవు గోళ్ళు కొరకడం మానాలి.

కొంచెంసేపాగి కృష్ణస్వామి ఇలా అన్నారు. గోళ్ళు కొరకడం నరాల బలహీనతను [Nervesness] తెలియజేస్తుంది. సన్నివేశాలు ఒకస్థితిని దాటినపుడు అవి మంచివైనా, చెడ్డవైనా, ఎక్కువగా స్పందిస్తారనీ, తట్టుకోలేరనీ తెలుస్తుంది. కొందరు మరీ నరాలవత్తిడి అనుభవించే వాళ్ళుంటారు. (Emmotional Fellows) వాళ్ళు రక్తం కారిపోతున్నా గోళ్ళు

కొరుకుతూనే ఉంటారు. అంతే గోళ్ళనుదాటి వ్రేళ్ళకూడా కొరికేస్తున్నారన్నమాట !

ఒకసారి మేము ఒక సినిమాకు వెళ్ళాం. సినిమా హాలులో మా ప్రక్కన ఒక కుర్రవాడు కూర్చునివున్నాడు. చాలా చురుకైనవాడే. ఇంటర్వెల్‌లో మాతో కబుర్లుకూడ చెప్పాడు. ఆతరువాత ఒక అరగంటకు అతనివైపు చూశాను. అతని మోచేతిక్రిందనుండి రక్తం ధారగా కారుతోంది. అతనిచేయంతా రక్తంతో తడిసిఉంది. ఇంకా అతను గోళ్ళు కొరుకుతూనే ఉన్నాడు. ఏంలేదు. సినిమాలో పట్టయిన సన్నివేశం నడుస్తూ ఉన్నది దానికితట్టుకోలేక అలాచేస్తున్నాడతను. కొద్దిగా అతన్నితట్టాను. నావైపు చూసిన అతనిచూపుల్ని ఆచేతివైపుకు మరల్చాను. అదంతా ఎప్పుడుజరిగిందో తనకు తెలియదన్నట్లు చూస్తున్నాడతను. జేబురుమాలుతో తుడుచుకున్నాడు. మళ్ళీ సినిమాలో నిమగ్నమయ్యాం కాసేపాగి అటు చూశాను. మళ్ళీ అతనుతనకుతెలియకుండానే గోళ్ళుకొరకడానికి ఉద్యుక్తుడవుతున్నాడు. నేను చెయ్యిపట్టుకున్నాను. "సారీసార్! ఏమిటో ఇదొక బాడ్‌హాబిట్. మనస్సుకేమాత్రం టెన్షన్ వచ్చినా నాకు తెలియకుండానే ఇలా జరిగిపోతూ ఉంటుందండి అన్నాడతను.

"మాస్టరుగారూ, మరి హోమియోలో దీనికికూడా మందు ఉంటుందంటారుగదా", అడుగాడొక సోదరుడు.

"దీనికని ఉండదు. మనిషికని మందువేస్తే ఈలక్షణం కూడా దానికదిగా తగ్గిపోతుంది" అంటూ అసలుసంభాషణలోకి వచ్చారు కృష్ణస్వామి.

# ఆ తల్లి బిడ్డల్ని చూడు!

ఉదయం తొమ్మిదిన్నర అవుతోంది. డిస్పెన్సరీ అప్పుడే పూర్తయింది. మాస్టరుగారు మంచంమీద కూర్చుని జవాబులు వ్రాయవలసిన ఉత్తరాలను పరిశీలిస్తున్నారు. ఆ జవాబులను వ్రాసిపెట్టేందుకు అంతరంగికుడైన యువకుడొకడు తగిన పరంజామాతో తన పనికి తాను సిద్ధమవుతున్నాడు. మేము ఒక ముగ్గురం యువకులం ఇవతలగా కూర్చుని ఏదో అంశంమీద మాట్లాడుకొంటున్నాం. మాస్టరుగారు మమ్మల్ని గమనిస్తోన్నట్లుగా మాకు తెలియదు. మా కబుర్లను విన్నంతసేపు విని, మాలోని ఒక యువకుణ్ణి తన చెంతకు పిలిచారు ఆయన

"ఏరా! మంచి గ్రాంధికభాషలో మాట్లాడేస్తున్నావ్! నీ ఆవేశం, నీ భాష ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. మధ్యమధ్యలో మన పుస్తకాల్లోని అంశాలు పేరాలకు పేరాలు అప్పచెప్పేస్తున్నావ్. ఉపన్యాసాలిచ్చి జనాన్ని దుళ్ళగొట్టేయడానికి బాగా పనికివస్తావురా!" అన్నారు కృష్ణస్వామి.

"అంతా మీ అనుగ్రహం మాస్టరుగారండీ!" అంటూ మరింత ఆవేశంతో ఊగిపోతూ పలికాడా యువకుడు.

"నీ ఆనందంకూడా ఆవేశంగానే ఉందిరా! అదిసరేగాని భోజనం చేసేటప్పుడు మీ అమ్మకుకూడా ఇలాంటి డైలాగులే వినిపిస్తున్నావటగా!" అని అడిగారు కృష్ణస్వామి.

"మీకెలా తెలిసిందండీ! అయ్యో! నా మొహం, మీకు తెలియకపోవటమేమిటండీ! అవకాశంవచ్చినప్పుడల్లా ఇలా

వినిపించేస్తూనే ఉంటానండి" అంటూ ఇక మీరు మెచ్చుకోవడమే తరువాయి అన్నట్లు చూశాడా యువకుడు

"అయితే కొంప ముంచేస్తూన్నావన్నమాట!" అన్నారు కృష్ణస్వామి.

"అదేమిటండీ! అలా అంటారు" అన్నాడు ఆ యువకుడు ఆశ్చర్యపడుతూ

"లేకపోతేఏమిట్రా! మీఅమ్మ అసలే అమాయకురాలు. ఉత్త వెర్రిబాగులది. నీ డైలాగులుచూసి హడలిపోతోంది — ఎప్పుడు ఏక్షణంలో నీవేంచేస్తావోనని. ఈ డైలాగుల పిచ్చితో పడి నీవెక్కడ ఇల్లొదిలిపెట్టి వెళ్ళిపోతావోనని బెంబేలెత్తి పోతోంది. నీకిటు అన్నంపెడుతూ ఆనటుతిరిగి కొంగు అడ్డం పెట్టుకొని వెక్కివెక్కి ఏడుస్తోంది. నువ్వేమో నీలోకంలో విహరిస్తూ ఉంటావు. "తల్లిరూపంలోఉన్న ఓ జీవి! నీ తృప్తి కోసం తింటున్నాను. పోసిరే కొంచెం అన్నంపెట్టు! అన్నట్టు ఆమెవైపు చూస్తూవుంటావ్. ఆ నీ చూపుల్ని చూస్తోన్నకొద్దీ ఆవిడకు మరింత పిచ్చెక్కిపోతోంది" అన్నారు కృష్ణస్వామి మందలింపుస్వరంతో.

ఆ యువకుడు తనకు ఎదురుదెబ్బ తగిలినట్లుగా అయ్యాడు. తానేదో ఉత్సాహంతో సాగిపోతున్నాననుకొంటున్నాడు. ముందువెనుకలు చూసుకోవడంలేదని ఇప్పుడే అతనికర్థమవుతోంది. తనలోతాను ఆలోచనలోపడి కొంచెం దీనంగా చూసున్నాడతను మాస్టరుగారివైపు.

మాస్టరుగారిలా అన్నారు : నీవు ఏలోకంలో ఉండి ఏ భాషలో మాట్లాడుతున్నావు మీ అమ్మ తనలోకంలో ఉండి నీవేమిటో అంతుపట్టక బెంబేలుపడుతూ చూస్తోంది. కొంచెం ఆవేశం తగ్గించు తల్లిదగ్గర ఉపన్యాసకుడిగా ఉండటం మాని, బిడ్డగా ఉండటం నేర్చుకో. నీ ఉపన్యాసాలలో ఉదరపోషణం, పాత్రపోషణం అంటూ దంచుతూ ఉంటావుగా. ముందిక్కడ నీ పాత్రపోషణగురించి చూడు. తల్లిదగ్గర బిడ్డగా ఉండటంలో నీకు ప్యాసుమార్కులన్నా వచ్చాయో లేదో చూసుకో. పెద్దల గ్రంథాల్లోని పేరాలను అప్పచెప్పడం కాదు. ఆ పేరాలలోని సూత్రాలను అభ్యసించడం చేతకావాలి. ఏమంటావ్ ?

"అర్థమయిందండీ ఇంతకాలం ఈ అంశాన్ని గమనించ లేకపోవడం నాలో కరుడుగట్టుకుపోయిన మూర్ఖత్వాన్ని తెలియ జేస్తోందండీ" అన్నాడా యువకుడు చెమ్మగిల్లుతున్న కన్నులతో.

"ఎవరితో ఎలావుండాలో వారితో అలా ఉండగలగడమే పాత్రపోషణ అంటే. అలా ఉండగలగడానికే ఈ సాధనంతా. ఇలాంటి పాత్రపోషణలో పరిపూర్ణుడు శ్రీకృష్ణుడు భారత భాగవతాలు చూస్తే. ఎవరికి కావలసిన కృష్ణుడు వారికుంటాడు తప్ప అసలు కృష్ణుడంటూ ఒకడు ప్రత్యేకించి కనబడడు. గోపికల కృష్ణుడు గోపికల కృష్ణుడే! యాదవుల కృష్ణుడు యాదవుల కృష్ణుడే. పాండవుల కృష్ణుడు పాండవుల కృష్ణుడే. కౌరవుల కృష్ణుడు కౌరవుల కృష్ణుడే. ఎవరికి కావలసిన కృష్ణుడు వారికుంటాడు. కొంచెం ఎక్కువా ఉండడు. కొంచెం తక్కువా

ఉండడు ఎక్కడ ఎలా అవసరమో అక్కడ అలా ఉంటాడు. ఎవరికివారికి వారి కృష్ణుడుగానే ఉంటాడు ఎవరినీ వదలడు. ఎవరికీ చిక్కడు.

కురుక్షేత్రం అయిపోయిన తర్వాత ద్వారకకు వెళ్ళాడు కృష్ణుడు. అప్పటికాయన వయస్సెంతో తెలుసా? తొంభై ఏళ్ళకు పైన. అంతఃపురంలోనికి ప్రవేశిస్తూ ఉంటే అతణ్ణి చూచిన తల్లులకు స్తన్యం స్రవిస్తుంది అంటే అర్థం ఏమిటి? ఆ తల్లులకు అతడు చంటిబిడ్డగానే గోచరించాడన్నమాట. ముద్దార వలసిన బిడ్డడుగా గోచరించాడు తప్ప వయస్సు ముదిరిన వృద్ధుడిగా గోచరించలేదు. భగవద్గీత చెప్పిన ప్రవక్తగా గోచరించలేదు. ఆ తల్లులు అతనిలో తమ బిడ్డను చూడదలుచుకొన్నారు తప్ప, ఒక పెద్దనో, ఒక ప్రవక్తనో చూడదలుచుకోలేదు. కనుక వారికి వారి బిడ్డగానే గోచరించాడు. చూశావా! ఆ తల్లిబిడ్డల కథ. కనుకనే అతడు పాత్రపోషణలో పరిపూర్ణుడు. ఈ జగత్తుకు గురువు అయ్యాడు. ఏమంటావ్!" అంటూ అతణ్ణి వెన్నుతట్టారు కృష్ణస్వామి.

"ఎలా నడచుకోవాలో బోధపడిందండీ! ఇంకెప్పుడూ ఇలా ఎదుటివాళ్ళకు ఇబ్బంది కలిగేటట్టుగా ప్రవర్తించను" అంటూ కృష్ణస్వామి పాదాలకు నమస్కరించాడు ఆ యువకుడు. అతని హృదయం ఆర్ద్రమై అతని కన్నులనుండి బాష్పాల రూపంలో వెలువడి మాస్టరుగారి పాదాలను స్పృశిస్తోంది.

ప్రేమకురిసే కన్నులతో చూస్తూ అతని వెన్ను నిమురుతున్నారు కృష్ణస్వామి. ●

# ఉద్యమానికి తెలుసు

"మీకు తెలుసుగా! మనవాడు! అతనికి ట్రేషనరీషాపు ఉన్నదిగదా! మనకు కావల్సిన స్టేషనరీని అతనినుండి డొనేషన్‌గా తీసుకోమంటారా! అతనికిదేం పెద్దవిషయం కాదుగదా!" అడిగాడు మాలోని ఒక యువకుడు.

కృష్ణస్వామి అతనిలోనికి చూస్తూ ఇలా అన్నారు: "తొందరపడకూడదు. మనకు కావల్సినవి వాళ్ళదగ్గర ఉన్న మాట నిజమే! కానీవాళ్ళు ఈ మంచిపనికి సిద్ధంగా ఉండొద్దూ! వాళ్ళు సిద్ధపడకుండా నీవు అడిగావు అనుకో. వాళ్ళు మన ఉద్యమాన్ని చిన్నచూపుచూస్తారు వాళ్ళపైన ఆధారపడి ఇది బ్రతుకుతున్నట్లుగా భావిస్తారు. ఇప్పుడు అవకాశంలేదు. ఇంకో సారి చూద్దాం అంటూ అవమానిస్తారు.

మనం మన ఉద్యమాన్ని ప్రాణంగా చూచుకొంటున్న వాళ్ళం మన ప్రాణాలన్నీ దానిపైనే నిలుపుకొన్నవాళ్ళం. అనుక్షణం దానికి అనుగుణంగా జీవించడానికి ప్రయత్నిస్తున్న వాళ్ళం అలాంటప్పుడు చిన్నచూపు చూడబడేస్థితిలో మన ఉద్యమాన్ని మనం పెట్టవచ్చా? దాన్ని పెంచడంకోసం అని శ్రమపడుతూ దాన్ని కించపరచవచ్చా?

మనఉద్యమం సజీవమైనది. సజీవమైనదిఅంటే లోక శ్రేయస్సుకై నిరంతరంపనిచేస్తున్నది. సజీవమైన ఈఉద్యమం

చాలా శక్తిమంతమయినది. తనకు కావల్సినవాళ్ళను తానే వరించగలదు. ఆకర్షించుకోగలదు. విన్నా. నన్నా ఆకర్షించు కొన్నదెవరు? ఆ ఉద్యమంకాదా! పనిచేయడానికి మనలాంటి వాళ్ళను ఆకర్షించుకొన్నట్టే పనిజరగడానికి కావల్సినవాళ్ళను కూడా అదే ఆకర్షించుకొంటుంది. అడిగితే సహాకరించేవారు కాదు, అడుగువేసి సేవించుకొనేవారిని అదే స్వీకరిస్తుంది. ఉద్యమనిర్వహణలో నీ పనితనం వ్యక్తంకావాలితప్ప నీ తాప త్రయాలకు గుర్తై, ఆ ఉద్యమం పతనం కాకూడదు." ఆయన వదనం మరింత గంభీరంగాఉంది. కాసేపు నిశ్శబ్దం.

ఉద్యమం పతనమౌతుందంటావా! కాదు. అయినట్టు కనబడుతుంది. మనం దానికి తగినట్లు ప్రవర్తించనపుడు అది వదిపోదు. మనను విడిచిపెట్టిపోతుంది. ఎన్నోసంస్థలను అదలా విడిచిపెడుతూనే వచ్చింది. ఇపుడు మనవరకు వచ్చింది మన పాత్రతనుబట్టి అది మనలోఉంటుంది. ఆ పాత్రత ఎంతకాలం మనలో నిలబడితే అంతకాలం అది మనతో నిలబడుతుంది. మనని నిలబెడుతుంది.

మళ్ళీ కాసేపు మౌనం! ఆయన ఆకాశంవైపు చూస్తు న్నారు. మళ్ళీ కాసేపు ఆ యువకునివైపు చూస్తున్నారు. కొంతసేపు అలాగడిచింది.

"ఇంతకూ ఉద్యమాన్ని మనం నడిపిస్తున్నామా? ఉద్యమం మనని నడిపిస్తున్నదా?

ఉద్యమమే మనని నడిపిస్తున్నది. దానివల్లనే మనకు నలుగురూ తెలుస్తున్నారు. వారిలో ఎవరెవరు ఎప్పుడెప్పుడు తన నిర్వహణలో పాలుపంచుకోవాలో ఆ ఉద్యమానికి తెలుసు. మనమంతుపాత్ర మనం నిర్వహిస్తూవుంటే ఎవరిపాత్ర వచ్చినప్పుడు వాళ్ళు తెరలు తొలగించుకొని ప్రవేశిస్తారు. ఎవరినీ మనం చిన్నచూపు చూడనక్కరలేదు. అలాగే తొందరపడి వారి పాత్రరాకముందే వారిని పిలిచి ఉద్యమాన్ని వాళ్ళు చిన్న చూపు చూచేటట్లూ చేయగూడదు

మనం అందరినీ ప్రేమతో చూస్తూవుంటే వాళ్ళ సమయం వచ్చినపుడు ప్రవేశిస్తూ ఉంటారు. ఏమంటావ్ ?"

ఆ యువకుడు తేరుకోలేకపోతున్నాడు. అతనికేవేవో దృశ్యాలు గోచరిస్తున్నాయి క్రమంగా తేరుకుంటూ అతనిలా అన్నాడు. "మీ వాక్కులు సరసంగా ఉండటమే ఇప్పటిదాకా గమనించగలిగామగాని, ఇప్పుడీ వాక్కులు చాలా భారంగా, లోతుగా ఉన్నాయి".

కృష్ణస్వామి నవ్వుతూ ఇలా అన్నారు. "నవ్వుతూ నవ్వించేవాళ్ళు అమాయకులైనా అయివుంటారు, అతీతులయినా అయివుంటారు. కొందరు అతీతులై ఉంటూ, అమాయకులుగా నవ్వుతూ ఉంటారు."

ఆ యువకుడు అలా చూస్తూ ఉండిపోయాడు.

# సహాయాలు - సహాలు

ఒక సోదరుడిలా అడిగాడు– "మాస్టరుగారూ, మనచేత ఎంతో సేవచేయించుకున్నవాళ్ళు, మనద్వారా మేలుపొందిన వాళ్లు ఎంతోమంది వుంటారు. కానీ మనకు అక్కరకలిగినప్పుడు, మనం ఇరుకునపడినప్పుడూ వాళ్ళలో ఒక్కరూ సహకరించక పోతే ఎలావుంటుంది? ఈ చేసిన మంచిపనికి ఫలితం ఇంతేనా అనిపించదూ? అసలు మంచిపని చేయడమే అనవసరమనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు".

కృష్ణస్వామి ఇలా అడిగారు "ఔను, అదిసరేగానీ, నీవు ఇరుకునపడ్డప్పుడు నిజంగా నీకేవిధమైన సహాయమూ అంది రాలేదా?"

సోదరుడు: "వచ్చిందనుకోండీ, అది నేనంటే పెద్దగా తెలియనివాళ్ళూ, నిజానికి నాతో పెద్దగా అవసరంలేనివాళ్ళూ ఆవేళటికి అనుకోకుండా కలిసివస్తున్నారు. పని గడచిపోతుంది. నా బాధ ఏమిటంటే, ఈపని చేయించుకున్నవాళ్ళెందుకు చేయరా, అని".

కృష్ణస్వామి ఇలా అన్నారు. "నీవు ఇవ్వాళ బ్యాంకులో డబ్బులు వేశావనుకో. ఒక వారంరోజులతర్వాత వెళ్ళి మళ్ళీ తీసుకుంటావు అప్పుడు లెక్క సరిపెడతాడుగానీ, ఆ వేసిన నోట్లే నీకు మళ్ళీ ఇస్తాడా? నేనువేసిన నోట్లే, ఆ నెంబర్లు

ఉన్నవే నాకు కావాలి అంటే, ఏదేవదురా! పిచ్చివాడిలా ఉన్నాడన్నట్లు చూస్తాడు.

అలాగే నీవు ఒకరికి సహాయం చేస్తున్నావు. ఇంకొకరు నీకు సహాయం చేస్తున్నారు .... సహాయం చేసినందుకుగాను నీవు సహాయం పొందుతూనేవున్నావు. అయితే ఆమనిషే చేయాలని మనస్సు మంకుపట్టు పట్టకూడదు అది పిచ్చితనం. అపట్టు విడిస్తే ఉన్నది సంతోషమే.

సహకరించినవాడు సహకారం పొందుతూనే ఉంటాడు. ఆదరించినవాడు ఆదరణ పొందుతూనే ఉంటాడు. అయితే బ్యాంకులో రూపాయలు మారినట్టు ఇక్కడ రూపాలు మారతాయి అంతే! నెంబర్లు మారినట్టు మెంబర్లు మారుతారు. నీవు ప్రకృతిలో ఒకరూపానికి సహకరించావు. ఆ ప్రకృతి మరొక రూపంతో నీకు సహకరిస్తున్నది. ఆకృతులను వేరుగా చూడటం గాకుండా ప్రకృతిలో భాగాలుగా చూడటం నేర్చుకో. ఆకృతులను వేరుగా చూచినపుడు కలిగేది ఆవేదన. ఆ ఆకృతులను ఒకే ప్రకృతిలోని భాగాలుగా చూచినపుడు పెరిగేది ఆరాధన".

ఆ సోదరుడి మనస్సుకు పడిన ముడి విడింది. మనస్సుతో పాటు అతని పెదవులు చిరునవ్వుతో వికసించాయి.

# తలుపును కొట్టినా!

(బ్రేకుఫాస్టు పూర్తయింది. లేచివచ్చి తను పనిచేసేచోట కూర్చున్నారు కృష్ణస్వామి. అటువైపు దూరంగా దేనికోసమో వెతుకుతున్న మాలోని ఒక యువకుణ్ణి పనిచేసుకుంటూనే గమనిస్తున్నారు ఇంతలో మళ్ళీ అతను తిరిగి అటువైపుకు వస్తున్నాడు. కృష్ణస్వామి అతన్ని దగ్గరకు రమ్మని సైగచేశారు. కూర్చోమని కుర్చీచూపించారు అతణ్ణి కూర్చోనిచ్చారు కొంత సేపు పనివైపుచూశారు. కాసేపాగి ఆ యువకుడివైపుచూశారు. అతడు మాష్టరుగారు ఏదో తెలియచెప్పటానికే పిలిచారని గమనించాడు.)

కృష్ణ :- బ్రేకుఫాస్టుకుముందు స్నానం పూర్తి చేశావనుకుంటాను.

సోద :- చేసానండీ!

కృష్ణ :- చేసివచ్చేటప్పుడు తలుపు వేశావా?

సోద :- ఆ! బాత్‌రూం తలుపేనా? వేసేశాను.

కృష్ణ :- వెయ్యడానికీ, వేసేసెయ్యడానికీ తేడా వుంది తెలుసా!

సోద :- కొద్దిసేపు ఆలోచించి అర్థమయింది. నేను ఆ తలుపును దఢాలున లాగాను. తప్పుజరిగిపోయింది మాస్టారూ!

కృష్ణ :- బాగా చెప్పావయ్యింది. అంటే ఆ తలుపుకు అంతబాగా దెబ్బతగిలిందన్నమాట. అంతగా దెబ్బతగలడం అవసరమంటావా ?

సోద :- కాదు, కాని కంగారులో....

కృష్ణ :- ఏ ఆహార స్వీకరణలోనో హింస తప్పదుమరి మామూలప్పుడుకూడా మనచుట్టూవున్న ప్రకృతితో ఇలా ప్రవర్తించడం ధర్మమా ? మనదృష్టిలో తలుపు ఒక చెక్కముక్క. దానికి ప్రాణం లేదూఅని చాలా పొరపాటు. ఈ సృష్టిలో ప్రాణంలేనిది అంటూ ఏదీలేదు. మీరు బయాలజీలో చెప్పిన జీవ, నిర్జీవవిభాగం (Living - non living) ఆధునిక శాస్త్రంలోని అమాయకత్వాన్ని తెలియజేస్తుంది. మన పెద్దలు చక్కగా చెప్పారు. ప్రాణం అన్నివస్తువులకూ ఉంటుంది. అయితే కొన్ని కదలగలిగి ఉంటాయి మరికొన్ని కదలలేనివై ఉంటాయి. తమకుతాముగా కదలగలిగేవాటిని వాళ్ళు సచేతనాలు అన్నారు. తమకుతాముగా కదలలేనివాటిని అచేతనాలు అన్నారు. అచేతనాలు అంటే ప్రాణంలేనివిగా భావించి, వాటితో మోటుగా ప్రవర్తించడం నిద్రపోతున్నవాళ్ళమీదనుంచి తొక్కుకుంటూ, గెంతుకుంటూ వెళ్ళిపోవడం లాంటిది. ఇది మంచి పద్ధతే నంటావా ?

సోద :- కాదు ! అంటూ తలవంచుకున్నాడు.

కృష్ణ :- "తలుపు వేయడమే కాదు. నడవడంలో కూడా నీవు నేర్చుకోవలసింది చాలావుంది. అలా భూమి అదిరిపోయేట్లు నడవకూడదు అలాగే ఆ తలుపును చూశావా ! ఎలా కుర్చీపైన పారేశావో ! దానివల్ల కుర్చీకీ, తలుపుకూ అన్యాయం జరుగుతుంది అవేఁడూ కలసి రూములోని వాతావరణానికి అన్యాయం చేస్తాయి. ఆ వాతావరణం ఆ రూములో పనిచేస్తున్న వ్యక్తులపై తన ప్రభావం చూపిస్తుంది.

అర్థమవుతోంది అన్నట్లు తలఊపాడా సోదరుడు.

కొంచెమాగి కృష్ణస్వామి ఇంకా ఇలాఅన్నారు : ఇలాంటి వాళ్ళం ఇవాళ తలుపులను పీటిని నిర్లక్ష్యం చేసినట్టే, రేపు మనతో ఉంటున్న వ్యక్తులనుకూడా నిర్లక్ష్యం చేయగలం. సమాజంలో చూస్తూ ఉంటాం, ఒక్కొక్క భర్త తన భార్యను తనకు కావలసినపనిని చేసిపెట్టే ఒక పనిముట్టుగామాత్రమే చూస్తాడు. ఆమెకూ ఒక మనసుంటుందనిగానీ, ఆ మనస్సుకూ కొన్ని భావనలుంటాయనిగానీ అతనికనిపించదు. బాత్ రూం తలుపెంతో అతనికా భార్యకూడా అంతే. ఒక్కొక్క ఆఫీసరు తనక్రింద పనిచేస్తూన్న ఉద్యోగస్తులను ఆ ఆఫీసులోఉన్న కుర్చీలను బల్లలను చూసినట్టే చూస్తాడు. వాళ్ళకీ స్వంతబుద్ధి లున్నాయని గానీ, స్వంతపను లుంటాయనిగానీ అతను గమనించలేడు. అంటే వాళ్ళను తనలాంటివాళ్లుగా చూడలేకపోతున్నాడన్న మాట".

"ఈ దీనస్థితినుండి బయటపడటం ఎలా స్వామీ?" ఆర్తిగా అడిగాడా సోదరుడు.

ప్రేమగా చూస్తూ కృష్ణస్వామి ఇలాఅన్నారు: అదే చెప్పబోతున్నాను. ముందు మనం అచేతనాలనుకూడా సచేతనాలను చూచినట్లు చూడాలి. అంటే మన తమ్ముళ్ళను మిత్రులను ఎలా చూస్తున్నామో తలుపులను. కుర్చీలను. అలా చూడటం మొదలుపెట్టినప్పటినుంచి. అంతా మనతోటివాళ్ళేనని. కొందరు కదులుతూ మనకు సహకరిస్తున్నారని, మరికొందరు మనకు సహకరించడంకోసమే కదలకుండా ఉంటున్నారని తెలుస్తుంది. ఇంటిగోడలో రాళ్ళున్నాయి. అవి కదలకుండా ఉండటానికి ఇష్టపడాయి కనుక ఆగోడ ఉంది. నీకు ఇల్లుఉంది. అరాళ్ళే కదలడం మొదలుపెట్టాయనుకో. నీకు ఇల్లుఉంటుందా? అలాగే కుర్చీలు. తలుపులు. గిన్నెలు కదలడం మొదలుపెడితే మనకథ ఇక ఎలా ఉంటుందో చూడు.

దైవం సృష్టికథ నడపడంకోసమే కొన్ని కదిలేట్లు, మరికొన్ని కదలకుండా ఆ కదులుతున్నవాటికి సహకరించేటట్లు ఏర్పాటుచేశారు. ఈ ఏర్పాటును గమనించినకొద్దీ ఆకదలకుండా సహకరిస్తున్న మన సోదరజీవులమీద మనకింకా ప్రేమకలుగుతుంది. "తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" అన్నాడు శ్రీశ్రీ కట్టించినరాజును గుర్తుపెట్టుకున్నారుకాని దానికి రాళ్ళెత్తిన కూలీలను మరచిపోయారనీ. నిజానికి తాజమహల్

రూపొందటానికి వాళ్ళే కారణమని ఆయన బాధతో ఉద్ఘోషించాడు. అలాగే ఈ కదలుతున్నవాళ్ళు కదలి నడవటానికి కదలకుండా అనేకరూపాలలో నిలబడి పనిచేస్తూ అచేతనాలుగా, జడపదార్థాలుగా మనచేత చిన్నచూపుచూడబడుతున్న ఈ మూగ కార్యకర్తల మాటేమిటి? అని అడుగుతున్నాను నేను. వాళ్ళను చైతన్యమూర్తులుగా గుర్తించండి సోదరులుగా గౌరవించండి. దైవస్వరూపాలుగా ప్రేమించండని కోరుతున్నాను నేను. ఇది కోరిక మాత్రమే కాదు. ఒక హెచ్చరిక. ఆ కదలనివాళ్ళను ప్రేమించలేకపోతే క్రమంగా మీతో కదలుతున్న వాళ్ళను కూడా, కదులుతూ మీతో పనిచేస్తున్నవాళ్ళను కూడా ఆ కదలనివాళ్ళ లిస్టులో చేర్చి మీకు తెలియకుండానే మీరు అవమానించగలరు.

చుట్టూ ఉన్నవారిని జడపదార్థాలుగా పొరపడి పొరపడి మనకళ్ళకు ఆ 'పొర' పడి చివరకు మనలోని ఆ ప్రేమ ఇంకిపోవు. మనతో ఉన్నవాళ్ళకు మనకూ లింక్సు తెగిపోయి మనమే జడప్రాయంగా తయారయ్యే అవకాశమున్నది. కదలని కార్యకర్తలను కదలలేని జడపదార్థాలుగా పొరబడితే క్రమంగా మనం భావించిన జడత్వం మనకే సిద్ధించగలదు. అందుకు శిక్షగా భరించలేని ఒంటరితనం మనకు ప్రాప్తించగలదు. మనం ఎందరిలో ఉన్నా ఆ ఒంటరితనం నీడలా మనను వెన్నాడి ఎవరికీ చెందని శూన్యస్థితిలో మనను నిలబెట్టగలదు. మళ్ళీ మనం దిగివచ్చి తోటివారితో గోరి శ్రుతికలుపగలిగినప్పుడు మాత్రమే ఆ ఒంటరితనం మనను విడిచిపెడుతుంది ఆ శూన్యస్థితి క్రమంగా పూర్ణస్థితిగా రూపొందుతుంది.

ఆ యువకుడి కన్నీళ్ళు కృష్ణస్వామి పాదాలను కడుగుతున్నాయి. అతని దేహం సోలిపోయి ఆయన పాదాలపై వాలిపోయింది.

ప్రేమ ఉట్టిపడుతున్న కన్నులతో కృష్ణస్వామి అతనివైపు వంగారు. వీపుమీద అతని వెన్నుతట్టారు.

“అవి కదిలేవైన, కదలనివైన అన్నిటినీ అందరినీ ఒకేలా చూడటం, ఒకే ప్రేమతో చూడటం నేర్చుకోవాలి మనం. ఇన్ని రూపాలమాటున ఉండి నాటకమాడుతున్నది అద్వైతమేనని గుర్తించగలగాలి. ప్రహ్లాదుడు చెప్పినట్లు ఇందుగలడు అందులేడను అన్న సందేహాన్ని విడిచి ప్రతిచోట అతడికోసం వెతకటం అలవాటు కావాలి. అందరినీవదలి దైవాన్ని చూడాలనుకోవటం అవివేకమవుతుంది కాని ఆధ్యాత్మికత కాదు. అందరిలోనూ, అందరిగానూ, కదులుతూను, కదలకుండానూ ఉన్నది ఆ దైవమేనని మనం దర్శించగలగాలి. దర్శించగలగాలి అంటే అతన్ని వెతుక్కోవాలి. శ్రద్ధగా వెతికితే అతడు కనబడతాడు. ప్రేమతో స్నేహంచేస్తే అతడు అనుభవానికి వస్తాడు.

నిజానికి ఈ సృష్టి, దైవం ఆడుతున్న ఒక దాగుడుమూతలాట. రూపాలమాటున దాగి అందుకోమంటూ ఆడుతున్నాడతడు. అందుకున్న క్షణంలో తెలుస్తుంది. నిజానికి అతడూ మనమూ వేరుకాదని, వేరుగా కనబడటంకూడా ఆ ఆటలో ఒక భాగమేనని - అన్నారు కృష్ణస్వామి.

ఆ యువకుని కళ్ళనుండి జలజలా బాష్పాలు రాలుతున్నాయి. పశ్చాత్తాపంతో రాలడం మొదలుపెట్టిన ఆ బాష్పాలు క్రమంగా ఆనందబాష్పాలుగా రూపొందుతున్నాయి. అతనికే కాదు, ఆ దృశ్యంలో వున్న మా కందరికీ అదే అనుభూతి, ఒక విధమైన అచేతనస్థితి. అనుభూతితో నిండిన అచేతనస్థితి అది. మా చేత అనుభవింపబడుతున్నది. బహుశా ఇలాంటి అనుభూతిలోనే ఉంటూ ఈ అచేతనాలన్నీ సృష్టికథలో తమ తమ పాత్రలను నిర్వహిస్తున్నాయేమోనని అనిపించసాగింది. దైవాన్ని దర్శించడానికి అడ్డుగావున్న తెర ఏదో తొలగించబడినట్లయింది.

కొంత తేరుకొన్న తరువాత ఆ కుఱ్ఱవాడు ఇలా అన్నాడు: "నా జీవితం నిజంగా ధన్యమైందండీ. ఆనాడు హిరణ్యకశిపుడు స్తంభాన్ని కొడితే దైవం సాక్షాత్కరించాడు. ఈనాడు నేను తబుషను కొడితే మళ్ళీ అలాగే సాక్షాత్కరించాడు. ఆనాటి ప్రహ్లాదుడు, ఈనాటి మీరు "కొట్టకు నాయనా! వెతికిచూడు బాబు! అంటున్నారు" అంటూ ఒకవిధమైన భావోద్వేగాన్ని అనుభవించాడతను.

"ఆ వెదకడానికి శ్రద్ధ, ప్రేమ అనే రెండు కళ్ళు కావాలనికూడా అంటున్నాను" అంటూ అతని వీపుపైన చిన్నగా చరిచారు కృష్ణస్వామి.

# సేవనూ భక్తి

విశాఖపట్నంలోని మన కార్యాలయంలో ఒక ప్రత్యేక సమావేశం జరుగుతోంది. పిలిచినవారిలో కొద్దిమందే వచ్చారని సోదరులొకరు బాధగా అన్నారు.

కృష్ణస్వామి ఆయనవైపు చూస్తూ "మీరు చెప్పదలచిన వారందరికీ చెప్పారా?"

"చెప్పానుకాని" అంటూ నీరసంగా ఏదో చెప్పబోయాడా సోదరుడు

మాస్టరుగారిలా అన్నారు: "మీరు చేయవలసింది చేశారు ఇక బాధపడకండి. ఇప్పటి ఈ సన్నివేశానికి ఎవరెవరవసరమో వారిక్కడికి చేరారు ఎప్పుడూ అంతే ఒక నాటకముందనుకోండి. ఆ నాటకంలో సీన్లు ఉంటాయిగదా! ప్రతి సీన్లోనూ నటులంతా ఉంటారా? ఆ సీనుకు ఎవరెవరవసరమో వారే ఉంటారు. ఏమంటారు! మరి ఇది జగన్నాటకంగదా! ఈ నాటకంలోనూ అంతే, అసలీ జగన్నాటకాన్ని దర్శించిన ద్రష్టనుండేగదా ఆ నాటకమనే ప్రక్రియ పుట్టింది".

ఆ సోదరుడు తేరుకోసాగాడు.

"కానియండి ఇక కథలోకి దిగుదాం" అంటూ కృష్ణస్వామి చిరునవ్వు నవ్వుతూ ఆయన వీపుపైన చిన్నగా చరిచాడు. మిగిలిన సోదరులు కూడా లభించిన ఈ సమన్వయాత్మకమైన దర్శనానికి పరవశిస్తూ ఇక కార్యక్రమంలోకి దిగారు.

# జీవిత చక్రం

"ఏమిటో సార్ ! పరిస్థితులు మరీ జటిలంగా వున్నాయి. తట్టుకోవడం కష్టంగా ఉంటోంది. పట్టుమని పదిరోజులు కూడా ఒకవిధంగా సాగకపోతే ఎలాగండీ!" అన్నారొక సోదరుడు దుఃఖంతో పూడుకుపోతున్న గొంతుతో.

కృష్ణస్వామి ప్రేమగా చూస్తూ "ఫరవాలేదు. సర్దుకుంటాయి. తరచు వస్తూవుండండి. కొంత ఉపశమనం లభిస్తుంది" అన్నారు.

ఆయన ఓదార్పును పొందుతూ "అందుకే వచ్చాను. మిమ్మల్ని చూస్తే కొంత భారమైనా తగ్గుతుందని" అన్నారు.

కృష్ణస్వామి అనునయంగా ఇలా అన్నారు : సంవత్సర చక్రంలో ఋతువులు మారుతూవుండడం, ఆ ఋతువులనుబట్టి చెట్లూ, చేమలూ, పశుపక్ష్యాదులు మొదలైనవాటిలో మార్పులు వస్తూవుండడం మనం గమనిస్తూనే ఉన్నాంగదా ! ఆకురాలు కాలంలో చెట్లు మోళ్ళుగా మిగిలిపోవడమూ చూస్తున్నాం. వసంతంలో అవే చెట్లే వైభవంతో మెరిసిపోవడమూ చూస్తున్నాం. ఇలాగే మన జీవితచక్రమూ తిరుగుతూవుంటుంది ఆ చక్రభ్రమణాన్ని గమనించుకొంటున్నకొద్దీ జీవితంలో పట్టుచిక్కి కర్తవ్యం మనస్సుకందుతూ ఉంటుంది. ఎవరికివారు తప్పించుకొనిపోయే ఆకురాలు కాలాలూ, అందరూ కలిసొచ్చే వసంత కాలాలూ ఒకదానితర్వాత ఒకటి మళ్ళీమళ్ళీ వస్తూనే ఉంటాయి.

"మరి తప్పుకోవటం ఎలా ?" అన్నాడతను.

"ముందా చక్రాన్ని చూచి బెంబేలుపడకుండా నిలబడ గలగాలి. బెంబేలుపడితే విషాదం ఆవరిస్తుంది. పెద్దల సాంగత్యంలో ఆ విషాదాన్ని తొలగించుకుంటూ మళ్ళీ దారినపడుతూ ఉండాలి

పిల్లవాడు తనకు భయంవేసినప్పుడేం చేస్తున్నాడు – భయపడని పెద్దవాళ్ళదగ్గరకు చేరుతున్నాడు. అంతే ! ఇక వాడి భయంపోతోంది వాడూ సరదాగా కబుర్లుచెప్పగలుగుతున్నాడు. ఇక్కడో చిత్రముంది. అతడా దృశ్యాన్ని మారిపొమ్మనలేదు. తాను పారిపోనూలేదు. పెద్దవాళ్ళ చెంతకు చెంగున చేరుకున్నాడు అంతే ఇంకా ఆ కుర్రవాడు ఏంచేస్తాడిప్పుడు. ఆ సన్నివేశాన్ని గురించి ఆరాలు తీస్తాడు. పెద్దవాళ్ళు చెబుతుంటే శ్రద్ధగా వింటాడు మరోసారి ఎప్పుడయినా తనకన్నా చిన్నవాళ్ళు అలాంటి దృశ్యానికి భయపడుతుంటే వాళ్ళప్రాణానికి తాను పెద్దవాడై అభయం పడతాడు. తానువిన్న వివరాలన్నీ తానుగా వాళ్ళకు గురువై ఉపదేశిస్తాడు. జీవితంలో మనం చేయవలసింది అదే ఎదురైన సన్నివేశాన్నిచూసి అది మారిపోవాలి అనుకో కూడదు తాను పారిపోనూకూడదు. పెద్దలచెంతకు చేరాలి. అప్పుడు భయంపోతుంది. ఆస్థానంలో ఉత్సాహం ఉదయిస్తుంది. ఆ ఉత్సాహంతో ఆ సన్నివేశాన్ని అర్థంచేసికొని మనం కర్తవ్యోన్ముఖులం కావటం జరుగుతుంది" అన్నారు కృష్ణస్వామి.

"అందుకేగా మాష్టరుగారూ! మిమ్మల్ని చేరవచ్చింది. చేరంగానే విషాదం తొలగిపోయినట్లుంది" అంటూ విప్పారిన ముఖంతో నమస్కరించాడతను.

## అలా ఆవలించకు!

పదుగురం కూర్చున్నాం. మాష్టరుగారు ముచ్చటలాడుతూనే కావలసిన అంశాలను అందిస్తున్నారు. ఇంతలో మాలోని ఒకతను పెద్దగా, వికృతంగా ఆవలించాడు.

"ఆవలించుగాని అలా ఆవలించకు. నలుగురిలో ఉన్నప్పుడు ఆవలింత, తుమ్ము మొదలైనవి వస్తే తోటివారికి ఇబ్బంది కలుగకుండా, వాళ్ళు అసహ్యించుకోకుండా ఆపని జరుపుకోవాలి" అన్నారు కృష్ణస్వామి.

మా మిత్రుడు సిగ్గుతో తలదించుకొన్నాడు. కొద్దిసేపాగి కొంచెంగా తలపైకెత్తి ఇంకెప్పుడూ ఇలా చేయను అన్నట్లు మాష్టరుగారివైపు చూశాడు.

ఆ చూపునుగ్రహించిన మాష్టరుగారు ఇంకా గ్రహించవలసింది చాల ఉన్నది అన్నట్లు చూస్తూ ఇలా అన్నారు: పదిమందిలో ఉన్నప్పుడూ, పెద్దవాళ్ళముందూ, ఇలాంటి అవసరాలు ఏర్పడితే, వాటిని ఎలాజరుపుకోవాలో విరాటపర్వంలో ధౌమ్యుడు పాండవులకు చాల చక్కగా తెలియచెప్పాడు.

పెద్దలతోగాని, పై అధికారులతోగాని, యజమానులతో గాని, ఏయే అంశాలలో ఎలాప్రవర్తించాలో, ఎలా ప్రవర్తిస్తే మన పొట్టపోషణకు నిందుదనమొస్తుందో, మనజీవితానికీ, జీవికకూ దెబ్బతగలకుండా ఉంటుందో తెలియాలి అంటే ధౌమ్యుని ఉపదేశం తరచు చదువుకుంటూ ఉండాలి. రామాయణ భారతాలు తెరచిచూడటానికే భయపడేస్థితిలో ఉన్నాం మనం. అవి తరచూ తెరచి తరచితరచి చదువుకొంటుంటేతప్ప మానవ జీవితం దారినపడదు ధౌమ్యుడు సందేశం ఇచ్చిన ఆఘట్టాన్ని ఇంకెప్పుడైనా వివరంగా చదివి వినిపిస్తాలె." అంటూ అప్పటి విషయంలోనికి మళ్ళీ ప్రవేశించారు కృష్ణస్వామి.

ఇంతకూ మావాడి అవలింత పుణ్యమా అని మాస్టరుగారి నుండి విరాటపర్వ విశేషాలు తగుమాత్రం వినటానికి వీలయింది.

## లోటుల నుండి లోతులకు

"ఎంతోకాలంగా మన పెద్దవాళ్ళు ఎంతగానో చెప్పుకుంటూవస్తున్న ప్రయోజనమేమి కనిపించటంలేదు వింటున్నంతసేపు ఆ పెద్దవాళ్ళ మాటలకు తలలూగిస్తారు, తాళాలు వేస్తారు. ఆతరువాత మళ్ళీ మామూలుగానే కనపిస్తారు. మరి ఈజరుగుతున్న కృషంతా ఎందుకు జరుగుతున్నట్లు? ఏమవుతున్నట్లు?" అని అడిగారు ఒకసోదరుడు నిస్పృహ నిండిన గొంతుకతో.

కృష్ణస్వామి ఏదో ఆలోచిస్తున్నట్లుగా చూస్తున్నారు. కొద్దిక్షణాలతరువాత ఆయన ఇలా అన్నారు "మీరు చెప్పింది నిజమే। అలా జరగడం ఈ యుగధర్మంగా కనిపిస్తుంది. వేల మీద జనంచేరడం, వేళ్ళమీద మిగలడం, ఈయుగంలో తప్పదు. వ్యాసుడంతటివాడే ఎన్నోవిధాలుగా ప్రజల భావాలకు అద్దం పట్టి, ప్రజలభాషలో మానవజీవిత పరమార్థాన్ని విప్పిచెప్పడానికి యత్నించినవాడే, ఎంతగా చేతులెత్తి ఘోషించినా ఈజనానికి అతంతమాత్రంగానే అంటుతోందని బాధపడ్డాడు. "స్వధర్మ నిర్వహణమే మానవజీవితానికి పరమావధి అర్థకామాలన్నవి మానవుడికి ఆ స్వధర్మనిర్వహణనుండే సిద్ధిస్తున్నాయి. కనుక, అవి అంటే ఆ అర్థకామాలు తిరిగి స్వధర్మ నిర్వహణానికే సమర్పించబడాలి" - అని ఎంతచెప్పినా ప్రజలు అర్థకామాలకే ప్రాముఖ్యమిచ్చి స్వధర్మ నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆ స్వధర్మాన్ని అధర్మంగా ఆచరించడానికే ఉత్సాహపడుతున్నారని ఆయన ఎంతో మథనపడ్డాడు ఘోషించాడు. ఇంకాచెప్పాలంటే ఆక్రోశించాడు. అప్పం ఇప్పుడు మీరు చెప్పినట్లే చెప్పాడు. ఇలాగే బాధపడ్డాడు"

ఆ సోదరుడు "అలాగా...." అన్నట్టు వింటున్నారు.

కొంచెంఆగి కృష్ణస్వామి మళ్ళీ ఇలా అన్నారు. "ఇప్పుడు కూడా మనం చూస్తూవుంటాం - మా కష్టాలు తీర్చమనీ, అవి తీరేమార్గం చెప్పమనీ, ఆశీస్సులు, విభూతి అందించమనీ, తమ

తరపున దేవునికి రికమెండు చేయమని అడిగేవాళ్ళే ఎక్కువ మంది ఉంటారు తప్ప. మాకు జీవించడం నేర్పమని అడిగేవాళ్ళు ఎందరుంటారు ? ఉదాహరణకు E. K. మాస్టరుగారిని ఒక వైద్యుడిగా ఉపయోగించుకున్నంత మంది ఒక గురువుగా, ఒక మార్గదర్శకునిగా, నవశకానికి నాందిపలికిన ఒక ఉద్యమకారునిగా వినియోగించుకోగలిగారా ? గురువుగా చూద్దామనుకొని చేరిన వారిలో కూడా ఎంత మందిమి ఆయన నిర్దేశించిన మార్గాన్ని సూటిగా చూడగలుగుతున్నాము ”

కృష్ణస్వామిగారి వివరణ వింటున్న సోదరుణ్ణి ఏవేవో లోతులకు తీసుకువెళుతోంది. ఆలోతులను తడిమిచూచే ప్రయత్నంచేస్తూనే ఆయన ఇలా అన్నారు: “మరి అలాంటప్పుడు ఇంత ప్రయత్నంచేసి ఏమిలాభం ?” కొంచెమాగి మళ్ళీ ఆయనే అన్నారు: “అందుకే అన్నాడేమో కృష్ణుడు నిష్కామకర్మ చేయమని.” ఆ సోదరుడి వదనం విషాదాన్నుండి తేరుకుంటూ ఒక వింతైన గాంభీర్యాన్ని సంతరించుకునే ప్రయత్నం చేస్తున్న ఆయన మనఃస్థితిని సూచిస్తోంది.

కృష్ణస్వామి చిరునవ్వుతో “మీరన్నది నిజమే ; చేయవలసింది నిష్కామకర్మే. ఫలితంమీద ఏమాత్రం దృష్టిఉన్నా ఇలా ఇంత బాధా పడవలసివస్తుందని తెలిసే కృష్ణుడు నిష్కామ కర్మను ఉపదేశించాడు. ఫలితాన్ని చూడకు, పనితీరు చూచుకో అన్నాడు. పనిచేయడంలో నైపుణ్యాన్ని సాధించడమే నీవంతు.

ఇక ఫలితం అంటావా? అది సృష్టికథలో ఆ సన్నివేశానికి ఉన్న స్థానాన్ని బట్టి ఉంటుంది. నీ సామర్థ్యంతో దానికేమీ సంబంధం లేదు. నీ సామర్థ్యంతో, నీ సంసిద్ధతతో నీవు పొందవలసింది కర్మాచరణలో కౌశలాన్ని మాత్రమే.

ఇప్పుడు మీరుఅన్న అంశంలో కూడ మనం అలాంటి కౌశలాన్నే చూపవలసిఉంది. ఏవేవో బాధలతో, కోరికలతో ప్రజలు మనదగ్గరకు వస్తూఉంటారు. ధర్మబద్ధంగా వారికి కావలసినసహాయాన్ని అందిస్తూనే క్రమంగా వారిని మనం దివ్య జీవనంలోకి మేలుకొలపాలి. వారు మనదగ్గరకు ఏ ఉద్దేశ్యంతో వచ్చినా మనదృష్టిమాత్రం వారిజీవిత సార్థక్యంపైన ఉండాలి. ధర్మబద్ధమయిన వారికోరికలనుఆమోదించి సహకరిస్తూనే వారికేది శ్రేయోదాయకమో, ఏది వారి జీవితకార్యమో ఆమార్గానికి వారిజీవితాలు మళ్ళేట్టుగా చూడాలి సరైన తల్లితండ్రులు పిల్లలను ఎలా పెంచుతుంటూవస్తారో, అలా మనం, మనకుదగ్గరైన వారి పెరుగుదలకు దోహదంచేస్తూ పోవాలి. ఇలా జరుగుతూ ఉండగా ఎప్పటికి మేలుకోవలసిన వారు అప్పటికి మేలుకుంటూ ఉంటారు. కొందరు ఇప్పుడేమేలుకొని తమ స్వధర్మాన్ని లోక హిత కార్యక్రమంగా రూపొందించుకొని కార్యకర్తలవుతూ ఉంటారు, మరికొందరు ఇంకొంత కాలనికి మేలుకుంటారు. ఇంకాకొందరు ఈస్ఫూర్తిను ఇప్పుడందుకొని క్రమంగా తనజు డని ప్రయాణాన్ని సాగించి, రాబోయే జన్మల్లో మేలుకొంటారు.

మొత్తానికి ప్రతిజీవి ఎప్పటికో అప్పటికి మేలుకొని లోకహితంతో కృషి కలుపవలసినవాడే.

ఎవరు ఎప్పుడు మేలుకొనాలనేది సృష్టికథకు సంబంధించిన అంశం. మేలుకొన్నవారూ, మేలుకొంటున్నవారూ, మేలుకొనడానికి ఇష్టపడనివారూ, అసలు మేలుకొలుపంటూ ఒకటుందని తెలియనివారూ.... ఇందరూ రకరకాల పాత్రలు పోషిస్తూఉండగా ఈ సృష్టికథ కొనసాగుతూ ఉంటుంది. అందులో మనదీ ఒకపాత్ర. ప్రకృతి మేలుకొల్పదలుచుకొన్న వారిని మనద్వారా మేలుకొల్పుతుంది. బొమ్మగీయదల్చుకొన్న చిత్రకారుడికి కుంచెలా, జీవులకు మేలుకొలుపు అందించదలచిన ప్రకృతీపురుషులకు ఈ మనశరీరం ఒక ఉపకరణంగా ఉపయోగపడుతుంది. దీనినే నిమిత్తమాత్రంగా నిలబడటం అంటారు. నిమిత్తమాత్రం అంటే నిర్లక్ష్యంగా కూర్చోవడం అని అర్థం కాదు. శరీరాన్ని, మనస్సును శుద్ధిచేసుకొని, బుద్ధిసారథ్యంలో, జరుగవలసిన కథలో మన పాత్రపోషణకు సిద్ధంగా ఉండడం అని అర్థం. అలా నిలబడే ప్రయత్నం చేయడానికే మనం ఇక్కడ ఒక బృందంగా చేరాం.”

సోదరుడు విందుగా నవ్వారు. “విషాదయోగంలో నుండి అర్జునుణ్ణి కృష్ణుడు ఎలాలేవనెత్తాడో ఇప్పుడు నాకర్థమయింది.” అంటూ ఒకక్షణం కన్నులుమూసుకొని ధ్యానంలో ఉండి పోయారు. కాస్తాగి....మెల్లగా కన్నులు తెరిచారు. ఆ కన్నులు

కాంతివంతంగా ఉన్నాయి. ఆచూపులు కృష్ణస్వామిపై లగ్నమై ఉన్నాయి. ఏదో దివ్యమైన స్ఫూర్తిని పొందుతున్నట్లుగా కనిపించారాయన. ●

## ఇంక వారికి శ్రమెందుకు?

అప్పటికి మాస్టర్ E. K. శరీరంతో ఉన్నారు. ఆరోజు ఆగస్టు పదకొండవతేదీ. E. K. మాస్టరుగారి పుట్టినరోజు. ఉత్సవానికి రంగమై ఆంధ్రాయూనివర్సిటీ అసెంబ్లీహాలు కళకళలాడుతోంది. సమయం ఐదున్నర దాటుతోంది సోదర బృందం బృందాలు బృందాలుగా ఉత్సవ రంగానికి తరలివస్తున్నారు. అప్పటికే అక్కడకు చేరిన కృష్ణస్వామి సోదరబృందంలోని ప్రముఖులతో అహ్లాదకరమైన సంభాషణలు జరుపుతున్నారు.

అందులో ఒకాయన "ఇవ్వాళ మీ ఉపన్యాసం ఉందనుకుంటాను" అన్నారు.

"ఉందండీ!" అన్నారు కృష్ణస్వామి.

"అదీ! ఒక అదృష్టం! అదంతా పూర్వజన్మసుకృతం. మీరు పొందుతున్న అనుభూతుల్ని చక్కగా విప్పిచెప్పగలరు. ఆ చెప్పడంలో మీ రేఅనుభూతిలో ఉన్నారో, అదే అనుభూతిలోనికి మమ్మల్నికూడా తీసుకొనివెళ్ళగలరు. అది నిజంగా విశే

షమే. అనుభూతులు అందరికీ కలుగుతూనే ఉంటాయి కానీ అందరూ అలా చెప్పగలరా? మాలాంటి వాళ్ళం అనుభవిస్తూ మూగపోతుంటాం తప్ప ఏంచేయగలం? మీరు చెబుతున్నపుడు ఒక ఆనందం కలుగుతుంది. మేం అనుభవిస్తున్నవీ, మేం చెప్పలేనివి మీరు చెబుతున్నారుగదాఅని! మేంచెప్పాలనుకొని చెప్పలేక పోతున్నవాటికి మీరు అక్షరరూపం ఇస్తున్నారుగదాఅని. మాకదివాలు. అందుకే మీ, మా మధ్య ఏదో అనుభూతి. మా హృదయాలు మీగొంతునుండి పలుకుతున్న అనుభూతి అది"

ఆయన కనులనుండి ఆనందబాష్పాలు రాలుతున్నాయి. ఆయన రెండుచేతులు కృష్ణస్వామిని చుట్టేస్తున్నాయి. పరివారాలు ఆయన ప్పుత్రహనుండి జారిపోతున్నాయి.

కృష్ణస్వామి ఆయన రెండుచేతుల్ని ప్రేమగా తన చేతుల్లోకితీసుకొని చిన్నగానొక్కుతూ ఇలాఅన్నారు; మీరుచెప్పింది అక్షరాలానిజం మీ అందరిహృదయాలు నాగొంతునుండి పలుకుతున్నాయి. మనందరి గొంతుగా పనిచేయడమే నావంతుగా నాకు దర్శనమిస్తూ ఉంటుంది. మన బృందాన్ని ఒక మానవశరీరంతో పోల్చుకున్నప్పుడు, ఆశరీరానికి గొంతునేను. అలాగే మనలో ఎవరి స్వభావాలనుబట్టివారు మిగిలిన శరీరభాగాలుగా పనిచేస్తూనే ఉన్నారు. కొందరు ఊపిరితిత్తులుగా, కొందరు గుండెకాయగా, ఇంకొందరు అస్థిపంజరంగా, మరికొందరు రక్తనాళాలుగా ఇలా ఎందరెందరో, ఎన్నెన్నోభాగాలుగా పనిచేస్తునే ఉన్నారు. ఎవరి

పాత్రవారు పోషిస్తూనేఉన్నారు. అలాపోషిస్తూఉంటేనే ఇంతకథ నడుస్తూఉన్నది. అన్నిపాత్రలూ కావలసినవే. ఏమంటారు ?"

కృష్ణస్వామి ఆయనవైపు ప్రేమగా చూస్తున్నారు. 'అవునా ?' అన్నట్లు కనురెప్పలు అల్లల్లాడిస్తున్నారు.

"మీరెప్పుడూ ఇంతే, ఏ విషయాన్నైనా ఇట్టేసమన్వయంచేసి చెప్పేస్తారు. అవతలవాళ్ళకు మళ్ళీ మాట్లాడేందుకు లేకుండాచేస్తారు" అంటూ అభినందనగా చూశారాయన.

"అందరితరఫున మాట్లాడేటందుకు నేనున్నానుగా, ఇంత వారికి శ్రమెందుకు?" అంటూ కోటలోపలికి దారితీశారు కృష్ణస్వామి. ప్రేయరుకు సమయం సమీపిస్తున్నది అన్న భావన తమ ముఖంలో లీలగావ్యక్తంచేస్తూ.

ప్రేయరుకు ముందునుండే ఆ దివ్యానుభూతి కలగడం ప్రారంభించింది. అన్నట్లు తృప్తిగాచూస్తూ సోదరులు ఆయనను అనుసరించారు.

# పెద్ద దిక్కు

ఒకరోజున సాయంత్రం ప్రార్థన పూర్తయింది. ప్రశాంతంగా కూర్చొనివున్న కృష్ణస్వామిగారి వద్దకు ప్రేయరులో పాల్గొన్న వడివయస్కులొకరు చేరారు. ఏదో చెబుదామని చూస్తూ ఉండగా అదేమిటో చెప్పండి ఫరవాలేదు అన్నట్లు చూశారు కృష్ణస్వామి.

ఆయన నిదానంగా ఇలాచెప్పారు: పరిస్థితులన్నీ తారుమారుగా ఉన్నాయి. ఏపనీ తెమలడంలేదు. ఊహించినట్టుగా ఒక్కటీ కలిసిరావడంలేదు. మనస్సంతా అయోమయంగా ఉంటోంది. ఏలినాటిశని నడుస్తోందీఅన్నారు. సంధ్యావందనం, పూజకూడా ఆగిపోయాయి. ఏమీపాలుపోవడంలేదు. నామట్టుకు నేనుఏమైనా ఫరవాలేదు. ఇంతవరకూ చూచుకొంటూవచ్చిన తల్లిదండ్రుల్ని ఇకపైనకూడా అలాగే చూడగలనాఅనీ దొడ్లోఉన్న ఆ రెండావులను పస్తుపెట్టకుండా బ్రతికించుకోగలనా అనీ మనస్సు మథనపడుతోంది. నాన్నగారు నిష్ఠాగరిష్ఠులు. ఆయన కన్నీ యథావిధిగా జరగాలి. అలా జరిపితేనే నాకు తృప్తిగా ఉంటుంది. కానీ జరపగలనా? అని.

కృష్ణస్వామి ఇలాఅన్నారు: మీ నాన్నగారి నియమబద్ధమైన జీవితమే మీ కుటుంబానికి శ్రీరామరక్ష. ఆయన నియమనిష్ఠలే మీ కుటుంబసభ్యులు ఎక్కడఉన్నా ఏలోటూ లేకుండా

జీవించేటట్లు చూస్తున్నారు మరి ఆయనకు లోటు ఎందుకు వస్తుంది? ఆ దంపతులు మీ ఇంట్లో ఉండడం మీ అదృష్టం. అలాంటి దంపతులకు బిడ్డగా పుట్టామన్న తృప్తి చాలు మీకు. జీవితంలో ఎన్ని కష్టనష్టాలు, ఒడిదుడుకులు వచ్చినా, ఆతృప్తే మనను ముందుకు నడిపిస్తూ ఉంటుంది. ధనధాన్యాలతో కొనుక్కుందామంటే దొరికేది కాదు ఆ తృప్తి. ఏమంటారు?

"నిజమేనండి మీరన్నది. అక్షరాలా నిజం! కానీ ఏదో భయం! ఇన్నాళ్లనుండి జరుగుతూవస్తున్న ఆ కార్యక్రమాలన్నీ ఇకపైన ఆగాల్సివస్తుందేమోనని ఏదో భయం" అన్నారాయన.

"ఎందుకాగాలి? మనం అపుదామనుకొన్నా ఆగదు ఆ గాలి. అది మనమీదుగా సాగుతూనే ఉంటుంది" అన్నారు మందహాసంతో కృష్ణస్వామి.

"ఆ గాలి అలా సాగాలనే కోరుకుంటున్నాను" అన్నారాయన తన్మయత్వంతో ఆదొకరకమైన అనుభూతిని పొందుతూ.

కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు: ఏలినాటి శనిని చూసి దడిసిపోకండి, శని ఉన్నది మనను దడిపించడానికి కాదు, విడిపించడానికి. ఇంతవరకూ మనంచేసుకున్న అవకతవకలనుండి విడిపించడానికే అతనున్నాడు. జీవితంలో తగిన సర్దుబాట్లు చేసుకోవడానికి ఇది అనుకూలమైన సమయం. పరిస్థితులు తారు మారై పోయినట్లూ, ఏ ఒక్కటీ కలసిరానట్లూ కనబడుతున్న

మాట నిజమే. ఇప్పుడు మనం చేయవలసింది బాధపడటం కాదు. అలా ఎందుకు జరుగుతోందో బోధపరచుకొని సరిదిద్దుకోవడమే. శని ఒక చక్కని శిక్షకుని వంటివాడు. మనంచేసిన తప్పులకు తగిన శిక్ష విధిస్తున్నట్టు పైకి కనబడినా, మళ్ళీ తప్పులు దొర్లకుండా తగిన శిక్షణ ఇస్తున్నట్లు, కొంచెం లోనికి చూడగలవారికి తెలుస్తుంది. శిక్షగా అనుభవిస్తామా? శిక్షణగా స్వీకరిస్తామా అన్నది మనం నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

శిక్షగా అనుభవిస్తే కలిగేది వేదన, శిక్షణగా స్వీకరిస్తే జరిగేది సాధన. వేదనస్థితినుండి సాధనస్థితికి మనం ఎదగ గలిగితే, శని మన తప్పులను మనం దిద్దుకోవడంలో మనకు సాయపడే ఒక పెద్దదిక్కుగా మనకు దర్శనమిస్తాడు. మనింట్లోనే మనలోని లోటుపాట్లను ఎత్తిచూపి, మందలించి దారి చూపే పెద్దవాడున్నాడనుకో. అది ఎంత అదృష్టం! మనం బుద్ధిమంతులమైతే ఆయనకు మరింతదగ్గరై మన లోటుపాట్లను సరిజూసుకొంటూ ఆయన సలహాప్రకారం నడుచుకోవడానికి ఇష్టపడుతాంకదా! ఈ సౌరకుటుంబానికి శని అలాంటి పెద్దదిక్కు. మానవుడు చేసిన దుష్కర్మలకు తగిన ఫలితాలు అతనికి అనుభవంలోనికి తీసుకురావడంద్వారా మరల అలాంటి దుష్కర్మలు చేయవద్దని, జీవితాన్ని తీర్చిదిద్దుకోమని హెచ్చరించే పెద్దదిక్కు ఆయన.

కనుక మీకు ఏలినాటిశని అని దడిసిపోకండి. సంధ్యా

వందనం. సాధన తిరిగి ప్రారంభించండి. వస్తున్న సన్నివేశాలను అర్థంచేసుకొంటూ జీవితాన్ని సరిదిద్దుకొనే ప్రయత్నం చేయండి. మీరు సరిదిద్దుకొంటున్నకొద్దీ ఆ శనైశ్చరుడు మీకు మరింత సహకరిస్తాడు. గ్రహాలు మనను శాపించేందుకు లేవు. మనకు సహకరించేటందుకే ఉన్నాయి. ఆ సహకారం స్వీకరించే స్థితికి మనం ఎదగవల్సివుంది. మానవజీవితంలోని లోతులను గమనించుకొంటూ, జీవిత నిర్వహణంలోని లోతులను సరిదిద్దుకోవాలని అతని ప్రేమపూర్వకమైన హెచ్చరిక. ఏమంటారు ?

“అంతేనంటారా!” అంటూ ఏదో బరువు దిగినట్టుగా ఫీలయ్యాడాయన. “ఇంతకీ శని మనకు పెద్దదిక్కంటారు” అంటూ చిన్నగా నవ్వాడు. మనస్సులోపల ఏదో వెలగవలసింది వెలిగినట్టుగా ఆ నవ్వులో గోచరించింది.

కొంతసేపు మౌనంగా గడిచింది.

కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు: “భారతంలో భీష్ముడు “కష్టాలు వచ్చినందుకు నేను కలతపడను. అప్పులు తీర్చుతున్నవాడు ఆ అప్పులు తీరినందుకు తృప్తిని అనుభవిస్తాడు. కాని దుఃఖపడడుకదా” అంటాడు. మనంకూడా అలాంటి దృక్పథాన్నే అలవాటు చేసుకోవాలి. “ఋణములు కడతేరెనటంచు, సుఖింతు” అన్న భీష్ముని మాట మనకు ఆదర్శం కావాలి. జీవితంలో కావల్సిన సర్దుబాట్లు చేసుకోవడానికి వీలయిన సమయం వచ్చింది అని గ్రహించి సద్వినియోగం

చేసుకోవాలి కాని, ఏలినాటి శని అని డీలా పడిపో కూడదు. ఏమంటారు ?

ఆయన మరికొంత కోలుకున్నట్లు కనిపించారు. కొంచెం సేపు ఆగి, ఆయన ఇలా అన్నారు: "తలపెట్టిన మంచికార్యాలు మాత్రం ఆగడంలేదు. ఏదో ఒకరకంగా పనులన్నీ ఒనకూడి అవి సాగిపోతున్నాయి. కాకపోతే వెనకేసింది ఏమిటీ అంటే ఏమీలేదని మాత్రమే చెప్పాలి.

కృష్ణస్వామి నవ్వుతూ, "మీరు ముందు వేసుకుంటున్నారు. ఇంత వెనక వేసుకోవాల్సిన అవసరమేముంది ? ముందు వేసుకోవడం చాతకానివారు వెనక వేసుకొంటారు" అన్నారు.

ఆ మాటలకాయన చిన్నగా నవ్వుతున్నారు.

కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు: "మీ నాన్నగారు ముందు వేసుకోబట్టేకదా ఈనాడు మీ అన్నదమ్ములు, అప్ప చెల్లెళ్ళు ఇలా ఉన్నారు. అలాగే ఇప్పుడు మీరు ముందు వేసుకొంటున్నారు. కనుక మీ పిల్లలకూ బెంగలేదు.

అదిగో ఆ మాస్టరుగారు ముందు వేశారు. కనుకనే ఈనాడు మేం పరిచయం అక్కరలేకుండా పనిచేసుకు పోగలుగుతున్నాం. అలాగే మేం ఇప్పుడు ముందువేస్తున్నాం. మా తరువాతివాళ్ళుకూడా ఇలాగే ముందుకు సాగిపోతుంటారు.

సంపద ఆర్జించేవాళ్ళల్లో మూడు తెగల వాళ్ళుంటారు సత్కార్యాచరణ రూపంలో ముందుకు వేసేవారు మొదటితెగ. మనం ఎలాగూ చేయగలిగిందిలేదు, పిల్లలకైనా ఉంటుంది అని వెనక వేసేవారు రెండవతెగ. ఇటూ, అటూ ఎందుకవి వ్యసనాల పాలయి వృధా చేసుకొనేవారు మూడవతెగ. ఇందులో ఏతెగకు చెంది ఉన్నామో ఎవడికి వాడు చూసుకోవాలి.

"మూడవతెగమాత్రం మరీ దారుణంలెండి." అన్నారాయన. ఒక్క క్షణంఆగి "ఇంతకూ మా ఇంటికి ఎప్పుడొస్తారు?" అనడిగారు.

"అది నాకు వదిలేయండి. నేను ఎప్పుడురావాలో నాకు తెలుసుకదా! అప్పుడు తప్పకుండా వస్తాను. మీతో చెప్పకుండా వస్తాను" అంటూ ప్రేమగా చూశారు కృష్ణస్వామి.

"అంతకంటేనా! మహాద్భాగ్యం." అంటూ వెలుగుతున్న వదనంతో సెలవు తీసుకొన్నారాయన. ●

## కస్తూరి నుండి కర్తవ్యం వరకూ

ఒకరోజు ఉదయం ఒక చురుకైన యువకుడు ప్రవేశించాడు. ఇప్పుడిప్పుడే మాస్టరుగారి ఉద్యమానికి దగ్గరై మనతో ప్రతికలపాలని కోరుకొంటున్నవాడతను. ప్రార్థన

పూర్తయిన తరువాత ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ కృష్ణస్వామి మీ స్వగ్రామం ఏది? అని అడిగారు.

"మా అమ్మగారిది తమిళనాడు. నాన్నగారిది కర్ణాటక. మేం ఆంధ్రదేశంలో పుట్టిపెరిగాం" అన్నాడతను నవ్వుతూ.

"అయితే మీది త్రివేణీ సంగమం అన్నమాట!" అన్నారు మాస్టరుగారు చిరునవ్వు నవ్వుతూ.

ఆ యువకుడు నవ్వుకొన్నాడు.

"కన్నడ కస్తూరి అంటారు తెలుసా!" ప్రశ్నించారు కృష్ణస్వామి.

తెలుసు నన్నాడతను.

"ఇప్పటి కన్నడ కస్తూరి తెలుసునా?" అన్నారు కృష్ణస్వామి.

"ఎవరు" అన్నట్టు చూశాడతను

"పుట్టపర్తిలో బాబాగారిదగ్గర ఉంటారు. సనాతన సారథికి ఎడిటర్. మైసూరు యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పని చేశారు రిటైరైన తర్వాత పుట్టపర్తిలో స్థిరపడ్డారు.

అలాగా అన్నట్టు చూశాడతను మంచివిషయం తెలిసిందన్నట్టుగా!

"ఆయనా, నేనూ చిత్రంగా కలుసుకొన్నాం. ఒకసారి నేను పుట్టపర్తి వెళ్ళాను. పెట్టెబేడా ఒకచోటువదేసి కస్తూరి గారిని కలవాలని బయల్దేరాను. ఆయనపేరు వినడం, రచనలు చదవడమేగాని మనిషిని అప్పటికి ఎరుగను. ఆయన ఎక్కడ ఉంటారో ఎవరినయినా అడుగుదామని అనుకుంటూ ఉండగా ఒక ముసలాయన కనబడ్డారు. పండుటాకులా ఉన్నారు. గట్టు మీదనుండి క్రిందకు మెట్లు దిగబోతూ ఉంటే కొంచెం తూలు వచ్చినట్టుంది. "బాబూ! కొంచెం చేయి అందిస్తావా?" అని అడిగారు. "తప్పకుండా!" అంటూ ఆయనతో చేయి కలిపాను.

చివరిమెట్టు దిగుతూ ఎవరుబాబూ నీవు? అనడిగారు. నాగురించి చెప్పి కస్తూరిగారు కావాలని అడిగాను.

ఆయన నవ్వుతూ "నేనేబాబూ కస్తూరిని" అన్నారు.

ఇద్దరం ఆదోరకమైన అనుభూతి పొందాం. ఆరాత్రి వారిని తాపీగా కలుద్దామని వెళ్ళాను. మరోవృద్ధుడెవరో ఆయనతో కలిసి భోజనం చేస్తున్నట్లు కనిపించింది. ఆ తర్వాత ఆయనవల్ల తెలిసింది, ఆ వృద్ధు డెవరో కాదనీ, వారి పెద్దకొడుకేననీ, రిటైర్ అయిపోయిన తర్వాత తండ్రితో కలిసి ఉండటానికై వచ్చారనీ.

బాగుందికదూ! తండ్రీ కొడుకుల కథ. "రిటైరైన కొడుకుతో తండ్రి! అదో అనుభూతి. అంతేకాదు వాళ్ళెంతో సరసాలాడుకొంటున్నారు నేను చూసినపుడు. ఆ తర్వాత విన్నాను

బాబాగారిపై బుర్రకథ రచించి ఆ తండ్రికొడుకు లిద్దరూ కలసి గానంచేయుసాగారని. ఇంకా సంతోషం కలిగింది. తండ్రీ కొడుకులు చాలామంది ఉంటారు. కానీ సజీవమైన అనుబంధం కలిగిన తండ్రీబిడ్డలు ఎందరుంటారు అని.

పాపం! ఆతర్వాత విన్నాను. ఆకొడుకు కాలంచేశాడని. చాలాబాధ కలిగింది. తండ్రిముందే కొడుకుపోవడం. కొడుకు తండ్రికి చేయాల్సిన విధులు తండ్రి కొడుక్కు నిర్వర్తించ వలసిరావడం, ఏమిటో చిత్రం!"

ఆ కాసేపటిలోనే ఉత్సాహం, సంతోషం, బాధ, అనుభ వించాం ఆ సన్నివేశంలోఉన్న అందరం.

కాసేపు నిశ్శబ్దంగా గడచింది.

కృష్ణస్వామి ఇలా అన్నారు: చూడు ఏం జరిగిందో! ఆయనను చూడాలని గట్టిగా అనుకొనేటప్పటికి ఆయన ఎదురుగా నిలిచారు. మనం నిజంగా గట్టిగా అనుకోవాలేగాని అన్నీ జరుగుతాయి.

నాకప్పుడప్పుడు అనిపిస్తూవుంటుంది, ఈ రాజకీయనాయ కులు జనాన్ని ఆకట్టుకోవడంకోసం దేశాన్ని తలచుకొంటు న్నారుగానీ, వాళ్ళు నిజంగా, గట్టిగాఅనుకుంటే ఈదేశం ఎందుకు బాగుపడదూ? అని, బాగుపడుతుంది. కానీ వాళ్ళు గట్టిగా అను కోవడంలేదు. ఏమంటావ్?"

"నిజమేనండీ" అన్నాడతను.

"దేశంగురించి మనకు చెబుతున్న సమయంలో ఆయా నాయకుల మనస్సుల్లో దేశం మెదలడంలేదు. వాళ్ళ పదవులు మెదలుతున్నాయి వాళ్ళు వాటినే గట్టిగా కోరుకొని, వాటినే సాధించుకొంటున్నారు. పదవికన్నా దేశ(శ్రేయస్సు ముఖ్యం అని వాళ్ళు గట్టిగా అనుకోగలిగితే వాళ్ళు దానిని సాధించగలుగుతారు. కానీ అలా అనుకోవడానికి చాలా తెగాలి" అన్నారు కృష్ణస్వామి.

'అవునండీ" అన్నాడతను.

కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు: చూశావా? కస్తూరి గారిని కలవాలని నేను మనస్సులో అనుకొన్నాను. అంటే మనస్సుతో పిలిచాను. ఆ పిలుపుకు ఆయన ఎదుటనిలిచారు. అలాగే దేశం బాగుపడాలని, జాతి పునరుజ్జీవంపొందాలని మనం మానసికంగా గట్టిగా పిలుపునివ్వగలిగితే చాలు. ఆ పిలుపును జాతి తప్పక అందుకొంటుంది. స్వాతం(త్యఉద్యమంలో మహాత్ముడు మనజాతిని పిలిచింది అలానే. మనస్సుతోనే పిలిచాడాయన. మనసారా పిలిచాడాయన. ఇప్పటిలాగా ఆరోజుల్లో ఇన్నిరకాల (ప్రయాణసౌకర్యాలుగాని, టీవీలు మొదలైన ఎలక్ట్రానిక్స్ గానీ ఉన్నాయా? ఆయన మానసికమైన పిలుపును అందుకునే, జాతి ఆయన వెంట నడిచింది. ఆయన దృఢసంకల్పమే ఆ పిలుపుకు అంతటి శక్తినిచ్చింది. ఏమంటావ్?"

నిజమేనండీ అన్నాడతను.

కానేవు మళ్ళీ మౌనంగా వడిచింది. అందరం ఆదో విధ మైన స్ఫూర్తినిపొందుతూ అలా ఉండిపోయాం.

"అన్నట్టు ఒక విషయం గుర్తుకొచ్చిందోయ్! కర్నాటక లోను, తమిళనాడులోనూ మీ బంధువులు ఎవరైనా ఉన్నారా?" అడిగారు కృష్ణస్వామి.

"ఉన్నారండీ" అన్నాదతను.

"మీకూ వాళ్ళకు రాకపోకలు ఉన్నాయా?"

"ఉన్నాయండీ. తరచు వస్తూపోతూ ఉంటారండీ" అన్నాదతను.

"ఏమీలేదు. మనగ్రంథాలు అన్ని దేశభాషల్లోనికీ అను వాదంజరగాలన్న ప్రణాళిక ఒకటిఉంది" అన్నారు కృష్ణస్వామి.

"మా బంధువులు ఉన్నారుగానండీ! వాళ్ళల్లోరచన చేయ గలవాళ్ళు ఉన్నట్టులేరండీ!" అన్నాదతను.

ఇప్పుడే అనుకున్నాంగదా! జరగవలసిన పని ఇది. దీనిని గట్టిగా సంకల్పించు. బంధువులుగానో, బంధువులమిత్రులుగానో ఆ రచనాసామర్థ్యం గలవాళ్ళుగా నీకు దగ్గరవుతారు. వాళ్ళకు మొదటగా 'అన్వేషణ - అనుభూతి' ని అందించు. దానితో ప్రారంభించమను" అన్నారు మాష్టరుగారు.

"తప్పకుండా! అలాగే చేస్తానండీ" అంటూ ఒక విధమైన అనుభూతితో విలివాడతను.

"చూశావా! కస్తూరితో ప్రారంభమైన కథ నీకర్తవ్యం దగ్గరకువచ్చి నిలిచింది" అన్నారు కృష్ణస్వామి అతనివైపు ఆశీః పూర్వకంగా చూస్తూ.

## డబ్బు - జబ్బు

"ఇద్దరూ ఒకలాంటిపనికే వెళ్ళివచ్చారుకదా, అతనికి అవనంత ఖర్చు నీ కెందుకైంది?" అని అడిగారు కృష్ణస్వామి మాలోని ఒక యువకుణ్ణి.

యువకులకు శిక్షణ ఇవ్వడంలో వాళ్ళ ఆదాయ వ్యయాలను గమనించడంకూడా ఒక అంశంగా పెట్టుకొన్నారాయన. ఎప్పటికప్పుడు వాటినిగమనిస్తూ యువకులకు తగిన సూచనలు ఇస్తూ ఉంటారు, నా దారినపడ్డారు అన్న విశ్వాసం కలిగిన తర్వాత వారిని నిశ్చింతగా విడిచిపెట్టడమే కాక మరికొంతమంది క్రొత్త కుర్రవాళ్ళను తగిన శిక్షణకోసం ఈ తయారైనవాళ్ళకు అప్పచెబుతూ ఉంటారు. ఏ విభాగంలోనైనా ఆయన విధానం ఇలాగే ఉంటుంది. వ్యక్తులను వారివారి అభిరుచులనుబట్టి తీర్చి దిద్దటం, అలా తీర్చిదిద్దబడినవారికి ఆయారంగాలకు సంబంధించిన క్రొత్తయువకులను శిక్షణకై అప్పజెప్పటం ఆయనకో ముచ్చట.

యువకులకు యువకులచేతే శిక్షణ ఇప్పించాలన్నది ఆయన ప్రణాళికలోని ఒక ప్రధానభాగం. యువకులకు శిక్షణ ఇచ్చేటట్లుగా యువకుల్ని తయారుచేయాలి అంటే ఇది ఒక మహాయజ్ఞం. అనుభవజ్ఞులైన పెద్దలను కలుపుకొంటూ మాస్టరుగారు ఈ శిక్షణా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. పెద్దల అనుభవాన్ని యువకుల ఆవేశానికి జోడించి, వాళ్ళను ఆదరణశీలురుగా తోటి యువకులకు మార్గదర్శకులుగా తీర్చిదిద్దుకొంటూ వస్తున్నారాయన. ఆ శిక్షణాయజ్ఞంతో ఈరోజు మావాడి వంతు వచ్చింది. మావాడు కొంచెం తటపటాయిస్తున్నాడు. పెట్టేటప్పుడు తెలియకపోయినా పెట్టేసిన తరువాత తెలుస్తుందిగా! అది పెట్టవలసిన ఖర్చు కాదని.

"ఏమిరా! మౌనం వహించావు. ఆ మౌనం ఏదో అవసరమైన ఖర్చు పెట్టబుద్ధి అవుతున్నప్పుడు వహించవచ్చు కదా! ఏది కనబడితే అది కొంటావ్! ఏది అనిపిస్తే అది చేసేస్తావు! ముందువెనుకలు చూసుకోనక్కరలేదా? మొన్నెప్పుడో బూట్లు కొన్నావట! ఇంటిదగ్గర అమ్మానాన్నా రోజులు గడవటమెలాగా అని ఆలోచిస్తూంటే బూట్లుకొనుక్కునే నీలాంటి "బ్రూట్" ఎవడైనా ఉంటాడా? ఇంతవరకు నీ సంపాదనలో పట్టుమని పదిరూపాయలు మిగిల్చి మీ తల్లిదండ్రుల చేతుల్లో పెట్టావా? పోనీ, నీ సంపాదన నీవే ఖర్చుపెట్టుకొంటున్నావని సరిపెట్టుకొందామన్నా, ఇంతవరకూ నీవు చేసుకొంటూవచ్చిన అప్పుల మాటేమిటి? ఈ సంపాదనతో ఆ అప్పులు తీర్చా

అనిపించలేదా? అసలు నీకు వాళ్ళదగ్గర తీసుకొన్నట్లు గుర్తుంటే కదా! ఇన్నిటిమధ్యలో విలాసంగా ఉండగలుగుతున్నావంటే నీది ఒక యోగమే! C.V.V. గారిది వ్యక్తరహిత కారకరాజ యోగమైతే, ఏది బాధ్యతారహిత కాకాస్థాయి యోగం!

ఏమిటి! అలా చూస్తావ్! "మీరేదో జాతిని పునర్నిర్మాణం చేస్తానన్నారుగా! ముందు నన్ను పునర్నిర్మాణం చేయండి చూద్దాం!" అన్నట్లుంది నీ చూపు. నువ్వు నాకే ఒక సవాలుగా పరిణమించావురా!" అన్నారు కృష్ణస్వామి.

ఆ యువకుడు కొంచెం తలదించుకున్నాడు. మీరు చెప్పినట్లుగా ఉందామని అనుకున్నా ఉండలేకపోతున్నానండి అన్నట్లు చూస్తున్నాడు దిగులుగా.

"కొందరు డబ్బు సంపాదిస్తారు కానీ ఖర్చుపెట్టలేరు. ఖర్చుపెట్టటానికి ప్రాణం ఒప్పక లోభితనంతో దాచుకొంటూ ఉంటారు. అప్పుడు డబ్బు నపుంసకుడికి చిక్కిన అందమైన భార్యలా బాధపడుతూ ఉంటుంది.

కొందరు సంపాదిస్తారు. నిలబెట్టుకోలేరు. డబ్బును మంచినీళ్ళలాగ ఖర్చుపెడతారు. ఆ ఖర్చుపెట్టటానికి ఒక పద్ధతీ పాడూ ఉండదు. అప్పుడు డబ్బు తన భర్తచేతనే విటులకు అప్పగించబడుతున్న భార్యలా కుమిలిపోతూ ఉంటుంది.

తనను సద్వినియోగం చేయగల సమర్థుణ్ణి ధనం కులస్త్రీ వలె సేవిస్తుంది. అతనితో చిరకాలం సహచరించి అనితర

సాధ్యమైన తృప్తిని, ఏందుదనాన్ని అతనికి అందిస్తుంది" అన్నారు కృష్ణస్వామి.

ఆ యువకుడు జరిగినదానికి సిగ్గుపడుతూ, తనకింకా జీవితంలో కావలసిన పట్టుదిక్కు లేదని బాధపడుతూ కూర్చు న్నాడు నేలవైపు సాగిన అతని చూపులు మెల్లగా మాస్టారు గారి పాదాలవైపుకు మళ్ళుతున్నాయి.

కొంచెంఆగి మాస్టరుగారు అనునయంగా మళ్ళీ ఇలా అన్నారు : అవసరమైనచోట ఏమాత్రం వెనుకాడకూడదు. అవసరంలేనిచోట ఎంతమాత్రం తొందరపడకూడదు. "నీవు పెట్టే నీళ్ళఖర్చునుబట్టి, నీవుపెట్టే డబ్బుఖర్చు తెలుస్తుందని" పెద్దలు చెబుతూ ఉంటారు. నేను ఇంకోటికూడా చెబుతున్నాను. "నీవు డబ్బు ఖర్చుపెట్టేవిధానం నీ జీవితకాలాన్ని నీవు ఖర్చుచేసే విధానాన్ని తెలియజేస్తుంది. జీతాన్ని సద్వినియోగం చేయలేని వాడు జీవితాన్ని సద్వినియోగం చేయగలడా ? ధనాన్ని ఖర్చు పెట్టడంలో నేర్పరి కానివాడు, కాలాన్ని ఖర్చుపెట్టడంలో నేర్పరి తనాన్ని చూపగలడా ?

ఆ యువకుడు తన చూపులతో మాస్టరుగారి పాదాలను కడుగుతున్నాడు. ఇకనుండైనా సరైనపద్ధతిలో జీవించేటట్లు చూడమని ఆ పాదాలను అడుగుతున్నాడు.

కొంతసేపు గడిచింది. అతనివైపు ప్రేమగా చూస్తూ మాస్టరుగారు ఇలా అన్నారు : "అవసరాలనుకూడా పట్టించుకో

కుండా డబ్బును దాచుకోవాలనిపించడం, అనవసరంగా ఊరికే వృథాగా డబ్బును ఖర్చుపెట్టాలనిపించడం హోమియోపతి ప్రకారం ఈ రెండూ జబ్బులే। వీటికి మందులు కూడా ఉన్నాయి. నువ్వు బాగుపడాలని దృఢంగా సంకల్పించు ఇవాళ రాత్రికి నీకు మందు వేస్తా అది నీకు చక్కగా సహకరిస్తుంది. నామాట వినడం మాట ఎలా ఉన్నా, ఆ మందుమాటైనా విని, నువ్వు బాగుపడితే సంతోషిస్తా।"

మీరు వేస్తానంటున్నారు కాబట్టి తప్పక వేసుకొంటాను. కానీ నిజానికి మీ మాటలే నాకు నిజమైన మందు అన్నట్లుగా చూస్తూ సెలవు తీసుకున్నాడతను.

## అందరూ వినవలసినదే

ఆ రాత్రి పడుకోబోయేముందు తనతో పనిచేస్తున్న యువకులలోనుండి ఒక యువకుణ్ణి పిలిచారు కృష్ణస్వామి. ఆ యువకుడు దూరప్రాంతంనుండి వచ్చి ఇక్కడ పనిలో పాలు పంచుకొంటున్నవాడు అతనితోపాటు ఉత్సాహవంతులయిన మరికొందరు యువకులను తీసుకొచ్చినవాడు.

"దుప్పట్లవీ అన్నీ ఉన్నాయా?" అడిగారు కృష్ణస్వామి.

యువ : ఆ! ఉన్నాయి. తుసాలి టవలు, దుప్పటి అవీ తెచ్చుకున్నాను.

కృష్ణ :- మంచిది. మీతోవచ్చినవాళ్ళుకూడా అలా తెచ్చుకున్నారా !

యువ :- ఈసారినుండీ తెచ్చుకునేటట్టుగా చూస్తాము.

కృష్ణ : ఇలాంటివి చూసుకుంటూ ఉండాలి. ఇవి చిన్న విషయాలే అయినా ముఖ్యమైనవి ఇంట్లో అన్నీవున్నా అగ్గిపెట్టె లేదనుకో ! ఆరాత్రి అప్పుడే కరెంటు పోయిందనుకో ! అగ్గిపెట్టె విలువ ఎంతఅన్నదికాదుముఖ్యం - ఆరాత్రి ఎలా గడపా అన్నది అంశం. అలాగే మనటవలు మనం తెచ్చుకోవడం. మనసబ్బు మనం ఏర్పాటుచేసుకోవడం. మనం వాడినతర్వాత బాత్రూం మనతోటివాడు వాడుకునేందుకు వీలుగాఉంచటం, ఉతికినబట్టలు ఎవరికీ అడ్డురాకుండా ఆరవేసుకోగలగడం. కుర్చీలు మొదలయినవాటిలో కూర్చునిలేచేటప్పుడు మళ్ళీ వాటిని యథాస్థానంలో ఉంచగలగడం. ఇలాంటివి చిన్నచిన్నపనులే అయినా చాలా ముఖ్యమైనవి. క్రమశిక్షణతో చేయవలసినవి.

ఈ చిన్నవిషయాల్లో మనం పద్ధతిని పాటించగలిగితే మనం ఇంట్లోఉన్నా మరొకరి ఇంట్లోఉన్నా మనవల్ల మరొకరికి ఇబ్బందికలుగకుండా జీవించినవాళ్ళమవుతాం. మనం ఎవరింటికైనా వెళ్ళినప్పుడు "ఇతను మళ్ళీవస్తే బాగుండునని" వాళ్ళకు అనిపించాలిగానీ ఇక వీడెప్పుడూ రాకూడదురా బాబూ ! అని వాళ్ళు దేవుడికి మొక్కుకోవడం జరగకూడదు.

మనం ఎక్కడున్నా మనప్రక్కవాళ్ళకు మనవల్ల అసౌకర్యం కలుగకూడదు. చాతనైతే మనవల్ల వాళ్ళకు సౌకర్యం

కలిగేటట్టుగా ప్రవర్తించాలి. నీవు నీ మిత్రుడి ఇంట్లోనో, చుట్టాల ఇంట్లోనో ఉన్నప్పుడు అక్కడున్నవాళ్ళు ఉత్తరం వ్రాసి "గమ్" కొరకు వెతుక్కుంటున్నారనుకో లేదా వెతుక్కుందామని లేవబోతున్నారనుకో: అప్పుడు నువ్వు నీ "కిట్"లో నుండి గమ్ బాటిల్ తీసి గమ్మును వాళ్ళకు అందించగలిగితే - ఎలా ఉంటుంది? అలాగే గుండుసూదులు, జెమ్‌క్లిప్పులు మొదలైనవి కూడా నీ కిట్‌లో ఉండాలి. వాటి ఖరీదు తక్కువే కావచ్చు కానీ వాటి ప్రయోజనం దొడ్డది. నీకూ, నీతో ఉన్నవాళ్ళకీ అవి ఎంతగానో ఉపయోగపడతాయి.

రైల్లో వెళ్తూ ఉంటాం. ఒక తల్లి ఆపిల్ పండు కొని, దాన్ని పిల్లలకు ఎలా పంచాలా? అని ఆలోచిస్తూ ఉంటుంది. వెంటనే నీవు నీ "కిట్"లో ఉన్న చిన్న చాకు తీసి ఆవిడ కిచ్చావనుకో - ఆవిడ ఎంత ఆనందిస్తుంది?

రైల్లో నీ ప్రక్కనున్న వ్యక్తి దప్పికతో బాధపడుతున్నట్టు నీకు అనుమానం వచ్చిందనుకో. నీ వాటర్ బాటిల్ నుండి నీదగ్గరున్న చిన్న గ్లాస్‌లోనికి కాసిన్ని నీళ్ళు వంచి తీసుకోమని అందిస్తుంటే అతని ముఖంలో నీకు ఏమి కనిపిస్తుంది?

మనం తెలియక ఒక పొరపాటు పడుతుంటాం. మన తోటివ్యక్తులకు విలువైన వస్తువులిస్తే వారు తృప్తిపడతారని. నిజానికి అవసరమైన వస్తువులిస్తే మనిషికి కలిగే తృప్తి విలువైన వస్తువులిచ్చినప్పుడు కలుగదు. అతడు దేనికోసం చూస్తున్నాడో, అతనికి ఏమి అవసరమో గమనించి మనం

ఇవ్వగలిగాలి. అప్పుడు అతనికి గలిగే తృప్తి ఇంతింత అని చెప్పలేం। అయితే ఆ ఇచ్చేటప్పుడు అవతలివ్యక్తినుండి మనం ఎలాంటి ప్రయోజనాన్ని అపేక్షించగూడదు. రేపెప్పుడో దేనికో పనికిరాకపోతాడా అని అతని అవసరాన్ని గమనించి సహకరించామనుకో। అది లౌక్యమవుతుంది. అతనికీ మన లాంటి అవసరమే కదా। అన్న భావనతో ఇచ్చావనుకో - అది ప్రేమ అవుతుంది.

అయితే ఇక్కడ మనమొక జాగ్రత్త పడాలి. మన మంచితనం "మెతకతనం" కాకుండా చూచుకోవాలి. విచిత్రమైన ఒడుదుడుకులిగి ఎవరికి ఎంతవరకు సహకరించాలో వారికి అంతవరకూ సహకరించి ముందుకు సాగిపోతూ ఉండాలి నీవు నీ మంచితనాన్ని ఇతరులకొరకు సద్వినియోగం చేయాలిగాని ఇతరులను నీ మంచితనాన్ని దుర్వినియోగం చేయనీయకూడదు.

రైల్లోనే ప్రయాణించే స్తున్నాం. ఒక వృద్ధుడు దప్పికతో బాధపడుతున్నాడని నీవు మంచినీళ్ళు ఇవ్వబోతుంటే బైటిబైనాక్కూడా కాపివి మంచినీళ్ళివ్వండి అని ఒక నవీన యువకుడు నీ పెదవి కదిలేలోపున గ్లాసు తీసుకొని త్రాగేశాడనుకో, ఆ ప్రక్కనున్న మరో జులాయియువకుడు నీ ప్రక్కనున్న వాటర్ బాటిల్ తీసికొని అందులోని మిగిలిన నీళ్ళను గడగటాత్రాగి వాన్నక్కడ పడేశాడనుకో। ఇంతకీ నీ విద్దామనుకొన్న వృద్ధుడికి మంచినీళ్ళందలేదు. అతనిగొంతు ఎండారిపోతూనేవుంది. "ఏమిటిరా। పుణ్యానికిపోతే పాపం ఎదురైంది" అనిపించవ

వచ్చు నీకు. వృద్ధుడికి నీళ్ళందకపోగా నీకు కూడా నీళ్ళు మిగలకుండా పోయాయిగదా! ఇదిగో ఇక్కడే ఒడుపు కావాలన్నది నేను. వాళ్ళుదారిన పడకుండా నీవా వృద్ధుడికి మంచినీళ్ళివ్వగలగాలి. రాక్షసులందారిన పడకుండా విశ్వామిత్రుడు యాగం పూర్తి చేసినట్టు. మంచినీళ్ళయజ్ఞం సక్రమంగా పూర్తి కావడానికి కావల్సిన రామలక్ష్మణులనుగూడా నీవా రైలులోనే సమకూర్చుకోగలగాలి. యజ్ఞం మానకూడదు - యజ్ఞం ఆగకూడదు. చూడుమరి".

ఆ కుర్రవాడొక్కడేకాదు, అందరూ అటుతిరిగి ప్రశాంతంగా వింటున్నారు. అందరూ వినవలసిందే ఇది అన్నట్లుగా చూశారు కృష్ణస్వామి. ●

## పెద్దలకేం నష్టంలేదు

విశాఖలోని మన ప్రధానకార్యాలయంలో ఒకరోజు మధ్యాహ్నం సోదరులతో కలిపి భోజనం చేస్తున్నారు కృష్ణస్వామి. అందులో ఒక సోదరుడు కొత్తగా దగ్గరయినవారు. భోంచేస్తున్నప్పుడు రెండవచేత్తో కాసేపు కంచం పట్టుకొంటున్నాడు. కాసేపుఆగి అదేచేత్తో పంచె సర్దుకొంటున్నాడు. అన్నం కూర, పులుసు ఉన్న గిన్నెలను ముట్టుకొని తరువాత పెరుగు, నెయ్యి ఉన్న పాత్రలను ముట్టేసుకోబోతున్నాడు.

కృష్ణస్వామి అతనినివారిస్తూ ఇలాఅన్నారు- "ఏమోయ్! సర్వం జగన్నాథం చేసేస్తున్నావ్! కంచాన్ని, పంచెను కలిపి పట్టుకొంటున్నావు పెరుగుకి, పులుసుకి జత కలిపేస్తున్నావు. బాగున్నదోయి నీకథ".

ఆ యువకుడు నాలిక కరచుకొన్నాడు కాని అలా వారించడంలోని పరమార్థమేదో అతనికి అంతగా అంతుపట్టినట్టులేదు. తప్పుచేశాననిమాత్రం గ్రహించాడు.

కృష్ణస్వామి ఇలా వివరించారు : రెండవచేత్తో కంచం పట్టుకొనే అవసరం మనకు రాకూడదు. ఒకవేళ పట్టుకోవలసి వస్తే ఆచేతిని మనం కడుక్కోవాలి. భోజనం చేస్తున్నప్పుడు కంచం పంచెకు తగలకూడదు. భోజనంచేస్తున్నది పంచె కాదు కదా! అలాగే భోజనంచేస్తున్నంతసేపు కంచం కదలకూడదు. ఆ కదిలిన చప్పుడు వినపడకూడదు లేకపోతే నీవూ, నీ కంచం ఈమూలకూర్చొని ఆమూలతేలుతారు. అన్నం, కూర, పులుసు మొదలయినవి ముట్టుకొని చెయ్యికడుక్కోకుండా పెరుగు, నెయ్యి ఉన్న పాత్రలను ముట్టుకోగూడదు. భోజనం చేసిన తరువాత నీవు చేయికడిగేనీళ్ళతో కంచం నిండకూడదు. అలాగని నువ్వు నీళ్ళుపోయకుండా వదిలిపెట్టడంవల్ల ఆకంచం ఎండకూడదు. కంచం ఎండకుండా తగుమాత్రం నీళ్ళుంచి కాళ్ళూచేతులు బాత్‌రూంలోనో, బయటనో కడగటం మంచిది. భోజనానికి ముందు, తరువాతకూడా కాళ్ళూచేతులు కడుక్కోవాలి. నోటిలో నీళ్ళుపోసుకొని పుక్కిలించి ఉమ్మేయాలి. ఊరంతా తిరిగొచ్చిన బట్టలతో భోజనంచేయడం మంచిదికాదు. భోజనంచేసినచోట,

భోజనపదార్థాలు పెట్టబడినచోట నీళ్ళుచల్లి శుద్ధిపెట్టుకోవాలి. ఇవన్నీ మన పెద్దవాళ్ళు మనం పదికాలాలపాటు ఆరోగ్యంగా బ్రతకాలన్న ఆకాంక్షతో పెట్టిన మంచినియమాలు. ఈ చిన్న నియమాలను పాటిస్తే మనం ఈనాడు చూస్తూన్న ఎన్నో పెద్ద రోగాలబారిన పడకుండా జీవించగలుగుతాం. ఏమంటావ్?"

నిజమేనన్నట్లుగా తలూపాడతను. భోజనాలు సాగుతున్నాయి.

కృష్ణస్వామి కొంచెం సేపయిన తరువాత మళ్ళీ ఇలా అన్నారు: ఇప్పటివాళ్ళలో చదువుకొన్నవాళ్ళు, మేధావులు హైజీన్, హైజీన్ అంటూ దేనికోసమైతే కొట్టుకొంటున్నారో, మనపెద్దలు దానినే సదాచారంగా రూపుదిద్ది అందించారు. ఎన్ని విషయాలు తెలిపినా సదాచారాన్ని పాటించనిదే జీవితం రాణించదు. అయితే ఆ సదాచారాన్ని అవగాహన చేసుకొంటూ అవలంబించినవాళ్ళు తక్కువ. ఒకవేళ అవగాహన లేకుండా పాటించినా సదాచారం మనను రక్షిస్తుంది కరెంటు అంటే ఏమిటో తెలియనివాడుకూడా స్విచ్ వేసుకొని లైటు వెలిగించుకొంటున్నాడుకదా! శాస్త్రసత్యాలను సదాచారం రూపంలో జనసామాన్యానికి అందించడంద్వారా సామాన్యజనుల జీవితాలుకూడా ఆ శాస్త్రసత్యాలకు అనుగుణంగా సాగేట్లుగా చూడగలిగారు మన పెద్దలు సదాచారంనుండి ప్రక్కకు తప్పుకోవడానికి శిక్షించారు. కాని దానివలన పతనమయ్యేది మనమే. ఆ పెద్దలకేం నష్టంలేదు. ఏమంటావ్?" అంటూ చేయికడుక్కునేందుకు లేచారు కృష్ణస్వామి.

ఆ యువకుడు మాస్టరుగారు చెప్పినవాటిని చక్కగా గ్రహించి అప్పటికప్పుడే అమలుపరచడం ప్రారంభించాడు.

## లోకం గొడ్డుపోలేదు

“పరిస్థితులేమీ అంతుపట్టడంలేదు. పెద్దవాడా కాలం చేశాడు. మరి ఈ చిన్నవాడికా ఇల్లుపట్టదు. పెద్దవాడి కొడుకా అయోమయం ఇక మూడవవాడు - వాడు తెచ్చుకొనే కాస్త జీతం వాడి భార్యాబిడ్డలకే సరిపోతోంది. ఇన్నాళ్ళూ కొద్దోగొప్పో చూశాడు వాడికీ పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారుకదా - ఏమిటో కళ్ళముందు ఒక పెద్దసముద్రం కనబడుతోంది. ఏమీ పాలు పోవడంలేదు” అంటూ తనబాధను వెళ్ళబోసుకొన్నాడొక వృద్ధుడు తన మేనల్లుళ్ళ కుటుంబస్థితిగతులనుగూర్చి. చిన్నతనంలో తల్లిదండ్రిపోతే మేనల్లుళ్ళను చేరదీసి పెంచినవాడు. ప్రయోజకుల్ని చేయుడానికి ప్రయత్నించినవాడు. ఇప్పటి మేనల్లుళ్ళ స్థితినిగూర్చి ఆయన పడుతున్న వేదనాస్వరూపమిది.

ఆ మాటలన్నీవిని కృష్ణస్వామి ఇలా అన్నారు : “కళ్ళ ముందు ఉన్నది సముద్రమైనా ఒక తెప్పను మనం తయారు చేసుకోగలిగితే నేర్పరితనంతో ఆ సముద్రాన్ని దాటవచ్చు. సముద్రాన్నిచూచి భయపడి లాభమేమిటి ? మీ మేనల్లుళ్ళు తెప్పను తయారుచేసుకోగలగాలి”.

నిజమేనన్నట్లుగా చూశాడా వృద్ధుడు. వాళ్ళందుకు ప్రయత్నించాలిగా అన్నట్లు నిట్టూర్చాడు.

కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు : మనిషి “చక్కగా బ్రతకడానికి మనిషి కుండవలసిన సద్గుణాలు రెండు. ఒకటి తాను చేస్తూన్న పనియెడల శ్రద్ధగలిగిఉండటం. రెండవది తనతో పనిఉన్నవాళ్ళు తనను విశ్వసించగలిగిన ప్రవర్తనను కలిగి ఉండటం. ఈ రెండులక్షణాలు ఉన్నవాళ్ళకు లోకంలో అన్నం పుట్టకపోవడం అంటూ ఉండదు. పనిలో స్థిరత్వం, ప్రవర్తనలో నిజాయితీ కోల్పోయినవాడు ఎంత తెలివిగలవాడయినా వాడికి ఈలోకంలో అన్నం పుట్టదు. పుట్టినా అది చిరకాలం వాడితో నిలబడదు. వీడికి స్థిరత్వం ఉంటేగా దానికి స్థిరత్వం ఉండటానికి ; వీడు నిజాయితీకినిలబడితేగా అది వీడితో నిలబడటానికి!

మీ మేనల్లుడికి స్థిరత్వం ఉండాలేకానీ, పని అప్పచెప్పగలిగినవాళ్ళు ఈఊళ్ళోనే ఉన్నారు. వీడికి పద్ధతి ఉందీ, మనం చేసిన సహకారం రాణిస్తుందీ అంటే సహకరించేవాడు ఈ లోకంలో లేకపోలేదు. ఈలోకం ఇంకా అంత గొడ్డుపోలేదు. మనకు పద్ధతిఉంటే సహకారం తప్పక లభిస్తుంది. ఇది ఎసరు, తెర్లుతోంది, బియ్యం పొయ్యండీ అంటే ఎవరైనా పోస్తారు కాని ఒక కన్నంలోనో, ఒక గొయ్యిలోనో పొయ్యమంటే పోస్తారా! ఆలోచించండి. లోకం మనదగ్గరే ఉంది. లోకాన్ని నిందించి ఏం లాభం ?”

ఆ వృద్ధుడు మీరు చెప్పింది అక్షరాలా నిజం అంటూ నిట్టూర్చాడు.

కృష్ణస్వామి అనునయంగా ఇలా అన్నారు: "ఈ సత్యం వంటపట్టేట్టుగా మరొకసారి మీవాళ్ళకు చెప్పిచూడండి. కష్టకాలంలో ఉన్నారుగనుక మీరు చెప్పేమాటలు కొంచెం ఒంటపడుతాయేమో చూద్దాం. మనిషిని నిజానికి దగ్గరగా తీసుకెళ్ళేటందుకే జీవితంలో కష్టాలు వస్తూఉంటాయి. ఇక నే నుంటాను."

"చెప్పిచూస్తాను బాబూ! మీ దయవల్ల వాడికి నా మాటలు నచ్చుతాయేమో చూస్తాను" అంటూ సెలవు తీసుకున్నాడా పెద్దాయన.

## బ్రహ్మకుకూడా అప్పులు ఉన్నాయి

"ఏమిటో ఈమధ్య ఒకటే అప్పులు అయిపోతున్నాయి. అప్పులు చేయకుండా బండినడిపేరోజు ఎప్పటికి వస్తుందో ఏమో!" అన్నాడు ఓ సోదరుడు.

కృష్ణస్వామి నవ్వుతూ ఇలా అన్నారు :- "అయితే నీ క్రెడిట్ రోజురోజుకీ పెరుగుతోందన్నమాట. నీలాటివాడే ఒకడు అన్నాడట — "దొరికినచోటల్లా క్రెడిట్ తీసుకోవడమే నా క్రెడిట్" అని. అసలు మన భారతదేశానికే ఆ క్రెడిట్ ఉంది. అప్పు ఇచ్చేవాడు ఉండాలేకానీ పాపం! మనదేశం తీసుకోక పోవడం అంటూ ఉండదు. పాకిస్తాన్‌లాంటి దేశాలు విదేశాల

నుండి ఋణసహాయం పొందుతూవుంటే మన దేశం ఋణసహాయం కోసం విదేశాలవెంబడి పడుతూఉంటుంది. ఏదో నిత్యం ఋణం కోసం వేటాడుతూ వున్నామంటే ప్రస్తుతం సి భారతీయతను విలబెట్టుకోవటంలో నిమగ్నమయి ఉన్నామన్నమాట! ఇంత తన్నా దేశభక్తికి నిదర్శనం ఏముంటుంది చెప్పు".

ఆ యువకుడు సిగ్గుతో తలవంచుకున్నాదేకాని కృష్ణ స్వామి మాటలకు నవ్వుకుంటూ కూర్చున్నాడు.

కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు — "అసలు ఆ మాటకువస్తే ఈ సృష్టే అప్పునుండి పుట్టింది. Self employment scheme క్రిందనానారొష్టువడి నడుపుతున్నవారంతా బ్యాంకువారి ఋణదానాలతో చేస్తై, చేకాక వ్యాపారాలు నడుపుతున్నారుచూడూ అలాగే బ్రహ్మదేవుడుకూడా ఈ సృష్టి వ్యాపారాన్ని అప్పుతోనే చేసేస్తున్నాడు".

నవ్వుతున్న ఆ యువకుడు ఆశ్చర్యంగా చూశాడు. చూస్తున్న అతనితో కృష్ణస్వామి నవ్వుతూ ఇలా అన్నారు—

"కంగారుపడకు, అవి వేరే అప్పులులే. సంస్కృతంలో అప్పులు అంటే జలాలు. అంటే నీరు మరి నీళ్ళనుండేగా ఈ భూమి పుట్టింది - భూమిమీద ఇంతకథ పుట్టింది! అందుకనే అలా చెప్పాను. మనఅప్పులే కాదూ, పక్కింటివాళ్ళ అప్పులు కూడా తప్పేదు అంటే మానవుడికి ఒకవిధమైన తృప్తి కలుగు

తుంది చూడు. అలాగే మనకే కాదుట మన దేశానికి. అసలు ఈ సృష్టికర్తకే అప్పులబాధ తప్పలేదుట అంటే అదో విధమైన ఆనందం. ఏమంటావ్ ?"

ఆ యువకుడు నవ్వుతున్న నవ్వులో ఒకవిధమైన బాధ గోచరిస్తూ ఉన్నది.

కాస్సాగి కృష్ణస్వామి ఇలా అన్నారు : అప్పు నిజంగా చేయవలసిచేస్తే నిజానికి అంత తప్పుకాదు. కానీ అప్పుచేస్తున్న వాళ్ళలో చెయ్యాలి అనిపించి చేస్తున్నవారే ఎక్కువమంది. కొంతమంది అప్పుచేయకుండా ఉండలేరు. అదికూడా ఒక జబ్బు లక్షణమేనని హోమియో వైద్యం అంటుంది. అనడం ఏమిటి, నమ్మి ఆ వైద్యాన్ని శరణుజొచ్చినవారిని ఆ లక్షణంనుండి బయటపడేస్తుందికూడా. చూస్తూఉంటే మన ప్రభుత్వానికికూడా అలాంటిమందు ఏమైనా వేస్తే బాగుండుననిపిస్తోంది. ఎందుకంటే అప్పులు చేయటంమీద ఉన్న శ్రద్ధ, దేశంలోని ప్రకృతి వనరులనూ, మానవశక్తినీ సద్వినియోగం చేయడంమీద మన ప్రభుత్వము చూపలేకపోతోందికదా! ఏమంటావ్ ?

దేశప్రభుత్వానికి ఉన్న లక్షణమే దేశంలో ఉన్న మనలోనూ కనబడుతున్నది. ప్రభుత్వమంటే ఎవరు ? మనలోని వారైన మన ప్రతినిధులేగా! మన అన్నలన్నమాట అందుకే వారు అప్పులుచేయడంలోకూడా అన్నలుగానే ఉన్నారు".

కొంచెం ఆగి కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు : ఇంతకూ తేలింది ఏమిటంటే మన వనరులనీ, మన శక్తి

యుక్తుల్ని మనం సద్వినియోగం చేయలేకపోతున్నామని సద్విని యోగం చేయడానికి కావలసిన శ్రద్ధ, క్రమశిక్షణ మనలో లోపించాయని. నిజానికి ఆ శ్రద్ధా, ఆ క్రమశిక్షణా ఉంటే ఒకసారో రెండుసార్లో పరిస్థితుల్నిబట్టి అప్పు అవసరమవుతుందేమో తప్ప అదేపనిగా అవసరం రాదు. అదేపనిగా అవసరమవుతోంది అంటే అక్కడ అవసరం అప్పుకాదనీ, సరియైన హోమియో మందని మనం అర్థం చేసుకోవాలి.

ఆ యువకుడు పశ్చాత్తాపాన్ని వ్యక్తంచేస్తూ "మీరు నవ్విస్తూచెప్పినా సూటిగా ఉన్న నిజంచెప్పారు. ఇదంతా చూస్తూ ఉంటే నాకు నిజమైన అవసరం హోమియో మందనే అనిపిస్తోంది. అదేదో వేసి పుణ్యం కట్టుకోండి!" అంటూ నమస్కరించాడు.

"దానికేముంది! మన చేతిలోపనేగా తప్పకుండా వేద్దాం. నువ్వుమాత్రం పథ్యం తప్పకుండా చేయి" అన్నాడు కృష్ణస్వామి.

"తప్పకుండా చేస్తాను" అన్నాడా యువకుడు

"చేయవలసిన పథ్యంలో మొదటిది ఏమిటో తెలుసా? నా అనుమతిలేకుండా నీవు ఎక్కడా అప్పు పుట్టించకూడదు. ఏమంటావ్?" అన్నారు కృష్ణస్వామి ఆటపట్టిస్తున్నట్టుగా.

అలాగే అంటూ తలవంచుకొన్నాడు సిగ్గుపడుతూ ఆ యువకుడు.

# పూల మొక్క

1983 చివరిలో రాజమండ్రిలో "మహాభారతం" పై కృష్ణస్వామి ప్రవచనాలు జరిగాయి. అప్పటికి మాష్టర్ E. K. గారు శరీరంతోనే ఉన్నారు. చివరిరోజున జనమంతా కృష్ణ స్వామిగారికి నమస్కరించి సెలవు తీసుకుంటున్నారు.

ఒకరన్నారు - "ఈ ఐదురోజులూ మీరు మాకు మాష్టరు గారిని చూపించారు ఇంకా చెప్పాలంటే మాష్టరుగారిని పరిపించారు. మాష్టరుగారు చెప్పినప్పుడుకూడా మాకింతగా బోధపడ లేదేమో। మీరింకా దిగివచ్చి మాష్టరుగారి సందేశాన్ని మా కర్థమయ్యేట్టుగా అందించి అనుభూతిలో ముంచితేల్చారు. చూడగా మీరు గురువునుమించిన శిష్యునిగా గోచరిస్తున్నారు".

కృష్ణస్వామి చిరునవ్వుతో ఇలా అన్నారు : "పూల మొక్కను చూశారా। మొక్కకన్నా పువ్వు చాలా బాగుంటుంది. కాని ఆ మొక్క లేకపోతే ఈ పువ్వులేదు. ఏమంటారు ? ఈ పువ్వును పూయడానికే ఆ మొక్క నిలచిఉన్నది. ఆ మొక్క యొక్క వైభవాన్ని వ్యక్తంచేయడానికే ఈ పువ్వు వికసించి పరిమళాన్ని వెదజల్లుతోంది".

"ఇది ఇంకా బాగుంది. మీరిచ్చిన ఈ సమన్వయం అద్భుతం" అంటూ పాదాలపై వ్రాలాడా సోదరుడు.

అతన్ని లేవదీస్తూ కృష్ణస్వామి "గురువుకన్నా శిష్యుడు వేరుకాదు. మొక్కకన్నా పువ్వు వేరవుతుందా ? అదీ మొక్క

లోనిభాగమే. మొక్క తనగుర్తుగా పువ్వును మనకందిస్తోంది. గురువు తనకు గుర్తుగా శిష్యులను లోకానికి అందిస్తాడు.

అక్కడున్న అందరూ ఆ సమన్వయాన్ని వింటూ పరవశించారు.

## పెద్దల కోరిక

"ఈ పదిహేను రోజుల్లోనూ ఏం చేసుకొచ్చావ్?" అని అడిగారు కృష్ణస్వామి దూరప్రాంతంనుండి వచ్చిన ఒక యువకుడిని.

"నేనైతే పెద్దగా సాగలేదుగానీ మన పుస్తకాలు మాత్రం బాగా చదవగలిగాను. చదువుతుంటే ఒళ్ళు తెలియలేదు".

"అయితే పనిమానేసి చదివావన్నమాట! ఆ పుస్తకాలలో పనిచేయమని ఉందా? మానమని ఉందా?" ప్రశ్నించారు కృష్ణస్వామి.

"చేయమనే ఉందండీ," అన్నాడతను తన తలను దించుకొంటూ.

"పని చేయమనేకాదు, పని ఎలా చేయాలో కూడా ఉంది. అవునా?" అడిగారు కృష్ణస్వామి.

"అవునండీ!" అన్నాడతను.

“మరి ఆ పుస్తకాలను చదవడంలో పడి పనిని విడిచి పెట్టడంతో అర్థంఏమిటి? ఇలా చేయడంవల్ల నీతోపాటు ఆ పుస్తకాలకుకూడా చెడ్డపేరు వస్తుందికదా! మీరిలా చేస్తున్నప్పుడు ఇలాంటి పుస్తకాలు చదివి కుర్రవాళ్ళు చెడిపోతున్నారని మీ పెద్దవాళ్ళు కష్టపడటంలో తప్పేముంది?

కొందరు చెత్త పుస్తకాలు, డిటెక్టివ్‌లు, కాలక్షేపానికి మాత్రమే పనికివచ్చే నవలలూ, వార, మాసపత్రికలు చదువు తుంటూ అలా ఉండిపోతున్నారు. ఇంకొందరు నీలాగా పెద్దల గ్రంథాలను చదువుకొంటూ కాలాన్ని మరచిపోతున్నారు. ఈ రెండురకాలవాళ్ళు చేస్తున్నదేమిటి? పనిని ఎగగొట్టటమేకదా! పనిని ఎగ్గొడుతున్నప్పుడు ఇక వాడు ఏ పుస్తకాన్ని చదువుకొంటేమాత్రం ఏమిటి? ఏ రాయైతేనేం పళ్ళూడగొట్టుకోవడానికి”

“తప్పైపోయిందండీ! ఎందుకనో వాటిని వదిలిపెట్టలేక అలా ఉండిపోయాను” అన్నాడా యువకుడు బాధగా.

“నిజమే నీవన్నది. అలాంటి గ్రంథాలు చదువుతున్నప్పుడు విడిచిపెట్టలేం. మరి అలాగని కర్తవ్యాన్నికూడా విడిచిపెట్టకూడదుకదా! విడిచిపెడితే ఇకవాటిని చదివినందుకు సార్థకత ఏమున్నది? పనిచేయడంలో కావల్సిన నేర్పరితనం అందించడానికేగదా ఆ గ్రంథాలున్నది. సైన్సు స్టూడెంటు ఏం చేస్తున్నాడు — కొంతసేపు చదువుకొంటున్నాడు మరికొంత

వేపు ఆ చదువుకొన్నది చేసి చూపిస్తున్నాడు (థిరీ అండ్ ప్రాక్టికల్.) మనమూ అదే చేయాలి పెద్దల గ్రంథాలనుండి చదువుతూ ఉండాలి, ఆ చదివిన ప్రకారం చేస్తూ ఉండాలి రోజు మొత్తాన్ని చదవడానికీ, చేయడానికీ తగినపాళ్ళలో విభజించుకోవాలి. చదవడమూ మానకూడదు. చేయడమూ మానకూడదు. ఏమంటావ్ ?”

బోధపడుతోంది అన్నట్లుగా చూశాడతను. అతనివైపు అనునయంగా చూస్తూ కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు: రోజూ ఉదయం లేచినతరువాత దినచర్యలోకి దిగబోయేముందు ఈ గ్రంథాలను చదువుకొంటే బాగుంటుంది. అప్పుడు దినచర్య సక్రమంగా నిర్వహించుకోవడానికి కావలసిన సందేశమూ ప్రోత్సాహమూ లభిస్తాయి అలాగే రోజూ రాత్రిపూట పడుకోబోయేముందు ఈ గ్రంథాలను చదువుకోవడం మంచిది. అప్పుడు ఈ గ్రంథాల వెలుగులో మనం జరిపిన దినచర్యను సమీక్షించుకోవడానికీ, కావలసిన సర్దుబాటులను గ్రహించడానికీ వీలు కలుగుతుంది. ఇంకా ట్రైన్‌లో ప్రయాణం చేస్తున్నప్పుడూ ఏదో చేయడంకన్నా ఈ గ్రంథాలు చదువుకోవడం మంచిది. అప్పుడు ట్రైన్ ప్రయాణంతోపాటుగా మన జీవిత ప్రయాణానికి కావలసిన ట్రైనింగ్ కూడా పొందినవాళ్ళమవుతాం.

అలాగే ఒక్కొక్కప్పుడు ఎవరికోసమో వేచి ఉండవలసి వస్తుంది. అక్కడ ఉండక తప్పదు. ఆవ్యక్తి వచ్చేలోగా

చేసేది కనపడదు అప్పుడే చేయాలి? మనకు నచ్చిన పుస్తకాన్ని చదువుకొంటూ కూర్చోవాలి. అప్పుడు వేచిచూడడంవల్ల కలిగే టెన్షన్ కలగకపోగా, ఆ వచ్చిన వ్యక్తితో మాట్లాడటానికి కావలసిన ప్రశాంతత మనస్సుకు లభిస్తుంది. లేకపోతే వెయిటింగ్ తరువాత ఫైటింగ్ ప్రారంభమయ్యే ప్రమాదం ఉన్నది కొందరికి చూసిచూసి కళ్ళు కాయలుకాస్తాయి ఇంకొందరికి ఒళ్ళు మండిపోతుంది కళ్ళు కాయలుకాస్తే కొంతవరకూ ఫరవాలేదు కానీ ఒళ్ళుమండిపోతే ప్రమాదంకదా మరి. అందుకని ఆ సమయాన్ని పెద్దల గ్రంథాలను చదువుకోవడానికి వినియోగించడం అన్నివిధాల శ్రేయస్కరం. ఏమంటావ్ ?"

బాగున్నది, బోధపడింది అన్నట్లుగా చూశాడతను.

లోతులను తడిమిచూసే చూపులతో కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు : "ఇంతకూ పెద్దల గ్రంథాలు ఎప్పుడూ మనతో ఉండాలి. అవి మన జీవితానికి పెట్రోలు లాంటివి. ప్రయాణం సాగుతున్నకొద్దీ ఆ పెట్రోలు మరింతగా మన కవసరం అవుతూ ఉంటుంది. మంచిడ్రైవరు ఏంచేస్తున్నాడు — తన వాహనంలో పెట్రోలు ప్రయాణానికి తగినట్లుగా ఉండేటట్లు చూసుకుంటూ వాహనాన్ని నడిపిస్తున్నాడు. అలాగే మనంకూడా పెద్దల గ్రంథాలనుండి తగిన స్ఫూర్తిని పొందుతూ జీవిత ప్రయాణాన్ని సాగించాలి.

పెద్దల గ్రంథాలు దిక్సూచి లాంటివి నావికుడు ఏం చేస్తున్నాడు: దిక్సూచిసాయంతో దిక్కులను గమనించుకొంటూ

కావల్సినపద్ధతిలో భద్రంగా ప్రయాణం చేస్తున్నాడు. అలాగే మనంకూడా పెద్దల గ్రంథాలు మనకు ధర్మపథాన్ని చూపిస్తూ ఉండగా జీవితప్రయాణాన్ని సక్రమంగా సాగిస్తూ ఉండాలి. ఇంతకూ ఏం చెప్పుకొన్నాం? పెద్దల గ్రంథాలను పెట్రోలుతోను, దిక్సూచితోనూ పోల్చుకోవడం జరిగింది అంటే ఆ పెద్దల గ్రంథాలు రెండువిధాలైన సామర్థ్యాన్ని కలిగి ఉంటాయన్నమాట. పెట్రోలులాగా ఉత్సాహంఅనే శక్తినిచ్చి మనను నడిపించగలవు. దిక్సూచిలాగా ధర్మమార్గాన్ని ఎప్పటికప్పుడు చూపించగలవు. తమ గ్రంథాలనుండి ఈ రెండువిధాలైన ప్రయోజనాలను పొందుతూ మన జీవితాలను సార్థకంగా నడుపుకోవాలని మన పెద్దలైన ఆ గ్రంథకర్తల కోరిక.

ఆ యువకుడు చక్కని స్ఫూర్తిని పొందినట్లు కనిపించాడు. మీరు చెప్పినట్లుగా తప్పక నడుచుకుంటాను అన్నట్లు మాష్టరుగారివైపు చూశాడు.

మాష్టరుగారతనివైపు తృప్తిగా చూశారు. చెప్పినది గ్రహించగలిగాడు, గ్రహించినట్లు నడుచుకోగలుగుతాడు అన్న తృప్తి ఆ చూపులనుండి వ్యక్తమవుతూ ఆ యువకుణ్ణి ఆశీఃపూర్వకంగా స్పృశిస్తున్నది. ఆ స్పర్శలో ఒదిగిపోతున్నట్లుగా, ఆ స్పర్శలో ఎదిగిపోతున్నట్లుగా గోచరించాడు ఆ యువకుడు.

## ముడి విప్పారు

ఒకరోజున ఒక ప్రముఖమైన వ్యక్తినికలిసి మాట్లాడి మరో కార్యక్రమానికి తరలివెడుతున్నారు కృష్ణస్వామి. ఆ ప్రముఖవ్యక్తితో జరిగిన సంభాషణలగురించి ప్రక్కనున్న సన్నిహితులతో ముచ్చటిస్తున్నారాయన.

సన్నిహితులలో ఒకరన్నారు "మాస్టరుగారూ! మీకు వారంటే ఎంతో ప్రేమా, వాత్సల్యం. తరచూ మీరు కలుస్తుంటారు. అనేక అంశాలు ముచ్చటించుకుంటారు. మీ ఇద్దరి భావాలు కలిసిపోతాయి ఇద్దరిలక్ష్యం ఒకటిగానే కన్పిస్తున్నది. మరి అలాంటప్పుడు ఆయన మీతోపాటుగా రంగస్థలంమీద అంతగా కనిపించరేం? నేపథ్యంలో ఉండిపోతున్నారేం?"

సమాధానంకోసం ఎదురుచూస్తున్న ఆ జిజ్ఞాసువుతో ఇలాఅన్నారు కృష్ణస్వామి; "మంచిప్రశ్నే వేశావ్! ఇక్కడొక సూక్ష్మముంది విను! నాటకం జరుగుతూ ఉంటుంది. ఏ సీన్‌లో ప్రవేశించవలసిన పాత్ర ఆ సీన్‌లో ప్రవేశిస్తూండగా నాటకం సాగిపోతుంది. ఒక్కొక్కపాత్ర బరువైనదీ, ఉన్నతమైనదీ అయినప్పటికీ కథాగతినిబట్టి నాటకం మూడువంతులు గడచినతరువాత ప్రవేశించవచ్చు. ఆ మిగిలిన కాసేపటిలోనూ ఆ పాత్రవల్ల కథ ఎంతగానో రక్తికట్టవచ్చు. ఈలోపున ఆ పాత్రధారి ఏంచేస్తుంటాడు? బుద్ధిమంతుడైతే సైడుకర్టెన్ దగ్గర కూర్చొని నాటకాన్ని గమనిస్తూ మధ్యమధ్యలో నటులు లోప

లికి వచ్చినప్పుడు తగిన సూచనలిస్తూ ఉంటాడు అవునా? ఇప్పుడు మనం వెళ్ళివస్తున్నదీ అలాంటి సన్నివేశమే. ఆయన పాత్ర వచ్చినప్పుడు ఆయన రంగంమీదకు వస్తారు. ఈలోపున మనతో ముచ్చటిస్తూ, కథాగతిని సమీక్షిస్తూ తగిన సూచనలిస్తూ ప్రోత్సాహపరుస్తూ ఉంటారు. ఏమంటావ్! ఈ సూత్రం తెలియకపోతే, ఏమిటీ ఇంత పెద్దాయన, ఈయన తలుచుకుంటే ఏమైనా చేయగలడు, ఎందుకు రంగంమీదకు తొందరగా రాడు అని అనిపించి మనస్సు ఒకవిధమైన టెన్షన్ అనుభవిస్తూ ఉంటుంది. ఏమంటావ్?"

నిజమేనన్నట్లు తలూపాడు ఆ సన్నిహితుడు. "ఎన్నాళ్ళ నుండో నా మనస్సును ఈ సందేహం ఇబ్బంది పెడుతోంది. ఇవ్వాళ మీరు ఆ ముడిని చిత్రంగా విప్పారు" అంటూ తృప్తిగా చూశాడతను.

కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు: "ఏపాత్ర ఎప్పుడు రంగప్రవేశం చేస్తుంది? ఎంతకాలం ఆ రంగంమీద ఉంటుంది అనేది ఆ కథాగతినిబట్టి ఉంటుందితప్ప ఆ పాత్రయొక్క ఔన్నత్యంమీదగాని పాత్రధారియొక్క సామర్థ్యంమీదగాని ఆధారపడి ఉండదు. ఏమంటావ్? రామాయణంలో ఆంజనేయుడు ఎప్పుడు ప్రవేశిస్తాడు? మనకు బాగుంటుందికదా అని మరికొం చెంముందు ప్రవేశిస్తాడా? అలాగే, బాలకాండ నిండా నిండిన విశ్వామిత్రుడు అతర్వాత మళ్ళీ మనకు కనబడడే - ఆ "శబరీ" వాళ్ళు ఇంకాసేపు కనబడితే బాగుంటుందని మన

కనిపించదూ! అలాంటిదే మనకథకూడా. మనకథ అంటే మనమీదుగా నడుస్తున్న సృష్టికథ అని అర్థం".

ఆయువకుడు మరింతతృప్తిగా చూస్తూండిపోయాడు.

## నిజమంతే!

ఒకరోజురాత్రి కృష్ణస్వామి సన్నిహితులతో మాట్లాడుతున్నారు. ఒకతను బాధగా అడిగాడు – "ఇతనికూ ఆయన మిమ్మల్ని ఎందుకు ద్వేషిస్తున్నాడో బోధపడటంలేదు" అన్నాడు.

కృష్ణస్వామి నవ్వి ఇలా అన్నారు: "అది ఆయనకే బోధపడని విషయం – నీకెలా బోధపడుతుంది? ఒక చిన్న సన్నివేశం చెబుతాను విను! ఒకప్పుడు ఒక తండ్రి ఇద్దరు బిడ్డలు ఉండేవారు. ఆ బిడ్డలకు నేనంటే వల్లమాలిన ప్రేమ. ఆ తండ్రికి నేనంటే అంతులేని ద్వేషం. అది మరో హిరణ్య కశిపుడు ఇల్లులాగా తయారయింది. ఒకరోజున ఆ బిడ్డలా తండ్రిని కూర్చోపెట్టి అడిగారు – "మాస్టరుగారిని నువ్వెందుకు ద్వేషిస్తున్నావని. ద్వేషించవలసిన అవసరం ఏమిటి? ద్వేషించడానికి కారణం ఏమిటి?" అని ఆ తండ్రిని నిలదీశారు. ఆ తండ్రి ఎదురుప్రశ్న వేశాడు– "ఆయన్ని మీరెందుకు ప్రేమిస్తున్నారు? ప్రేమించవలసిన అవసరం ఏమిటి? కారణం ఏమిటి?" అని. ఆ బిడ్డలు ఏదో చెప్పబోయారు. కాని చెప్పలేకపోయారు.

ఆ తండ్రి అన్నాడు - "ఇక మీరేం చెప్పకండి. ఎందుకంటే చెప్పలేరు కనుక. మీరెలా ప్రేమిస్తున్నారో నేనూ అలాగే ద్వేషిస్తున్నాను. మీకెలా ప్రేమించబుద్ధవుతుందో నాకూ అలాగే ద్వేషించబుద్ధవుతోంది" అని లేచి వెళ్ళిపోయాడు.

చూశావా! అతను చెప్పినదాంట్లో ఎంత సత్యముందో, నిజమంతే! ప్రేమించబుద్ధయినపుడు దానికి కారణాలుగా అవతలవ్యక్తి చేసిన మంచిపనులనూ, అవతలవ్యక్తికి ఉన్న మంచిలక్షణాలనూ ఏకరువుపెడతాం. ద్వేషించబుద్ధయినపుడు అవతలివ్యక్తి చేసిన చెడ్డపనులనూ, అతనిలో కనబడుతున్న చెడ్డలక్షణాలనూ వల్లెవేస్తాం. నిజానికి ప్రేమించడానికి కారణం లేదు ద్వేషించడానికీ కారణంలేదు ప్రేమించడానికీ, ద్వేషించడానికీ కారణాలు ఈ చెప్పిందేవీకావు. అవి పైన ఎక్కడో ఉంటాయి. ఆ జీవి పరిణామానికి అప్పటికవి అవసరమై ఉంటాయి.

ఆ వింటున్న వ్యక్తి కృష్ణస్వామిగారి కళ్ళలోకిచూస్తూ అలా ఉండిపోయాడు కాసేపు. ●

## నా టైము నాకివ్వండి

కృష్ణస్వామి రచనావ్యాసంగంలో ఉండగా ఒకాయన తన భార్య మందుకని వచ్చారు. నిజానికి ఉదయం డిస్పెన్సరీ టైంలో

వచ్చి మందు తీసుకోవచ్చు. అంతగా ప్రమాదమైన అంశమేదీ లేదుకాబట్టి కాని చనువుచొప్పున వచ్చేశారు. కృష్ణస్వామి కొంచెం బాధపడ్డారు.

“దానికి ఒక టైమ్ ఉన్నదికదా! దాన్ని మీరెందుకు సద్వినియోగం చేసుకోరు? ఆ టైమ్‌లో నేను ఆపనిమీదే ఉంటాముకదా!” అన్నారు.

తనకు షిఫ్టుడ్యూటీలు ఉన్నాయని, అందువల్ల ఆ టైముకు అలా రాలేకపోతున్నానని ఆయన చెప్పారు.

అలాంటప్పుడు ఫోన్‌చేసి ముందుగా టైం ఫిక్స్ చేసుకొనివస్తే బాగుండేదికదా! నా మనస్సుకూడా మీ పనికొరకు సిద్ధంగా ఉండేదికదా! మీరలా ఎందుకుచేయలేదు? మన మేర్పరుచుకున్న నియమాలను మనమే పాటించకపోతే ఎలాగా?

మనం భారతీయులం. ఇంకా బానిసలుగానే ఉన్నాం. మనకు మనం ఒక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసుకొని దానికి తగ్గట్టుగా మనని మనమే నియమించుకోగలిగిన క్రమశిక్షణ మనకింకా అలవడలేదు. మరొకళ్ళచేత అదిలించుకొనిగాని, మొట్టికాయలు తినిగాని పనిచేసేస్థితిలో మాత్రమే ఇంకా పడి ఉన్నాడు భారతీయుడు” అన్నారు కృష్ణస్వామి.

ఆయన జరిగినదానికి సిగ్గుపడుతూ ఈసారికి తప్పు జరిగిపోయింది అన్నట్లు చూశారు.

కొంచెం ఆగి కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు : "నేను పెట్టుకున్న ప్రాజెక్టు సంగతి మీకు తెలుసు. నా ఆయుర్దాయాన్ని మించిన ప్రాజెక్టు ఇది. కనీసం పునాదులైనా గట్టిగా వేసి, నా తరువాత వారికి అందించవలసిన బాధ్యత నాపైన ఉన్నది. ఏమంటారు ?"

అవునన్నట్లు తలూపాడాయన.

కృష్ణస్వామి మళ్ళీ ఇలా అన్నారు– "మీరు ఇద్దరూ లేక ముగ్గురూ ఉన్న సంసారంకొరకే ఇన్నిరకాలుగా తాపత్రయపడుతున్నారు. మరి నన్నుచూసి ఇంతమంది యువకులు కార్యరంగంలోకి దిగుతున్నారు. వీళ్ళందరినీ తీర్చిదిద్దవలసిన బాధ్యత నాపైన ఉన్నదికదా ! అందుకు నా టైమ్ నాకివ్వండని మిమ్మల్ని కోరుతున్నాను.

నన్ను మీరు తప్పకుండా ఉపయోగించుకోండి. మీరు ఉపయోగపడటంలోనే నాకు ఆనందం ఉన్నది. కాని మిగిలిన కార్యక్రమానికి మాత్రం అడ్డుపడకండి. ఈ యువకుల్ని తయారుచేస్తున్నది ఎవరికోసం ? మీలాంటివారిని అనేకప్రాంతాల్లో కావలసినవిధంగా సేవించడానికేగా వీళ్ళను నేను తయారుచేస్తున్నది ! వంటచేస్తూన్న తల్లికి పిల్లలు అడ్డుపడితే ఏమవుతుంది? వాళ్ళకే భోజనం లేటవుతుంది. ఏమంటారు ?"

ఆయన బోధపరచుకున్నట్లుగా చూశారు. కాస్సేపు నిశ్శబ్దం రాజ్యమేలిందక్కడ. ఇంతలో అంతకుముందే కృష్ణస్వామి వ్రాసిఇచ్చిన మందు కట్టి తీసుకువచ్చాడు ఒక యువకుడు.

మందుపొట్లాం చేతికందిస్తూ కృష్ణస్వామి "మీరు ధర్మల్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు కదూ !" అన్నారు

"అవునండీ ! ధర్మల్ స్టేషన్‌లోనే !" అన్నారతను.

"మీది ధర్మల్ స్టేషన్ అయితే, మాది ధర్మాల స్టేషన్. ఇక్కడ నిర్దేశించిన ధర్మాన్ని పాటిస్తూ మీరూ మాలో ఒకరు కండి !" అంటూ వెన్ను తట్టిపంపారు కృష్ణస్వామి.

"తప్పకుండా !" అంటూ వెళ్ళిపోతున్నారాయన ●

## నేల విడిచి సాము చేయకు

ఉదయం 6 గంటల వేళ. అందరం ప్రేయరుకు సిద్ధమయ్యే ప్రయత్నంలో ఉన్నాం. మాలోని ఒక యువకుణ్ణి తనచెంతకు పిలిచారు కృష్ణస్వామి.

కృష్ణ :- ఇంటికి ఎప్పటికి చేరుకొంటానని చెప్పావ్ !

యువ :- ఇరవయి రెండో తేదీకి.

కృష్ణ :- ఈరోజు తేదీ ఎంత ?

యువ :- ఇరవై అరండీ !

కృష్ణ :- ఇంటిదగ్గర అమ్మా నాన్నా నీకోసం చూస్తూ ఉంటరా ?

యువ :- వెళ్ళిపోదామనే అనుకున్నాను.

కృష్ణ :- మరి ?

యువ :- ఇక్కడజరుగుతున్న రచనావ్యాసంగం బాగుంది మానవ పనికివచ్చే అంశాలు వస్తున్నాయిగదాఅని ఉండి పోయాను.

కృష్ణ :- ఉండదలుచుకొన్నవాడివి ఇక్కడ ఇలా ఉండి పోతున్నట్లు 21వ తేదికి అందేటట్లుగా మీ నాన్నకుఒక ఉత్తరం వ్రాయచ్చుగా ?

యువ :- ఎప్పటికప్పుడే వెళదామని అనుకుంటూనే....

కృష్ణ :- వెళ్ళడం పడలేదంటావ్. ఉత్తరం వ్రాసిన తర్వాత ఏరోజు వెళ్ళినా ప్రమాదంలేదుకదా ?

యువ :- నిజమేనండీ. కానీ ఏమిటో తట్టలేదు.

కృష్ణ :- ఆమాత్రం తట్టలేదా ? మరి దేశంకోసం, జాతికోసం ఏదేదో చేస్తానంటావ్ ! మరి ఈ దేశంలో, ఈ జాతిలో మీ అమ్మానాన్నా లేరా ? వాళ్ళకు ఒక ఉత్తరంముక్క వ్రాసి వాళ్ళ మనస్సులకు టెన్షన్ లేకుండాచేయడం నీ దేశ సేవలో భాగంకాదా ?

యువ :- తప్పేనండీ ! గమనించుకోలేకపోయాను.

కృష్ణ :- ఇదిగో చూడవోయ్ ! పాలపైన పొంగంతా పాలూకాదు. ఆవేశమంతా ఆచరణలోకి రాదు. పైకెక్కడికో ఎగురుదామనుకొంటున్నావ్ ! ముందు క్రింద చూసుకో ! నేం

పీద కాళ్ళానదం చూచుకొని పైకెగరదానికి యత్నించు. లేకపోతే నీకథ నేలవిడిచిన సాము అవుతుంది.

ఆ యువకుడు ఆలోచనలో పడ్డాడు. ఆదర్శాలను వల్లించుకోవడంలోపడి ఆచరణకు దూరమయ్యానే అని మథనపడసాగాడు.

“లే! లేచి బయల్దేరు! ఇంకా లేటుచేయకు. తెలియక చేసిన తప్పునుగురించి ఆలోచించుకుంటూ ఇక తెలిసి తప్పు చేయకు! వాళ్ళు నువ్వెంతో మీ అమ్మా, నాన్నాకూడా అంతే! ఎవరికివారు తమకు తగినట్లుగా ప్రవర్తించాలన్నదే నాకోరిక” అంటూ అతని వెన్నుతట్టారు కృష్ణస్వామి.

ఆ యువకుడు కొంచెంకొంచెంగా కోలుకొంటున్నాడు.

కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు: మనం ఇలా ప్రవర్తిస్తే ఆ పెద్దలకు మనమంటే ఒకవిధమైన అయిష్టత. అవమానం కలగవా! ఇప్పుడే ఇలాచేస్తే ఇకముందేం చేస్తాడోనని వాళ్ళు భయాందోళనలకు గురికారూ? వాళ్ళు కలిసిరావడం లేదని వాళ్ళని నిందించి ఏంలాభం! వాళ్ళను మనం తెలుసుకొని ప్రవర్తిస్తే వాళ్ళు మనతో తప్పక కలిసివస్తారు. వెళ్ళు! వెళ్ళి తప్పు ఒప్పుకో! ఇంకెప్పుడూ ఇలాచేయను అని చెప్పు”.

ఆ యువకుడు సరేనని తలఊపుతూ వినమ్రుడై సెలవు తీసుకొన్నాడు.

# ఇప్పుడర్థమవుతోంది

రాత్రి తొమ్మిదిగంట లవుతోంది భోజనంచేసి పడక కుర్చీలో విశ్రాంతిగా కూర్చున్నారు కృష్ణస్వామి. ఇదే సమయమని సోదరబృందంలోని ఒకామె మాట్లాడటానికి ఆయనను సమీపించింది.

కూర్చోమని సైగచేశారు కృష్ణస్వామి. ఆమె కూర్చున్నది. ఆమెచేతిలో "భారతం – ధర్మాద్వైతం" ఉన్నది.

"ఏమిటీ విశేషాలు ? అన్నీ బాగున్నాయి కదా !" అనడిగారు కృష్ణస్వామి.

"బాగున్నాయండీ ! మీరుండగా మాకేమిటి భయం" అన్నదామె ఆమె కన్నులు భారతం – ధర్మాద్వైతంవైపు చూస్తున్నాయి

దాన్ని గమనించి కృష్ణస్వామి "ఏం చదివావా ? ఎలా ఉంది పుస్తకం ?" అన్నారాయన

"చాలా బాగుందండీ ఇందులో నన్ను మరీమరీ ఆకర్షించింది దాంపత్యధర్మం. బాగా చదివినమీదట నా కనిపించింది కదా - అంతబాగా బ్రతికిన మనజాతి ఇలా అయిపోయిందేమిటా అని. భారతంలోని దంపతులస్థాయికి, నేటి మన దంపతుల స్థాయికి ఊహించలేనంత అంతరం గోచరిస్తోంది ఎక్కడో తప్పు మీరు వ్రాసినట్లుగా బ్రతకడానికి ప్రయత్నిస్తున్న దంపతులు

కనబడటంలేదు. ఎందుకిలా జరిగిందంటారు ?" అన్నారామె. ఆమెగొంతులో ఆవేదన నిండివుంది.

కృష్ణస్వామి ప్రేమతో అనునయంగా చూస్తూ ఇలా అన్నారు : వందల సంవత్సరాల బానిసత్వం ఫలమమ్మా ఇది. భౌతికంగా బానిసత్వంనుండి మనం బయటపడినా, మానసికంగా మనమింకా బానిసలుగానే బ్రతుకుతున్నాం. రాహువు చంద్రుణ్ణి పట్టినట్టు ఈ బానిసత్వం భారతీయుని మనస్తత్వాన్ని కమ్మేసింది. భారతీయుని జీవితానికి గ్రహణం పట్టింది. ఈ గ్రహణ ఫలితంగా ఒకడిపైన పెత్తనం చేయడమో, ఒకనికి లొంగి ఉండడమో తప్ప, భారతీయుడు తోటి భారతీయుడితో కలిసి ఉండలేకపోతున్నారు. ఈ లక్షణం భారతీయుడి అన్ని రంగాల లోనూ గోచరిస్తూ ఉంది. అలాగే దాంపత్యజీవితాన్నికూడా అది ఆవరించింది.

భార్యపై భర్త పెత్తనంచేయడమో, భర్తపై భార్య పెత్తనం చేయడమోతప్ప భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరుగా కలసివుండటం అనేది ఎక్కడోకాని కనబడటంలేదు. ఒకళ్ళపై ఒకళ్ళు పెత్తనం చేయడంలో మెజారిటీ మగవాళ్ళది. కనుక భారతీయుడు భార్యను పీడిస్తున్నట్లు మనకు కనబడుతున్నది. స్త్రీలుపీడించే కుటుంబాలు లేవని అర్థంకాదు. అవికొంచెం తక్కువగా ఉన్నాయని అర్థం.

దాంపత్యాన్నిగూర్చి మనవాళ్ళ సంభాషణలు కూడా చిత్రంగా ఉంటాయి.

"ఆ ఇంట్లో ఆవిడదేనట పెత్తనం!"

"పాపం! ఆవిడ బజారుకు వెళ్ళినా ఆయనతో చెప్పి వెళ్ళవలసినదేనట!"

"ఇంతకూ ... మీ ఇంట్లో ఎవరిమాట చెల్లుతుంది?" అన్న మొదలైన వాక్యాలు దేన్ని సూచిస్తున్నాయి? మన మానసిక దారిద్ర్యాన్ని. ఎవరిమాట ఎవరువింటే నష్టమేమిటి చెప్పు! ఈ దారిద్ర్యంనుంచి మనం బయటపడాలి. దానికి మరొక్కసారి మన పూర్వుల జీవితాలలోని దాంపత్యజీవన వైభవాన్ని స్మరించుకోవడం ఒక్కటే మార్గం. ఏమంటావ్?"

"నిజమేనండీ! ఈ పుస్తకాన్ని చదువుతున్నంతసేపు నాకదే అనిపించింది. ఇందులోని దాంపత్యధర్మాన్నిగూర్చి చదివిన దంపతులెవరూ ఒకరినొకరు అవమానించుకోరని" అన్నదామె.

"పిచ్చివాళ్ళం కాకపోతే దంపతులమయ్యింది అవమానించుకోవడానికా? అవమానించుకోవడానికే అయితే ఈ పెళ్ళి తతంగం ఎందుకూ? స్త్రీపురుషులు దంపతులుగా దగ్గరవుతుంది ఒకరినొకరు అభిమానించుకోవడంతో మొదలుపెట్టి ఆరాధించుకోవడమనే స్థాయికి పెరగడానికి. ఏమంటావ్?"

ఆమె ముకుళితహస్తాలతో తృప్తిగా చూస్తూ "మీ ఋణం ఈ జాతి తీర్చుకోలేదు. ఈ గ్రంథం తాను ప్రవేశించిన ప్రతి

ఇంటిని తీర్చిదిద్దుకుంటోంది. పుస్తకాలు చదివినవాళ్ళపై ప్రభావాన్ని చూపిస్తాయంటే ఏమిటో అనుకున్నా! ఇప్పుడర్థమవుతోంది" అన్నది అంటూ విచిత్రానుభూతితో ఆయన పాదాలను స్పృశించిందామె.

ప్రేమకురిసే కన్నులతో తృప్తిగా చూస్తూ ఆమెను ఆశీర్వదించి పంపారు మాస్టరుగారు.

## పట్టాలెక్కిస్తూనే ఉంటారు

ఒకరోజు ఉదయం ప్రార్థన పూర్తయింది. సోదరులందరూ వారివారి కార్యక్రమాలలో ప్రవేశించడం కోసం ఉద్యుక్తులవుతున్నారు. కుర్చీలో కూర్చున్న కృష్ణస్వామి అందులో ఒకరిని తనదగ్గరకు రావల్సిందిగా సైగచేశారు. అతను వచ్చి ప్రక్కన నిలుచున్నాడు.

"ప్రేయరు బాగుందా?" అడిగారు కృష్ణస్వామి.

"బాగుందండీ!" అన్నాడతను.

"స్నానంచేసివస్తే ఇంకా బాగుండేదేమో!" అన్నారు కృష్ణస్వామి.

అతడు నాలుక కరుచుకుంటూ "మొహం కడుక్కొని వచ్చానండీ!" అన్నాడు.

"మొహం కడుక్కోనివారుకూడా కొందరున్నారనీ, వాళ్ళకన్నా నేను కొంచెం నయమనీ చెబుతున్నావా" అని అడిగారాయన. ఆ ముఖంలో చిఱుకోపం కనిపించింది

ఆయువకుడు సిగ్గుతో తలదించుకొన్నాడు. కృష్ణస్వామి మళ్ళీ ఇలాఅన్నారు: "బాధపడటంకాదు, బోధపడటంకావాలి. ఇంకొక అరగంటముందులేస్తె సరిపోయేదికదా ఇప్పుడు మనం ఇంటిదగ్గరే ఉన్నాం నీళ్ళకు లోటులేదు. నిద్రలేవడం లేటుకాకుండా ఉంచేవాలు. ఏ రైల్లోనో ప్రయాణం చేస్తున్నప్పుడో అనుకోని పరిస్థితులలో బిగించబడినప్పుడో, అనువుకానిచోట ఉన్నప్పుడో, తీవ్ర అనారోగ్యాలకు గురైనపుడో ఒక్కొక్కపుడు స్నానంచేయడానికి వీలుపడకపోవచ్చు. వీలుపడలేదుకదా అని ప్రేయరును మానకండి. ఆవేళకు స్మరణజరగడం ప్రధానము అని C. V. V మాష్టరుగారు చెప్పారు. అది ఆయన ఆపద్ధర్మంగా చెప్పినమాట. మనం దానిని దినచర్యగా రూపొందించుకొని ఆయనకే అపద తెచ్చిపెడుతున్నాం. ఇది మంచి పద్ధతి అంటావా ?"

ఆ యువకుడు మరింత సిగ్గుపడుతూ తప్పు జరిగిపోయిందన్నట్లుగా చూస్తూ నిలబడ్డాడు.

"కూర్చో! ఫరవాలేదు" అని తనదగ్గర కూర్చోపెట్టుకొని కృష్ణస్వామి ఇంకా ఇలా చెప్పారు - "నిద్రలేచేటప్పటికి మన నోరు ఎలావుంటుందో తెలుసుగా! అందుకేగా నోరును

చక్కగా కడుక్కొంటున్నాం. అలాగే మిగిలిన శరీరభాగాల నుండికూడా దేహపరిస్థితినిబట్టి మలినపదార్థాలు బయటకు విడుదలై ఉంటాయి నిద్ర లేచీలేవగానే ముఖం కడుక్కోవాలి. కాలకృత్యాలు తీర్చుకొని స్నానంచేస్తే ప్రాణానికి హాయిగా, తాజాగా ఉంటుంది. అంతవరకూ నిద్రిస్తూనేఉన్న మనలోని అనేక ప్రజ్ఞలు స్నానంతో మేల్కొని చక్కగా చురుకుగా పనిచేయడం మొదలుపెడతాయి. అలాంటి దివ్యస్థితిలో ప్రార్థనకో కూర్చుంటే ఎంతబాగుంటుంది! ఇల్లు ఊడ్చుకోకుండా ప్రేయరుచేయడం ఎలాంటిదో, ఒళ్ళు కడుక్కోకుండా ప్రేయరు చేయడంకూడా అలాంటిదే! ఇంటి శుభ్రం, ఒంటి శుభ్రం ప్రేయరు బాగా జరగడానికి ఎంతగానో ఉపకరిస్తాయి.

అలాగే సాధ్యమైనంతవరకు సాయంత్రం ప్రేయరుకూడా స్నానంచేసి చేసుకోవడం మంచిది. రోజల్లా పనిచేయడంవల్ల దేహభాగాలు విడుదలచేసిన మలినాలు ఆ స్నానంతో శుభ్రమై పోతాయి. అంతేకాకుండా అంతవరకూ చేసిన పనివలన కలిగిన అలసట ఈ జలస్పర్శతో టక్కున ఎగిరిపోతుంది. ప్రొద్దుటి స్నానం అలవాటైనా వదిలిస్తే, సాయంత్రం స్నానం అలవాటును పోగొడుతుంది ఏమంటావ్ !"

ఆ యువకుడు కొంచెం తలపైకెత్తి "మీరు చెప్పింది నిజమే మాస్టారూ! నేను చేస్తున్నపని మంచిపనికాదని నాకూ తెలును. కాని, నాకు నేనుగా దారిన పడలేకపోతున్నాను. రాత్రి పడుకునేటప్పుడు అనుకున్నా. ప్రొద్దున్నే లేవలేకపోతు

న్నాను. ఇప్పుడు మీ మాటలు నా మత్తును వదలగొట్టాయి. ఇక ఈ మాటలు నన్ను వెన్నాడుతాయి. నన్ను దారిలో పెడతాయి. ఇవి రికార్డయి పుస్తకరూపంలో ఉంటే నాలాంటివాళ్ళను ఇంకెందరినో వెన్నాడి దారినపెడుతూనే ఉంటాయి" అంటూ నావైపు చూశాడతను. నేను అప్పటికే అతను వచ్చినవేళాన్ని వ్రాసుకొంటున్నాను.

మాష్టరుగారు చిరునవ్వుతో ఇలా అన్నారు: "C.V.V. గారు మనకు పెద్ద నియమాలేవీ పెట్టలేదుగదయ్యా! వ్రతాలు, దీక్షలు చేయమనలేదుకదా! శుచీ, శుభ్రతా పాటిస్తూ ఉదయం 8 గంటలకూ, సాయంత్రం 6 గంటలకూ మనస్ఫూర్తిగా తనను స్మరించుకోమన్నారు. ఆమాత్రం మనంచేస్తే మిగిలిన కథ తాను నడుపుతానన్నారు మరి ఈమాత్రంకూడా మనం చేసుకోలేకపోతే ఎలాగయ్యా? పెద్దవాళ్ళు సంప్రదాయాన్ని సరళంచేసి సామాన్యులకు అందించడానికి దిగివస్తారు. ఈ సరళ మార్గాన్ని తెలిసి, వారిచ్చిన మార్గాన్ని హృదయంతో స్వీకరించి, ఆచరించి తరించాలి. అంతేగాని వారి సరళతకు మన సోమరితనాన్ని జోడించి సంప్రదాయాన్నే భ్రష్టుపట్టించకూడదు. ఏమంటావ్!"

ఆ యువకుడు చిరునవ్వుతో "ఏమంటాను. మాలాంటి వాళ్ళు భ్రష్టుపట్టించడానికి ప్రయత్నించినా ఆ C. V. V. గారు మా ఆటలు సాగనివ్వరు. మీలాంటివాళ్ళరూపంలో వ్యక్తమై

మళ్ళీ నెత్తిన మొట్టి పట్టాలెక్కిస్తూనే ఉంటారు అంటూను" అన్నాడు

మాష్టరుగారు చిరునవ్వుతో ఆశీఃపూర్వకంగా అతని వెన్నుపైన చిన్నగా చరిచారు

## అగ్గిపుల్ల గీసే ముందు

రాత్రి 8 గంటలు దాటుతోంది మాష్టరుగారితోపాటు మేము మొంజులూరులో ఉన్నాం. బందరుకు దగ్గరలోని ఒక పల్లెటూరునుండి 30 ఏళ్ళవ్యక్తి ఒకరు వచ్చారు. ఆయన మాష్టరుగారి పుస్తకాలు చదివారట. ఎలాగైనా మాష్టరు గారిని తమ ఊరు వచ్చేటట్లు ఒప్పించి తేదీ నిర్ణయించేసుకొందా మని వచ్చారాయన. వస్తూవస్తూ తనకు మాష్టరుగారిని పుస్తక రూపంలో పరిచయంచేసిన మన బందరు సోదరబృందంలోని ఒక యువకుణ్ణి వెంటబెట్టుకొని వచ్చారు.

మాష్టరుగారు తానుచేస్తున్నపనిపూర్తి కాగానే ఇవతలకు వచ్చి వారిని పరామర్శించారు. ఆ సోదరుడు తమకోరిక తెలిపారు. ఎప్పుడూ చెప్పిన హరికథలే చెప్పించుకుంటున్నామనీ, జరిగిన పురాణ కాలక్షేపాలే మళ్ళీ జరుగుతున్నాయని చెబుతూ, మాష్టరుగారువస్తే తమఊరు చైతన్యవంతం కాగలదని ఆశా భావాన్ని ప్రకటించారు.

అంతావిని కృష్ణస్వామి ఇలా అన్నారు ; "మీరు చెప్పిన దంతా నాకు అవగతమయింది. మీ కుటుంబంవారు చేస్తున్న కృషికూడా నాకు బోధపడింది రావడానికి నాకు అభ్యంతరం లేదు నా రాకకు మీరు సిద్ధపడితే చాలు."

సిద్ధంగా ఉన్నాం అన్నట్లు చూశాడతను.

కృష్ణస్వామి ఇలా అన్నారు ; సిద్ధపడటం అంటే మీకు బోధపడిందనుకుంటాను. నన్ను పిలవవలసింది మీ గ్రామం. మీగ్రామం పిలిస్తే నేను తప్పకుండా వస్తాను గ్రామంలోని అన్నికులాల పెద్దలుకలసి నా రాకను కోరుకోవడం జరగాలి గ్రామం పిలవడమంటే అదే. అందరూకలసి ఒకచోటచేరితే నేను చెప్పవలసిన నాలుగుముక్కలు మీ గ్రామ పునర్నిర్మాణాన్ని ఉద్దేశించి ఉంటాయి. చెప్పినప్రకారం మీరు గ్రామాన్ని పునర్నిర్మించుకోవలసి ఉంటుంది. దీనికి మీ గ్రామప్రజలు సిద్ధంగా ఉన్నారేమో కదిపిచూడండి కదిపిచూడటం అంటే వేరుగా ఏమీచేయనక్కరలేదు ఏ పుస్తకాలనుచదివి స్ఫూర్తిని పొంది మీరు ఇక్కడివరకూ వచ్చారో ఆ నా పుస్తకాలను మీ గ్రామంలో చదువుకోగలిగినవారందరిచేత చదివించండి. చదువలేనివారికి చదివి వినిపించండి.

అప్పుడు మీరుపొందిన స్ఫూర్తే మీ గ్రామప్రజలుకూడా పొందితే గ్రామపునర్నిర్మాణానికి వాళ్ళు సిద్ధమయినట్లే. అప్పుడు నేను తప్పక వస్తాను. నాకు కావలసింది ధనం కాదు జనం.

తమవితాము సంస్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్న జనం వాళ్ళు-వాలి. పొయ్యి రాజేయదలుచుకున్నప్పుడు ఏంచేస్తాం - గడ్డిని చుట్టి అందులో పెడతాం పిడకలు సిద్ధంచేసుకొని ప్రక్కన పెట్టుకుంటాం ఎండిన కట్టెపుల్లలు సిద్ధంగా ఉంచుకొంటాం. అప్పుడు అగ్గిపుల్ల గీసి గడ్డిచుట్టూ అంటిస్తాం. మండుతున్న గడ్డి చుట్టమీద పిడకముక్కలు అమర్చి ఆపైన కట్టెపేళ్ళను పర్చి పెట్టడంతో పొయ్యి అంటుకోవడం జరుగుతుంది. ఈ ఏర్పాట్లేవీ చేసుకోకుండా పొయ్యిముందుకూర్చొని అగ్గిపుల్ల గీస్తావనుకో ఏం జరుగుతుంది? ఆ అగ్గిపుల్ల వెలిగినంత సేపు వెలిగి పడిపోతుంది. ఏర్పాట్లన్నీ చేసుకొని కూర్చున్నావనుకో, అగ్గిపుల్ల వెలుగుతూ కాలిపోయేలోపున నీ పొయ్యి ముట్టుకుంటుంది.

నా ఉపన్యాసం అలాంటి వెలిగే అగ్గిపుల్లలాంటిది దాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటేనే దాని ఉపయోగం లేనప్పుడు ఆకాసేపు విని ఏదో బోధపడినట్లు అనిపించి ఆతరువాత జారిపోవడం జరుగుతుంది అందుకని మీరు పొయ్యి ముట్టించేందుకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకొని రండి. నేనువచ్చి తప్పకుండా అగ్గిపుల్ల వెలిగిస్తా. నేను అక్కడ నుండి కదిలేలోపల ఆపొయ్యి ముట్టుకోవాలి మరో పదిళ్ళ వాళ్ళకి కావలిస్తే వాళ్ళ పొయ్యిలలోకి నిప్పందించగలగాలి అంటే మీగ్రామంలో మీరుపొందిన సమన్వయాన్ని మరిన్ని గ్రామాలకు మీ రందించగలగాలి. అందుకు మీరు సిద్ధపడితే మీ ఆహ్వానం అందుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఏమంటావ్?"

"అచ్చం మీ పుస్తకాల్లోలాగే చెప్పారు. మీ పుస్తకాల్లో అన్నీ ఇలాంటివే. ఇలా మేలుకొలిపేవే ఉంటాయి. నేను మా ఊరు వెళ్ళి మీరు చెప్పిన ప్రకారమే చేయడానికి తప్పక ప్రయత్నిస్తాను. నాలాగే నాతోటి గ్రామస్థులు సిద్ధమవుతారనే విశ్వాసంతో ఉన్నాను. సిద్ధపడగానే మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను. మీరు తప్పక రావాలి" అంటూ ఒకరకమైన ఉద్వేగాన్ని పొందుతూ నమస్కరించాడతను.

మాష్టరుగారు చెప్పిన తీరుతో తమ గ్రామంలో మార్పు తీసుకురావాలన్న ఆకాంక్ష ఆ ఉద్వేగంగా రూపొందినట్లు కన్పించింది.

మాష్టరుగారు అతని వెన్నుతట్టి. "ఏం ఫరవాలేదు. మీ సంకల్పం తప్పక నెరవేరుతుంది. మీ ప్రయత్నం తప్పక ఫలిస్తుంది. ఈ సి ఐందరు స్నేహితుడు నీ ప్రయత్నానికి కావలసిన సారథ్యం అందిస్తాడు. ఇద్దరూ కలిసి ముందుకు సాగండి. ఇద్దరు మరిందరుకండి. మరిమత్తులో ఉన్న మనదేశాన్ని మరామత్తు చేయండి" అంటూ ఆశీఃపూర్వకమైన చిరునవ్వుతో వారిని సాగనంపారు కృష్ణస్వామి. ●

ACC NO - 20747
040
KRI ర 8-00